ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 11.10.2025 | సంపుటి :12 సంచిక : 81 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





మరియా కోరీనానుు

# వరించిన నోబెల్ శాంతి బహుమతి

- వెనెజులాలో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటంతో దక్కిన పురస్కారం
- ఈ బహుమతి ట్రంప్‌కు అంకితమన్న విజేత

స్వీడన్(జనంసాక్షి):ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి 2025 మరియా కొరీనా మచాడోను వరించింది. ఈ విషయాన్ని నార్వే నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. వెనెజువెలాకు చెందిన మరియా కొరీనా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకు గానూ ఈ పురస్కారం లభించింది. అయితే, ఈ అత్యున్నత పురస్కారం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ ఏడాది మొత్తం 338 మంది ఈ శాంతి పురస్కారానికి నామినేట్ అవ్వగా.. అకాడమీ సభ్యులు మరియా వైపు మొగ్గుచూపారు.

మిగతా 2లో..



# ఆశలు ఆవిరి..

- డోనాల్డ్ ట్రంప్‌కి దక్కని నోబెల్ శాంతి బహుమతి

ఓస్లో(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి భారీ షాక్ తగిలింది. ట్రంప్‌కు 2025 నోబెల్ శాంతి బహుమతి దక్కలేదు. బదులుగా ప్రజాస్వామ్య పరిరక్షణ హక్కుల కోసం పోరాటం చేస్తున్న వెనుజులా ప్రతిపక్షనేత మరియా కొరీనా మచాడోకు నోబెల్ శాంతి బహుమతి దక్కింది. ఈ క్రమంలో 2025 నోబెల్ శాంతి బహుమతికి డొనాల్డ్ ట్రంప్ మిస్

మిగతా 2లో..

## శాంతి కంటే రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత

- ఈ అవార్డులతో అది మరోసారి నిరూపితమైంది
- నోబెల్ కమిటీపై వైట్‌హౌస్ తీవ్ర ఆరోపణలు

2లో

భారత అమ్ముల పొదిలోకి

## మరో అధునాతన అస్త్రం

త్వరలోనే ఆర్మీ చేతికి అవిశ్రాంత పక్షి 'మార్ట్‌లెట్.'

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత అమ్ముల పొదిలోకి త్వరలోనే మరో అధునాతన అస్త్రం చేరనుంది. రక్షణరంగంలో పరస్పర విస్తృత సహకారం కోసం భారత్-యూకే మధ్య కీలకమైన ఒప్పందం జరిగింది. దీని కింద తేలికపాటి, బహుళ ప్రయోజనకర క్షిపణి వ్యవస్థ 'మార్ట్‌లెట్'లను భారత సైన్యానికి సరఫరా చేసేందుకు

మిగతా 2లో..



బీసీ రిజర్వేషన్ నిలిపివేతపై

# భగ్గుమన్న బీసీ సంఘాలు

## హైకోర్టు తీర్పుతో 56 శాతం బీసీ ప్రజల హక్కులకు విఘాతం

ప్రభుత్వం స్పందించకపోతే బంద్ ప్రకటిస్తామని హెచ్చరిక • ఆదరబాదరగా స్టే విధించాల్సి రావడం బాధాకరంమని వ్యాఖ్య

హైదరాబాద్(జనంసాక్షి): హైకోర్టు నిర్ణయం నిర్ణయం రాష్ట్రంలోని 56 శాతం బీసీ ప్రజల హక్కులకు విఘాతం కలిగించిందని. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని, బీసీల నోటికాడి అన్నం ముద్దను లాక్కున్నారని రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమాజంలో బీసీల సత్తా ఏంటో చూపిస్తాం. స్టే విధించడం చాలా దురదృష్టకరం. రేపట్నుంచి రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని ఆర్ కృష్ణయ్య హెచ్చరించిన విషయం తెలిసిందే.తాజాగా ఈటల మాట్లాడుతూ బీసీల పట్ల కాంగ్రెస్‌కు నిజాయితీ,

మిగతా 2లో..



## 14న తెలంగాణ బంద్

పిలుపునిచ్చిన బీసీ సంఘాలు

2



## అసలు దోషి బీజేపీయే..

- బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అడ్డుపడిందే ఆ పార్టీయే..
- హైకోర్టు స్టే ఇవ్వడంతో భాజపా నేతలు సంబరాలు చేసుకుంటున్నారు
- మండిపడ్డ కూనంనేని

హైదరాబాద్(జనంసాక్షి):బీసీ రిజర్వేషన్ల అంశంలో అసల దోషి బిజెపి అని సిపిఐ ఆరోపించింది. ఈ బిల్లును తొక్కి పెట్టడంలో

మిగతా 2లో..

బంజారాహిల్స్‌లో హైడ్రా

# భారీ ఆపరేషన్

- 5 ఎకరాల్లో ఆక్రమణల తొలగింపు
- భూమి విలువ రూ.750 కోట్లు

పలుచోట్ల 7.50 ఎకరాల కబ్జాలకు విముక్తి



బంజారాహిల్స్‌లో ఆక్రమణలను హైడ్రా తొలగించి, 5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.750 కోట్ల విలువైన భూమిగా అధికారులు గుర్తించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఆక్రమణలను గుర్తించిన హైడ్రా శుక్రవారం బారీ బందోబస్తు మధ్య తొలగించింది.

12లో..



## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. "కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ (ఛత్తీస్‌గఢ్) మావోయిస్టు పార్టీ నుంచి బయటికొచ్చి జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు. ఈ ముగ్గురూ మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులు. సిద్దిపేట జిల్లాకు చెందిన కుంకటి వెంకటయ్య 1990లో పీడబ్ల్యూడీ ఏర్పాటు చేసిన రైతు కూలీ సభలకు హాజరై.. అదే ఏడాది అజ్ఞాతంలోకి వెళ్లారు.పిడబ్ల్యూడీ కమాండర్ బాలన్న ఆధ్వర్యంలో దళంలో చేరారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి 35 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపును అందుకుని.. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగరం మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచర్ల వెంకటరాజు(45) .. 11 ఏళ్ల వయసులోనే విప్లవగీతాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరారు. 1993లో నర్సంపేట

మిగతా 2లో..

## అఫ్గాన్‌తో ఆటలొద్దు

మా గడ్డపై భారత్‌కు వ్యతిరేక చర్యలను అనుమతించం

తాలిబాన్ విదేశాంగ శాఖ మంత్రి అమిర్ ఖాన్ ముత్తకీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):అఫ్గాన్ భూభాగంలో ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలను అనుమతించబోమని తాలిబాన్ విదేశాంగ శాఖ మంత్రి అమిర్ ఖాన్ ముత్తకీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ఆయన మీడియా సమావేశంలో పాక్‌ను ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్గానిస్థానీల ధైర్యసాహసాలకు పరీక్ష పెట్టొద్దని కూడా గట్టి వార్నింగ్ ఇచ్చారు. కాబుల్‌లోని తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులను టార్గెట్ చేస్తూ పాక్ దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. అయితే, అఫ్గాన్ కేంద్రంగా చేసుకుని తమపై దాడులు చేస్తున్న ఉగ్రవాదుల తీరుతో సహనం

మిగతా 2లో..





## రియల్ ఎస్టేట్‌లో రాష్ట్రం దూసుకుపోతోంది

### హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- నగరంలో అభివృద్ధి పనులకు ఏటా రూ.10వేల కోట్లు
- రాయదుర్గంలో ఎకరం 177 కోట్లు పలికింది
- బిల్డర్లు మధ్య, దిగువ మధ్య తరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకోవాలి
- భవిష్యత్తులో హైదరాబాదులో అన్ని ఎలక్ట్రికల్ బస్సులే
- డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్ మహా నగరం సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం హైటెక్స్లో జరిగిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ 15వ సమావేశంలో డిప్యూటీ సీఎం ముఖ్యఅ తిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ప్రజలు ఆతిథ్యానికి ఇచ్చినంత ప్రాధాన్యత దేశం లోని ఏ రాష్ట్రంలో కనబడదు, స్నేహితులు, బంధువులు ఇంటికి వస్తే ఆ రోజు పండుగ జరుపుకునే మనస్తత్వం తెలంగాణ ప్రజలది అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిలో బిల్డర్లు, రియల్టర్లు భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. దట్టమైన అడవులు, వాటి లోపల ఉన్న జలపాతాలు, టైగర్ ఫారెస్ట్ లు ఉన్నాయన్నారు. హైదరాబాదులో అంతర్జాతీయ విమానాశ్రయం, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి రియల్టర్లు వివిధ వర్గాలను ఆ ప్రాంతాలకు విరివిగా తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం కోరారు. ప్రతి సంవత్సరం పట్టణ అభివృద్ధికి ప్రణాళిక వ్యయంలో భాగంగా బడ్జెట్లో పదివేల కోట్లు కేటాయిస్తున్నాం అన్నారు. రెండు సంవత్సరాల్లో 20 వేల కోట్లు కేటాయించి చేపట్టిన పనుల ఫలితాలు ఇప్పుడు ఇప్పుడే కనిపిస్తున్నాయి, ఈ పనులు హైదరాబాద్ రూపురేఖలను మారుస్తాయి అన్నారు. ఇటీవల 39 ఎస్టీపీ ట్రీట్మెంట్ ప్లాంట్స్ పనులకు ఆమోదం తెలిపారు.సీనరేజి ప్లాంట్లు, తాగునీటి అవసరాల కోసం సుమారు 11,927 కోట్లు ఖర్చు చేస్తున్నాం అన్నారు. 13,704 కోట్ల వ్యయంతో మరికొన్ని

మిగతా 2లో..

హెచ్-1బీ వీసా

# మరింత కఠినం

జారీ నిబంధనల్లో మరిన్ని మార్పులు! • లక్ష డాలర్ల షాక్ మర్చిపోకముందే మరో షాక్




వాషింగ్టన్(జనంసాక్షి):కొత్తగా జారీ చేసే హెచ్-1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన లక్ష డాలర్ల ఫీజు ఇప్పటికే మన దేశంలోని ఐటీ రంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి సమయంలో హెచ్-1బీ వీసా కార్యక్రమంలో మరిన్ని మార్పులను ట్రంప్ కార్యవర్గం ప్రతిపాదించింది. 'రిఫార్మింగ్ ద హెచ్-1బీ నాన్‌ఇమిగ్రెంట్స్ వీసా క్లాసిఫికేషన్ ప్రోగ్రామ్' కింద ఈ కొత్త ప్రతిపాదనలు ఫెడరల్ రిజిస్టర్‌లో నమోదయ్యాయి.డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ చేసిన ప్రతిపాదనల మేరకు.. వీసా పరిమితి మినహాయింపుల అర్హతను మరింత కఠినతరం చేయడంతో పాటు వీసా ప్రోగ్రామ్ నిబంధనలను ఉల్లంఘించిన యాజమాన్యాలపై, థర్డ్ పార్టీ నియామకాలపై మరింత దృష్టిసారించనున్నారు. "ఈ మార్పులు హెచ్-1బీ వీసా కార్యక్రమం సమగ్ర తను మెరుగుపర్చడానికి, యూఎస్ కార్మికుల వేతనాలు, పని ప్రదేశాల్లో పరిస్థితులకు రక్షణ కల్పించడం కోసం తీసుకువచ్చినవి" అని ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. అయితే ఈ ప్రతిపాదనల అమలు విషయంలో మాత్రం పూర్తిస్థాయి స్పష్టత లేదు. మినహాయింపుల పరిమితిలో మార్పులు చేస్తే.. లాభాపేక్ష లేని పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, హెల్త్‌కేర్ సంస్థలు తమకు అందు తున్న ప్రయోజనాలను కోల్పోతాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అలాగే అమెరికా కల కంటోన్న వేలాది మంది భారత విద్యార్థులు, ఆ దేశంలో పని చేయాలని కోరుకుంటున్న యువ నిపుణులపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నాయి.

మిగతా 2లో..

## దీపావళికి బాణాసంచా కాల్చనివ్వండి

సుప్రీంకోర్టును అభ్యర్థించిన రాష్ట్రాలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):దిల్లీ ఎన్సీఆర్ పరిధిలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలోనే ఉన్నందున బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం గత ఏప్రిల్ 3న తీర్పునిచ్చింది. ఈ విషయంపై పలు రాష్ట్రాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీపావళి కోసం పిల్లలు ఎదురుచూస్తారని.. పర్యావరణహితమైన

మిగతా 2లో..

## అవినీతి తిమింగలం

కిలోల కొద్దీ వెండి, బంగారం, నగదు, లగ్జరీ కార్లు, 17 టన్నుల తేనె

మధ్యప్రదేశ్ ప్రభుత్వ అధికారి జీపీ మెహ్రా అవినీతి బాగోతం

2లో..

# గాజా శాంతి ప్రణాళికకు సై

- ఆమోదించిన ఇజ్రాయిల్ కేబినెట్
- ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో ప్రసంగానికి ట్రంప్‌కు ఆహ్వానం

న్యూఢిల్లీ(జనంసాక్షి):గాజా శాంతి ప్రణాళికను ఇజ్రాయిల్ కేబినెట్ శుక్రవారం తెల్లవారుజామున ఆమోదించింది. ఇది మధ్యప్రాచ్యాన్ని అస్థిరపరిచిన రెండేళ్ల వినాశకరమైన యుద్ధాన్ని ముగించే దిశగా కీలకమైన అడుగుగా భావించాలి. బందీలను విడుదల చేసే ఒప్పందం మేరకు క్యాబినెట్ ఆమోదించిందని ప్రధాని నెతన్యాహూ కార్యాలయం నుండి విడుదలైన సంక్షిప్త ప్రకటన తెలిపింది. అయితే ఈ ప్రణాళికలోని ఇతర అంశాలను ప్రస్తావించలేదు. కేబినెట్ ఓటింగ్‌కు కొన్ని గంటల ముందు కూడా ఇజ్రాయిల్ దాడులు కొనసాగాయి. గురువారం ఉత్తర గాజాలో పేలుళ్లు కనిపించాయి. గాజా నగరంలోని ఒక భవనంపై జరిగిన దాడిలో సుమారు ఇద్దరు మరణించగా, 40మందికి పైగా శిథిలాల కింద చిక్కుకున్నారని పాలస్తీనా పౌర రక్షణ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో సుమారు 11 మంది పాలస్తీనియన్లు మరణించగా, 49మంది గాయపడి ఆస్పత్రులను చేరుకున్నారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత రెండేళ్లుగా ఇజ్రాయిల్ గాజాపై జరిపిన దాడిలో 67,000 మంది పాలస్తీనియన్లు మరణించారు. సుమారు 1,70,000 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మృతుల్లో అత్యధికశాతం మంది మహిళలు, చిన్నారులే పేర్కొంది. ఇకపోతే చరిత్రాత్మక గాజా శాంతి



మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
11.10.2025



తల్లి మరణంతో దుఃఖంలో ఉన్న నిజామాబాద్ (గ్రామీణ) శాసనసభ్యుడు భూపతి రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. నిజామాబాద్‌లో జరిగిన భూపతి రెడ్డి తల్లి లక్ష్మీ నరసమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క సలహాదారు వేం నరేందర్ రెడ్డి మహమ్మద్ అలీ షబ్బీర్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ నిలిపివేతపై భగ్గుమన్న బీసీ సంఘాలు

చిత్తశుద్ధి లేదని బీజే పీ ఎంపీ ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ పరువు తీసుకుందన్నారు. కాం గ్రెస్ ఇంత మూర్ఖంగా వ్యవహరిస్తుందని ఎవరూ అనుకోలేదని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజల ను రేవంత్ రెడ్డి వంచించారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు సలహాలు ఇచ్చింది ఎవరో అర్థం కాలేదని తెలిపారు. బీసీ రిజర్వేషన్ అంశం రాజ్యాంగానికి సంబంధించినదన్నారు. రేవంత్ రెడ్డికి సత్తా ఉంటే.. ఢిల్లీలో ధర్నా ఎందుకు చేశారో తెలియదన్నారు. కాంగ్రెస్ నేతలు చెంపలేసుకుని.. ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే జరిపించాలని పట్టుబడ్డారు. హామీ ఇచ్చే ముందు కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందో తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లోపు పాత సర్పంచ్‌లకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఎంపీ డిమాండ్ చేశారు. 'హుజురాబాద్‌లో బీ ఫామ్స్ నేనే ఇస్తా.. ఇక్కడ నేను 25 ఏళ్లుగా లీడర్‌ను.. నేను కాకుండా బీ ఫామ్స్ ఇంకెవరు ఇస్తారు' అని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ ప్రశ్నించారు.బీసీలను బిఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, బీ ఆర్ఎస్ జీన్స్ ఒక్కటేనని ఎద్దేవా చేశారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గ్రేటర్ పరిధి జిల్లాల సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపాతోనే బీసీలకు న్యాయం జరుగుతుందనే నిర్ణయానికి ప్రజలు కూడా వచ్చారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందని చెప్పారు. నగరాన్ని ప్రపంచానికే తలమానికంగా మారుస్తామని భారత రాష్ట్ర సమితి గతంలో చెప్పింది.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు పడలేదు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చింది. ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగాయి. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తాం. ఈ ఉప ఎన్నికలో గెలిచి ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలి. రేపటి నుంచి కార్యకర్తలు, నేతలు జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేయాలి. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందాన్ని తిప్పికొట్టాలని రామచందర్‌రావు కోరారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణ రాష్ట్రంలో సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో తాము గెలుస్తామని పూర్తి నమ్మకం ఉందని, ప్రజలపై విశ్వాసం ఉందని ఉద్ఘాటించారు. విశ్వనగరం పేరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నగర ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయని ఆక్షేపించారు. వర్షం వస్తే ప్రాణాలు పోయే పరిస్థితులు నగరంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎర్రగడ్డలో కాలనీల మధ్య ముస్లింలకు శ్మశాన వాటికలు ఎలా కేటాయిస్తున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ దేవాలయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చేస్తోందని ఆరోపించారు. నగరంలో హిందువులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుంచి బీజేపీ శ్రేణులు ప్రతి ఒక్కరూ జూబ్లీహిల్స్‌లో గ్రౌండ్ లేవల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. బీసీలను బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని ధ్వజమెత్తారు. బీజేపీ వల్లే బీసీలకు న్యాయం జరుగుతోందని ప్రజలు కూడా ఈ నిర్ణయానికి వచ్చారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాము గెలుస్తామనే పూర్తి నమ్మకం ఉందని రాంచందర్ రావు ఉద్ఘాటించారు.ఈ సమావేశానికి రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు, ఎమ్మెల్సీలు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీల సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక, ప్రచార కార్యక్రమాలు, గెలుపు వ్యూహాలపై చర్చించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎలక్షన్ లో బీసీలకు 42 శాతం డిక్లరేషన్ చేస్తామని అన్నారు కానీ నేటికీ అది అమలు కాలేదని బీసీల రిజర్వేషన్లు ఇచ్చినట్టే ఇచ్చి అడ్డుకున్నారు అన్నారు. తొగుట మండల కేంద్రంలో అన్ని పార్టీలకు సంబంధించిన బీసీ నాయకులు సమావేశమై 42 శాతం బీసీలకు కేటాయించిన రిజర్వేషన్ ఇవ్వాలని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎలక్షన్ లో బీసీలకు 42 శాతం డిక్లరేషన్ చేస్తామని అన్నారు

## అసలు దోషి బీజేపీయే...

బిజెపి పాత్ర ఉందన్నారు. దీనిపై హైకోర్టు స్టే ఇవ్వడంతో భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు సంబరాలు చేసుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. వారికి కనీసం బాధ కూడా లేదని విమర్శించారు. ఇది ప్రభుత్వంపై ద్వేషమా.. బీసీలపై ప్రేమ లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు. అసెంబ్లీలో మద్దతు తెలిపి ఇప్పుడు సన్నాయి నొక్కులు ఎందుకన్నారు. బీసీ బిల్లుకు మేం మద్దతిచ్చాం.. కేసులో కూడా ఇంప్లీడ్ అయ్యాం. మీరెందుకు కాలేదని కూనంనేని ప్రశ్నించారు. సుప్రీంలో 50శాతం దాటొద్దని తీర్పు ఉంది. 9వ షెడ్యూల్‌లో పెట్టడం ద్వారా తమిళనాడులో ప్రత్యేక పరిస్థితుల్లో అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు అమలుచేశారు. రాజ్యాంగాన్ని సవరించే అవకాశం కేంద్రానికి ఉన్నా చేయడం లేదు. దీనికి బాధ్యత మొత్తం భాజపా పైనే ఉంద న్నారు. కానీ డొంకతిరుగుడు రాజకీయాలతో ప్రజలను పార్టీ నేతలు గందరగోళానికి గురిచే స్తున్నారని కూనంనేని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో దోషి భాజపా.. వాళ్లకు మద్దతిస్తోంది భారత రాష్ట్ర సమితి. అన్ని పార్టీల నేతలను దిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రె స్‌పై ఉంది. అవసరమైతే.. అన్ని పార్టీలతో జంతర్ మంతర్ వద్ద ధర్నా ఏర్పాటు చేయాల న్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే రిజర్వేషన్ల విషయంలో దేశవ్యాప్తంగా ముందడుగు పడుతుందని కూనంనేని సాంబశివరావు అన్నారు. అలాగే బిజెపి నయవంతచక రాజకీయాలను ఎండగట్టాల్సి ఉందన్నారు.

## హెచ్-1బీ వీసా మరింత కఠినం

ఈ కొత్త నిబంధనలు డిసెంబర్ 2025లో వెలువడే అవకాశం ఉంది.ఇదిలాఉంటే.. ట్రంప్ తీసుకువచ్చిన లక్ష డాలర్ల ఫీజు గత నెల నుంచే అమలవుతోంది. ఇందుకోసం అధ్యక్షుడు జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఒక ఏడాది పాటు అమల్లో ఉంటుంది. ఈలోపు అమెరికా చట్టసభ కాంగ్రెస్‌లో చట్టం చేస్తే, ఆ తర్వాత పూర్తిస్థాయిలో అమల్లో ఉంటుంది. మన దేశం నుంచి హెచ్-1బీ వీసాపై అమెరికాకు వెళ్లే ఒక ఉద్యోగి సగటు వార్షిక వేతనం 60,000- 1,40,000 డాలర్ల మధ్యలో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో హెచ్-1బీ వీసా కోసం ఒక ఉద్యోగిపై లక్ష డాలర్ల ఫీజు చెల్లించడానికి కంపెనీలు ముందుకురావడం కష్టమనే ఆందోళనా ఉంది. మరోవైపు, హెచ్1బీ కొత్త వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచినా, దేశీయ ఐటీ కంపెనీలపై ప్రభావం మరీ అధికంగా ఏమీ ఉండదని రేటింగ్ సంస్థ క్రిసిల్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆందోళన వ్యక్తమవుతోన్నప్పటికీ.. వీసా ప్రోగ్రామ్‌లో మార్పులు మాత్రం ఆగడం లేదు. హెచ్-1బీ కోసం ప్రస్తుతమున్న లాటరీ విధానాన్ని మార్చేలా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఇప్పటికే ప్రతిపాదనలు చేసిన సంగతి తెలిసిందే.

## అవినీతి తిమింగలం

**భోపాల్(జనంసాక్షి):** కోట్ల రూపాయల విలువ చేసే బంగారం, కిలోల కొద్దీ వెండి, లెక్కపెట్టలేనంత డబ్బు, లగ్జరీ కార్లు, టన్నుల కొద్దీ తేనె.. ఏంటి లెక్కలు అనుకుంటున్నారా? ఒక అవినీతి తిమింగలం ఇంట్లో దొరికిన అక్రమ సంపద ఇది.మధ్యప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన రిటైర్డ్ ఇంజినీర్-ఇన్-చీఫ్ భోపాల్ జీపీ మెహ్రా అవినీతి బాగోతం దర్యాప్తు అధికారులనే నివ్వెర పోయేలా చేసింది.క్రైమ్ థ్రిల్లర్‌ను తలపించే ఈ స్టోరీ గురువారం నాటి దాడుల్లో వెలుగులోకి వచ్చింది. అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోకాయుక్త రిటైర్డ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇంజనీర్ మెహ్రాకు భోపాల్‌లోని మణిపురం కాలనీలోని అతని నివాసం, ఇతర ఆస్తులపై అధి?కారులు దాడి చేశారు. ఈ సందర్భంగా కళ్లుచెదిరే సంపదను గుర్తించారు. డబ్బులను లెక్కపెట్టేందుకు యంత్రాలను తెప్పించాల్సివ చ్చిందం టే పరిస్థితి ఊహించుకోవచ్చు. ఇటీవలి కాలంలో మధ్యప్రదేశ్‌లో అత్యంత సంచలనాత్మక అవినీతి కథలలో ఒకటిగా నిలిచింది. లోకాయుక్తలోని నలుగురు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారులు భోపాల్ ,నర్మదాపురంలోని నాలుగు ప్రదేశాలలో దాడుల బృందాలు దాడులు నిర్వహించాయి. జి పి మెహ్రా తన పదవీకాలంలో అవినీతితి భారీ సంపదను కూడబెట్టారనే ఫిర్యాదుల ఆధారంగా లోకాయుక్త డైరెక్టర్ జనరల్ యోగేష్ దేశ్‌ముఖ పర్యవేక్షణలో ఈ సోదాలు నిర్వహించినట్లు భోపాల్ లోకాయుక్త ఎస్పీ డి రాథోడ్ పిటిఐకి తెలిపారు.మణిపురం కాలనీ , దానా పానీ సమీపంలోని ఓపాల్ రీజెన్సీ, భోపాల్‌లోని గోవింద్‌పుర పారిశ్రామిక ప్రాంతంలోని అతని ఫ్యాక్టరీ కె టి ఇండస్ట్రీస్, నర్మదాపురం జిల్లాలోని సోహాగ్‌పూర్ తహసీల్ పరిధిలోని సైని గ్రామంలోని ఆస్తులపై ఏకకాలంలో సోదాలు నిర్వహించినట్లు లోకాయుక్త తెలిపింది. ఈ సోదాల్లో కోట్లకు పైగా విలువైన బంగారం , కిలోల కొద్దీ వెండి దొరికింది. అంతేకాదు ఫామ్‌హౌస్‌లో చక్కగా పేర్చబడిన 17 టన్నుల తేనె దొరకడ మరింత ఆశ్చర్యకరంగా నిలిచింది.

## భారత అమ్ముల పొదిలోకి మరో అధునాతన అస్త్రం

అంగీ కారం కుదిరింది. ఈ ఒప్పందంతో భారత గగనతల రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుందని కేంద్రం తమ ప్రకటనలో వెల్లడించింది. ఇంతకీ ఏంటీ 'మార్ట్‌లెట్' క్షిపణులు అవి ఎలా పనిచేస్తాయి?ఈ మార్ట్‌లెట్ క్షిపణులను ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌కు చెందిన 'థేల్స్ ఎయిర్ డిఫెన్స్' అనే రక్షణరంగ సంస్థ అభివృద్ధి చేస్తోంది. పురాణాలు, ఇతిహాసాల్లో ఉండే 'మార్ట్‌లెట్' అనే పక్షి పేరు మీదుగా ఈ క్షిపణులకు పేరు పెట్టారు. ఎప్పుడూ విశ్రాంతి తీసుకోని, అలుపెరగని పక్షి అని దీని అర్థం. ఇవి తేలికపాటి, బహుళ ప్రయోజనకర ఎయిర్-టు-ఎయిర్, ఎయిర్-టు-సర్ఫేస్, సర్ఫేస్-టు-సర్ఫేస్, సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు.

6 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను..

గగనతల రక్షణతో పాటు డ్రోన్లు, సాయుధ వాహనాలు వంటి మిలిటరీ టార్గెట్‌లను కూడా ఛేదించేలా వీటిని రూపొందించారు. లేజర్ బీమ్ గైడెన్స్ ఆధారంగా రూపొందించిన ఈ క్షిపణిని పదాతిదళ సైనికులు భుజంపై ఉంచుకొని ప్రయోగించే వీలు ఉంటుంది. సాయుధ వాహనాలకు అనుసంధానం చేసి హెలికాప్టర్లు, నౌకల నుంచి కూడా ప్రయోగించొచ్చు. ఆరు కిలోమీటర్ల పరిధిలో భూ, గగనతల ముప్పును ఈ క్షిపణులు ఎదుర్కోగలవు. 13 కిలోల బరువు ఉండే ఈ మిసైల్స్ ధ్వని వేగం కంటే ఒకటిన్నర రెట్లు వేగంగా దూసుకెళ్లగలవు. వీటిని 2019 నుంచి బ్రిటిష్ మిలిటరీలో వినియోగిస్తున్నారు. ఇవే క్షిపణులను ప్రస్తుతం రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ వినియోగిస్తోంది.

భారత నేవీ కోసం రోల్స్ రాయిస్..

మరోవైపు, భారత నౌకాదళంతో కలిసి పనిచేసేందుకు బ్రిటన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్‌రాయిస్ ఆసక్తి కనబర్చింది. నౌకాదళం అభివృద్ధి చేస్తున్న దేశీయ తొలి ఎలక్ట్రిక్ యుద్ధ నౌక డిజైనింగ్‌లో ఈ కంపెనీ భాగస్వామి కానున్నట్లు తెలుస్తోంది. ఈ యుద్ధ నౌకకు హైబ్రీడ్ ఎలక్ట్రిక్, పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను అందించనున్నట్లు సమాచారం.

## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలు

దళంలో రిక్రూట్ అయి రాష్ట్రస్థాయి కమిటీలో వివిధ హోదాల్లో పనిచేశారు. మావోయిస్టులతో వచ్చిన సైద్ధాంతిక విభేదాల కారణంగా, పోలీసులు ఇచ్చిన పిలుపును అందుకుని అతని భార్య తోడెం గంగతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇటీవల కాలంలో 403 మంది మావోయిస్టులు పోలీసులు ఎదుట లొంగిపోయారు" అని డీజీపీ తెలిపారు.

## 14న తెలంగాణ బంద్

**పిలుపునిచ్చిన బీసీ సంఘాలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. అయితే, బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన హైకోర్టు స్టేపై బీసీ సంఘాలు గుర్రుగా ఉన్నాయి. ఈ మేరకు బీసీ సంఘం నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఈనెల 14న బంద్‌కు పిలుపు నిచ్చారు. రిజర్వేషన్ల అంశం తేలకుండా పాత పద్ధతి ప్రకారం ఎన్నికలకు వెళ్తామంటే కుదరదని చెప్పారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు.

## అఫ్ఘాన్‌తో ఆటలొద్దు..

నశించి ప్రతి దాడి చేస్తు?న్నామని పాక్ పేర్కొనడం గమనార్హం. పాక్ దాడులపై అఫ్ఘాన్ మంత్రి ముత్తకీ స్పందించారు. 'సరిహద్దుకు సమీపంలోని ప్రాంతాలపై దాడులు జరిగినట్టు తెలుస్తోంది. పాక్ తప్పు చేస్తోంది. దాదాపు 40 ఏళ్ల తరువాత అఫ్ఘానిస్థాన్‌లో శాంతి నెలకొంది. అభివృద్ధి కనిపిస్తోంది. ఈ సమయంలో మా ధైర్యసాహసాలను పరీక్షించే ప్రయత్నం చేయొద్దు. ఇలా చేస్తే ఏం జరుగుతోందో రష్యా, అమెరికా, నాటోలను వెళ్లి అడగొచ్చు. అఫ్ఘాన్‌తో గేమ్స్ వద్దని వారు చెబుతారు' అని ముత్తకీ వార్నింగ్ ఇచ్చారు. సీమాంతర ఉగ్రవాదం అంశంలో గత కొన్ని నెలలుగా పాక్, అఫ్ఘానిస్థాన్ మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో తాలిబన్ ప్రభుత్వం భారత్‌కు దౌత్య బంధాలు మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నించడం పాక్‌కు కంటగింపుగా మారింది. ఈ క్రమంలోనే సీమాంతర దాడులకు దిగొద్దంటూ పాక్‌ను అఫ్ఘాన్ మంత్రి హెచ్చరించారు. ఇలాంటి చర్యలతో సమస్యలు పరిష్కారం కావని హెచ్చరించారు. ఇక అఫ్ఘానిస్థాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్యానికి తాము పూర్తి మద్దతు ఇస్తామని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ముత్తకీకి భరోసా ఇచ్చారు.

## దీపావళికి బాణాసంచా కాల్చనివ్వండి

బాణసంచాతో వారిని పండగ చేసుకోవడానికి అనుమతించాలని న్యాయస్థానాన్ని కోరాయి. దీపావళి రోజున రాత్రి 8 నుంచి 10 వరకు రెండు గంటలపాటు పర్యావరణ హితమైన బాణసంచా కాల్చడానికి అనుమతివ్వాలని ఎన్సీఆర్ రాష్ట్రాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనాన్ని కోరారు. కొన్ని షరతుల కింద రాష్ట్రాల్లో బాణసంచా వాడకాన్ని అనుమతించవచ్చని, జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ ఆమోదించిన పర్యావరణహిత బాణసంచా మాత్రమే తయారు చేసి, విక్రయించేలా సూచించాలని తుషార్ మెహతా పేర్కొన్నారు. అత్యధిక పేలుడు స్వభావమున్న టపాసులు తయారు చేయకుండా రాష్ట్రాలు, దిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటాయని ధర్మాసనానికి తెలియజేశారు.

# మరియా కొరీనాను వరించిన నోబెల్ శాంతి బహుమతి

వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మచాడోకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో మచాడో ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. గత ఏడాది కాలంగా అజ్ఞాతంలో జీవించాల్సి వచ్చిందని పేర్కొంది. ఆమె వెనెజువెలా పార్లమెంట్ సభ్యురాలిగా, దేశ విపక్ష నేతగా పనిచేశారు. వెనెజువెలా సైనికీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన ఆమె.. శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్యం కోసం కృషిచేసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని నోబెల్ కమిటీ వెల్లడించింది. నోబెల్ శాంతి బహుమతిని 1901 నుంచి 105 సార్లు ప్రకటించారు. ఇందులో 111 మంది వ్యక్తులు, 31 సంస్థలు ఇప్పటివరకు ఈ పురస్కారాన్ని అందుకున్నాయి. ఈ అవార్డు అందుకున్న అతిపిన్న వయస్కురాలిగా పాకిస్థాన్‌కు చెందిన హక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ నిలువగా.. జోసెఫ్ రాట్‌బ్లాట్ 86 ఏళ్ల వయసులో దీనిని అందుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి వెనెజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోను వరించింది. ఆ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం చేసిన పోరాటానికి గాను ఆమెను ఈ బహుమతికి ఎంపిక చేశారు. నోబెల్ శాంతి బహుమతికి మరియా కొరినా ఎంపిక కావడంతో.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ బహుమతిపై పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. నోబెల్ శాంతి



బహుమతి అందుకోవాలని ట్రంప్ అధ్యక్ష పీఠంపై ఎక్కిన నాటి నుంచి తహతహలాడిపోతున్నారు. ఆ క్రమంలోనే పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పీవోకేతోపాటు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం దాడులు చేపట్టింది. కొన్ని గంటల తర్వాత ఈ దాడులు ఆగిపోయాయి. దీంతో ఈ దాడులు తన ఆదేశాలకు అనుగుణంగానే ఆగిపోయాయంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ వేదికల మీద నుంచి పలు సందర్భాల్లో ప్రపంచానికి చాటే ప్రయత్నాన్ని చేశారు. కానీ ట్రంప్ చేసిన ఈ తరహా వ్యాఖ్యలను భారత్ నిర్ద్వంద్వంగా తొసిపుచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా గాజా-హమాస్ యుద్ధవిరమణకు ఒత్తిడి తెచ్చారు. అయినా ఆశలు దక్కలేదు.

**నోబెల్ శాంతి పురస్కారం ట్రంప్‌నకు అంకితం: మరియా కొరీనా**

ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ.. చివరకు వెనెజువెలా హక్కుల కార్యకర్త మరియా కొరీనా మచాడోను ఈ పురస్కారం వరించింది. దీనిపై తాజాగా మచాడో తన సోషల్ మీడియా ఖాతాలో స్పందిస్తూ.. ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ పురస్కారాన్ని వెనెజువెలా ప్రజలతోపాటు తమ ఉద్యమానికి మద్దతుగా నిలుస్తోన్న డొనాల్డ్ ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నానని చెప్పారు."వెనెజువెలా ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించడం మా పోరాటం ముగింపునకు ఊతమిస్తుంది. స్వేచ్ఛ పొందేందుకు దోహదపడుతుంది. విజయానికి దగ్గరలో ఉన్నాం. గతంలో లేనంతగా అధ్యక్షుడు ట్రంప్, అమెరికా, లాటిన్ అమెరికా ప్రజలపై ఆధారపడతాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు ప్రధాన మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్ణయాత్మక మద్దతు ఇస్తున్న అధ్యక్షుడు ట్రంప్‌నకు అంకితం చేస్తున్నా" అని మరియా పేర్కొన్నారు.అంతకుముందు నార్వే నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ క్రిస్టియన్ బ్రెగ్ హార్ప్‌విక్‌న్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శాంతి పురస్కారాన్ని ఇవ్వనున్న విషయాన్ని ఆమెకు ముందుగానే తెలియజేశారు. "నాకు ఈ పురస్కారం రావడం నమ్మలేకపోతున్నా. మాటలు రావట్లేదు. వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు. మేము సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఇందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం. తప్పకుండా విజయం సాధిస్తాం. ఇదో ఉద్యమం అని మీరు అర్థం చేసుకున్నారని భావిస్తున్నా. అయితే, ఇది నా ఒక్కరి గెలుపు కాదు. వ్యక్తిగతంగా నేను దీనికి అర్హురాలిని కాదని అనుకుంటున్నా. ఇది సమాజం మొత్తం సాధించిన విజయం. మా ప్రజలకు లభించిన అతిపెద్ద గుర్తింపు" అని మరియా కొరీనా పేర్కొన్నారు.వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మరియా కొరీనాకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నార్వే నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. ఏడాది కాలంగా అజ్ఞాతంలో ఉండాల్సి వచ్చిందని పేర్కొంది.

# రియల్ ఎస్టేట్‌లో రాష్ట్రం దూసుకుపోతోంది

తాగునీటి, సీవరేజీ ప్లాంట్ పనులు ప్రతిపాదనలో ఉన్నాయని వివరించారు. మొత్తంగా సీవరేజీ, తాగునీటి సరఫరా కోసం 25,631 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ వేలంలో ఎకరం 177 కోట్లు పలికిందంటే హైదరాబాదులో రియల్ ఎస్టేట్ ఎంత వేగంగా దూసుకు వెళ్తుందో అర్థమవుతుంది అన్నారు. ఈ వేలము లో పాల్గొన్న 25 మంది బిల్డర్లు ఎకరాకు 150 కోట్ల వరకు ధరను కోట్ చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి నేషనల్ హైవేను కలుపుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు 1,487 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఢిల్లీలో మకాం వేసి కేంద్ర డిఫెన్స్ మంత్రిని ఒప్పించి రక్షణ శాఖ భూములను వినియోగించుకునేందుకు అనుమతి సాధించారని డిప్యూటీ సీఎం తెలిపారు. షామీర్పేటలో 3,619 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నామని వివరించారు. దేశంలోని ఇతర ఏ నగరాల్లో లేనివిధంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్తు, మంచినీటి సరఫరా హైదరాబాద్ నగరంలోనే జరుగుతుంది అన్నారు.గతంలో ఉన్న మంజీరా, గండిపేటకు తోడు గోదావరి నీళ్లు తరలిస్తున్నాము ఇవి నగర ప్రజలకు పరిశ్రమలకు పెద్ద ఆస్తి అన్నారు. హైదరాబాద్ నగరం లోని సరస్సులు, అందమైన రాతిగుట్టలు, పార్కులను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాలి అన్నారు. ప్రజా ప్రభుత్వం బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్నారు. బిల్డ్ నౌ డిజిటల్ ప్లాట్ ఫామ్ ఏర్పాటుచేసి నిర్మాణ అనుమతులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసేలా పసుపు ఏర్పాట్లు చేసింది అన్నారు. హైదరాబాదులో క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చే క్రమంలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకు వస్తున్న అన్నారు.భవిష్యత్తులో హైదరాబాద్ నగరంలో అన్ని ఎలక్ట్రికల్ బస్సులే ఉంటాయి అని తెలిపారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపులు ఇచ్చాం అన్నారు. విద్య, వైద్యం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలు అన్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో ఉచితంగా విద్యను అందించేందుకు ఒక్కో పాఠశాల 25 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నాం, ఇందుకుగాను 11,500 కోట్ల బడ్జెట్ కేటాయించి పాఠశాలల నిర్మాణానికి టెండర్లు పిలిచాము అన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నేరెడ్కో ప్రతినిధులునిధులను విద్య, వైద్యరంగంపై పెద్ద మొత్తంలో ఖర్చు చేయండి, ఖర్చు చేసిన నిధులకు సంబంధించి జిల్లా కలెక్టర్ల ద్వారా సర్టిఫికెట్లు పొందండి అని సూచించారు. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే పరిమితం కావొద్దు మధ్యతరగతి దిగువ మధ్యతరగతి వర్గాల ను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేయండి అన్నారు. రియల్టర్లు, బిల్డర్లను రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టికర్తలుగా గౌరవిస్తుంది. మీ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాదులో జరుగుతున్న అభివృద్ధిని ప్రాపర్టీ షో ద్వారా రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తూ అభివృద్ధికి దోహదపడుతున్న నేరెడ్కో బృందానికి ముఖ్యమంత్రి లేబర్ రెడ్డి యావత్ క్యాబినెట్ పక్షాన అభినందనలు అని డిప్యూటీ సీఎం తెలిపారు.రియల్ ఎస్టేట్ రంగం తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైటెక్స్ నిర్వహించిన "నారెడ్కో తెలంగాణ 15వ ప్రాపర్టీ షో"ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. దేశంలోనే వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిలో రియల్ ఎస్టేట్ రంగం కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం తీసుకొస్తున్న పురోగమక విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయని తెలిపారు. ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల విస్తరణకు రియల్ ఎస్టేట్ కీలక మౌలిక సదుపాయాలను అందిస్తోందని వివరించారు.రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఇటీవల ఎకరం స్థలం రూ.177 కోట్లకు అమ్ముడు పోవడమే అందుకు నిదర్శనమని చెప్పారు. పర్యాటక రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు లభించడం పెట్టుబడిదారులు, రియల్టర్ల విశ్వాసాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్, పర్యాటక రంగాలు పరస్పరం మద్దతుగా ఉండి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భాను ప్రసాద్, నారెడ్కో ప్రెసిడెంట్ విజయ్ సాయి మేక, జనరల్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, కిరణ్, నారెడ్కో నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పీఎస్ రెడ్డి, ఎం. వెంకయ్య చౌదరి, పి.రవిరెడ్డి, స్వామీనాథన్, కాశీప్రసాద్, వెంకటేష్, హరిబాబు, దశరథ్ రెడ్డి, కిరణ్ ఇతర బిల్డర్లు, ప్రమోటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆశలు ఆవిరి..

కావడం ఇపుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒకవైపు ప్రపంచ శాంతికి కృషి చేసిన మహానుభావులు నోబెల్ శాంతి బహుమతిని అందుకుంటుంటే, మరోవైపు కొన్ని వివాదాస్పద వ్యక్తులు కూడా ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని పొందిన సందర్భాలు ఉన్నాయి. ఆ సందర్భాలను పరశీలిస్తే..యాసిర్ అరాఫత్ (1994): ఇజ్రాయెల్-పాలస్తీన్ మధ్య ఒప్పందానికి కృషి చేసినందుకు బహుమతి పొందారు. కానీ ఆయనపై తీవ్రవాద కార్యకలాపాల ఆరోపణలు ఉండటం వల్ల విమర్శలు ఎదురయ్యాయి.బరాక్ ఒబామా (2009): అధ్యక్ష పదవిలోకి వచ్చిన ఏడాదిలోనే శాంతి ప్రయత్నాలకు బహుమతి రావడం అనేక ప్రశ్నలు రేకెత్తించింది. ట్రంప్ సైతం తాజాగా ఒబామా ఏం చేశారని అధ్యక్ష పదవి చేపట్టిన 8 నెలలకే నోబెల్ ఇచ్చారని, పైగా ఆయన అమెరికాను నాశనం చేశారని మండిపడ్డారు కూడా.ఆంగ్ సాన్ సూకీ (1991): మయన్మార్ ప్రజాస్వామ్య పోరాటానికి గుర్తింపుగా బహుమతి పొందారు. కానీ 2017లో రోహింగ్యా ముస్లింలపై జరిగిన హింసను నిరసించకపోవడం వల్ల ఆమెపై విమర్శలు వచ్చాయి.హెన్రీ కిస్సింజర్ (1973): వియత్నాం యుద్ధం ముగింపుకు కృషి చేసినందుకు బహుమతి పొందారు. కానీ యుద్ధంలో అమెరికా పాత్రపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. అబి అహ్మద్ (2019): ఈథియోపియాలో శాంతి ఒప్పందానికి కృషి చేసినందుకు బహుమతి పొందారు. కానీ తరువాత దేశంలో అంతర్గత హింస పెరగడం వల్ల ఆయనపై విమర్శలు వచ్చాయి.వంగారి మాథై (2004): పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన ఆమె, %ఎ×ఎ% బాధితులపై చేసిన వ్యాఖ్యల వల్ల వివాదంలోకి వచ్చారు. మహాత్మా గాంధీ.. శాంతి, అహింసకు ప్రతిరూపం. ఆయన నోబెల్ శాంతి బహుమతికి పలు మార్లు నామినేట్ అయ్యారు. 1948లో ఆయన హత్యకు గురైన టైంలో నోబెల్ కమిటీ.. ఈ గౌరవానికి అర్హులే లేరు అంటూ ఓ ప్రకటన విడుదల చేయడం వివాదాస్పదమైంది. రాజకీయ కారణాలు, బ్రిటిష్ ప్రభావం, అంతర్జాతీయ పరిస్థితులు ,ఇవన్నీ బహుమతి రాకపోవడానికి కారణాలుగా భావించబడ్డాయి. అయితే.. నోబెల్ కమిటీ 2006లో "గాంధీకి బహుమతి ఇవ్వకపోవడం మా పెద్ద తప్పు" అని అంగీకరించింది. ట్రంప్‌కి నోబెల్ శాంతి బహుమతి వచ్చి ఉంటే గనుక.. పై జాబితాలో చేరి ఉండేదే. కానీ, ప్చ్.. ఆయన కల నెరవేరలేదు.

# శాంతి కంటే రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత

**- ఈ అవార్డులతో అది మరోసారి నిరూపితమైంది**


**- నోబెల్ కమిటీపై వైట్‌హౌస్ తీవ్ర ఆరోపణలు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** నోబెల్ కమిటీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నోబెల్ కమిటీ శాంతి కంటే రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తుందని నిరూపించిందని ఆరోపించారు.వెనిజులా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న మరియా కొరీనా మచాడోకు 2025 నోబెల్ శాంతి బహుమతి లభించింది. అయితే, నార్వే నోబెల్ కమిటీ అవార్డు ప్రకటనపై వైట్ హౌస్ తీవ్రంగా స్పందించింది .ఈ అవార్డును డొనాల్డ్ ట్రంప్ తనకు తానుగా ప్రకటించుకున్నారు. ఈ సందర్భంగా మరోసారి నోబెల్ కమిటీ శాంతి కంటే రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తుందని ఈ అవార్డుల ప్రధానంతో నిరూపించింది' అని వైట్ హౌస్ ప్రతినిధి స్టీవెన్ చియుంగ్ ఎక్స్ వేదికగా స్పందించారు. కానీ, అధ్యక్షుడు ట్రంప్ శాంతి ఒప్పందాలు చేసుకోవడం, యుద్ధాలను ముగించడం, ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తుంటారు. ఆయన గొప్ప మానవతావాది. అలాంటి వారు తమ సంకల్ప శక్తితో పర్వతాలను కదిలించగలరు' అని పేర్కొన్నారు.

# బీజేపీ మండల అధ్యక్షుడు ఆత్మహత్య

## సూసైడ్ నోట్‌లో రాజకీయ నాయకుల పేర్లు

- వేమనపల్లి మండలంలో ఉద్రిక్తత





**బెల్లంపల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** అధికార పార్టీ నాయకుల వేధింపులు తాళలేక వేమనపల్లి మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు ఆత్మహత్య పాల్పడటం వేమనపల్లి మండలంలో కలకలం సృష్టించింది. అధికార పార్టీ నాయకులకు పోలీసులు కొమ్ముకాసి తనను వేధింపులకు గురిచేశారని, వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని సూసైడ్ నోట్ రాసి ఏట మధుకర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా సూసైడ్ నోట్ తెలిపిన వివరాల ప్రకారం 'నా చావుకి కారణా రుద్రభట్ల సంతోష్,గాలి మధు, చింతకింది కమల వీరివలన నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. వీరు నాపైన రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసులు పెట్టించి నాయొక్క పరువు ప్రతిష్టను దెబ్బతీశారు. నాచావుకు కారణమయ్యారు. నేనే తప్పు చేయలేదు. అలాంటి క్యారెక్టర్ నాది కాదు. అందుకని వీరిపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. అలాగే నాయొక్క కుటుంబానికి బీజేపీ పార్టీ అండగా ఉండాలి. నాకుటుంబాన్ని కాపాడాలి. వేమనపల్లి మండలంలో కుటిల రాజకీయలు ఉన్నాయి. అప్పుడు దుర్గం శివరాం, ఇప్పుడు ఏట మధుకర్. ఇలా ఎలకావాల్సిందేను అందుకే అలోచించండి. ఈ అగ్రవర్ణ పాలకులను బుద్ధి చెప్పండి. భారత్ మాతాకీ జై' అంటూ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య పాల్పడ్డాడు.

**అధికార పార్టీ నాయకులను కఠినంగా శిక్షించాలి**

వేమనపల్లి మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారణమైన అధికార పార్టీ నాయకులను కఠినంగా శిక్షిం చాలని, అధికార పార్టీ నాయ కులకు కొమ్ముకాసి అక్రమ కేసులు బనాయించిన



పోలీసు లను సస్పెండ్ చేయాలని మధుకర్ కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు కారణమైన నాయకులను వెంటనే అరెస్టు చేయాలని, అప్పటి వరకు శవాన్ని పోస్ట్ మార్టం చేయనిచ్చేది లేదని అడ్డుకున్నారు. సీఐ బన్సీలాల్ సంఘటన స్థలానికి చేరుకొని వారిని శాంతిపజేయడానికి ప్రయత్నించారు.

**ఆత్మహత్య కారణం!**

వేమనపల్లి మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్య అసలు కారణం అట్రాసిటీ కేసు నమోదు చేయడమే అని తెలుస్తుంది. ఇటీవల అధికార పార్టీ నాయకులు రైతులకు చెందాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలించి సొమ్ము చేసుకున్నారని అధికారులకు పిర్యాదు చేశారు. దీనికి అగ్రహించిన అధికార పార్టీ నాయకులు ఎలాగైనా మధుకర్ ను దెబ్బకొట్టాలని అలోచించి ఒక గిరిజన మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడని ఆమెతో పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయించారని, పిర్యాదు ఆధారంగా పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో తాను ఎలాంటి తప్పు చేయకున్నా పరువు తీశారని మనస్తాపం చెంది ఆత్మహత్య పాల్పడ్డాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా ఏట మధుకర్ ఆత్మహత్యతో వేమనపల్లి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఇంజనీరింగ్ కాలేజీలో భారీ చోరీ

**రంగారెడ్డి, అక్టోబర్10 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఓ ఇంజినీరింగ్ కాలేజీలో భారీ చోరీ జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజీలో దుండగులు రూ.కోటి ఎత్తుకెళ్లారు. గుర్తించిన కాలేజీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కాలేజీని పరిశీలించారు. కళాశాల పరిసరాల్లో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైస్ మిల్లర్ ఖాతాలో రూ.5 లక్షలకుపైగా మాయం

**నర్సాపూర్, (జనంసాక్షి) :** ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాడి ఉచ్చులో పడి ఓ రైస్ మిల్లర్ పోగొట్టుకున్న డబ్బును నర్సాపూర్ పోలీసులు రిటర్న్ తెప్పించిన సంఘటన నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శు క్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్ కుమార్ వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన ఇమ్మడి విశ్వనాథం అనే రైస్ మిల్లర్ ఖాతాలో నుండి ఈ నెల 6వ తేదిన తన ప్రమేయం లేకుండా తన బ్యాంక్ ఖాతా నుండి డబ్బులు కట్ అయ్యాయి. తాను సైబర్ నేరానికి గురయ్యానని తెలుసుకున్న విశ్వనాథం నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఆరా తీయగా విశ్వనాథం బ్యాంక్ ఖాతా నుండి రూ.5,85,000 కట్ కావడం జరిగింది. వెంటనే నర్సాపూర్ పోలీస్ వారు 1930కి కాల్ చేసి కంప్లైంట్ రైజ్ చేయగా ఆ తర్వాత మెదక్ జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీ ఏ సుభాష్ చంద్రబోస్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఎఐ రంజిత్ కుమార్ రెడ్డి , సైబర్ క్రైమ్ సిబ్బంది అందరూ కలిసి ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకొని విశ్వనాథం అకౌంట్ నుండి పోయిన రూ.5,85,000 అకౌంట్‌ను హోల్డ్ చేయించి, తిరిగి విశ్వనాథం ఖాతాలోకి డబ్బులు జమ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంజిత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అనుమానాస్పద లింకులు, వెబ్‌సైట్లు, మెసేజ్‌లు క్లిక్ చేయవద్దని సూచించారు.

## బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామా

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ యువజనసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొట్టం శివ యాదవ్



**మర్రిగూడ, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** చెల్లని జీవోతో చిల్లర రాజకీయ.. అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లులను కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో-9 చెల్లదని సీఎం రేవంత్ రెడ్డికి ముందే తెలుసు. 42 శాతం రిజర్వేషన్ల జీవోకు చట్టబద్ధత ఉండదని తెలుసు.కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలు, చట్టం పరీక్షకు నిలవకుండా వ్యవహరించిన తీరు వల్లనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయింధి బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొట్టం శివ యాదవ్ ఎద్దేవా చేశారు. శు క్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చేతగాని పాలన వల్ల గ్రామపం చాయతీలలో నిధులు లేక అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిం దని అన్నారు. ఎన్ని కలు వాయిదా వేసేందుకే బీసీ రిజర్వేషన్ల డ్రామా ఆడారు అని కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదు అని హైకోర్టు ఇచ్చిన స్టేతో బీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి బట్టబయలైంది అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతగాని పాలనపై ప్రజాగ్రహం వ్యక్తం అవుతోంది. ముఖ్యమంత్రి భయంతోనే ఎన్నికలు నిర్వహించడం లేదు అని అన్నారు.

## న్యాయాన్ని కాపాడండి.. రిజర్వేషన్లు అమలు చేయండి

- పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్



**వరంగల్ (జనంసాక్షి) :** భారత రాజ్యాంగ ప్రవేశిక ప్రజలందరికి సామాజిక,ఆర్థిక, రాజకీయ న్యాయం అందాలని ప్రవచించిన అత్యున్నత న్యాయ స్థానాల్లో నియమితులైన న్యాయమూర్తుల్లో సామాజిక న్యాయం కొరవడి అట్టడుగు వర్గాలకు న్యాయం జరగడంలేదని పూలే ఆశయ సాధన సమితి అధ్యక్షులు (పాస్ ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం, దూరవిద్య కేంద్రం ప్రాంగణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 38(1)వ అధికరణ ప్రజలందరి సంక్షేమాన్ని కోరిందని, 78సంవత్సరాలుగా సామాజిక న్యాయం అందని ద్రాక్షగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేసారు. తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగంలోని 285 (ఏ) సవరించి తెచ్చిన జీవో నెం '9' పై రెండు రోజులు వాదోపవాదనలు విని కొన్ని వర్గాలు మాత్రమే దైవాంశ సంభూతులుగా వర్ణించి,8శాతం లేని అగ్రవర్ణాలకు అనుకూలంగా హైకోర్టు 'స్టే' ఇచ్చి బీసీలకు రాజ్యాధికారం దూరం చేసే ప్రయత్నం చేసిందని అన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్న రాజకీయ పార్టీలకు ప్రజాక్షేత్రంలో శిక్షించే రోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు. ఇప్పటికైనా గవర్నర్ ను ఒప్పించే బాధ్యత బీజేపీ తీసుకోని,రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో పాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్,పాస్ నాయకులు రుద్రోజు శ్యాం సుందర్, కర్ణకంటి సత్యనారాయణ, గుడాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదిన్నర కుమార్తెను కిడ్నాప్ చేసిన తండ్రి..



**జైపూర్ (జనంసాక్షి) :** ఏడాదిన్నర వయస్సున్న కుమార్తెను ఆమె తండ్రి కిడ్నాప్ చేశాడు. పుట్టింట్లో ఉంటున్న భార్య వద్ద ఉన్న ఆ చిన్నారిని అపహరించాడు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని జుంజును జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హేమంత్ సోని, ఆకాంక్ష దంపతులకు 2022 నవంబర్‌లో వివాహమైంది. ఏడాదిన్నర వయస్సున్న కుమార్తె వంశిక వారికి ఉన్నది. భర్త హేమంత్ వేధింపులు భరించలేని ఆకాంక్ష తన కుమార్తెతో కలిసి జుంజునులోని పుట్టింటికి వెళ్లిపోయింది. గత రెండేళ్లుగా తండ్రి ఇంట్లో ఆమె నివసిస్తున్నది. భార్యాభర్తల మధ్య గొడవకు సంబంధించిన కేసు విచారణ కోర్టులో పెండింగ్‌లో ఉన్నది. మరోవైపు అక్టోబర్ 9న గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆకాంక్ష తన కుమార్తెను ఇంటి ముందు ఆడించింది. కొద్దిసేపు ఇంట్లోకి ఆమె వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా కుమార్తె అదృశ్యమైంది. ఆందోళన చెందిన ఆకాంక్ష, ఆమె తండ్రి కలిసి ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. భర్త హేమంత్ కుమార్తెను కిడ్నాప్ చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఆకాంక్ష ఫిర్యాదు చేసింది. కుమార్తెను తీసుకెళ్తానంటూ కొన్ని నెలలుగా అతడు బెదిరిస్తున్నట్లు ఆరోపించింది.

## చెరువులో దూకి బిజెపి కార్యకర్త ఆత్మహత్య

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్10 (జనంసాక్షి) :** యాదాద్రి జిల్లాలో ఓ బీజేపీ కార్యకర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీబీనగర్ పెద్ద చెరువులో దూకి ఉప్పల్ కు చెందిన బీజేపీ కార్యకర్త రెవల్లి రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఈ ఆత్మహత్యకు గల కారణం అతను తన తల్లిని కొట్టడమే. కుటుంబంలో తలెత్తిన వివాదం కారణంగా రాజు తల్లిపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. తన తల్లి కొట్టొద్దని వేడుకున్నా సరే విచక్షణ కోల్పోయి తల్లిని చెంప మీద కొట్టాడు. కాలితో తన్నాడు. అయితే ఈ సమయంలో అక్కడున్న వారు వారిస్తున్నా రాజు మాత్రం పట్టించుకోలేదు. ఈ తతాంగాన్నంతా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో క్షణాల్లోనే వైరల్ గా మారింది. వీడియో వైరల్ కావడంతో తన పరువు పోయిందని.. తాను నలుగురిలో తల ఎత్తుకుని తిరగలేనంటూ మనోవేదనకు గురయ్యాడు. సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు బీజేపీ కార్యకర్త రాజు. ఆయన మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని భువనగిరి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్లో మృతుడి భార్య మహిమ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

- 1,967 రాజకీయ పార్టీల పోస్టర్స్, వాల్ రైటింగ్, బ్యానర్స్ తొలగింపు

హైదరాబాద్, అక్టోబర్ 10 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)ను కట్టుదిట్టంగా ఎన్నికల అధికారులు అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్తులపై అన్ని 1315 , వ్యక్తిగత ఆస్తులపై ఉన్న 652 మొత్తం 1,967 రాజకీయ పార్టీల ప్రచార పోస్టర్స్, వాల్ రైటింగ్, బ్యానర్స్ ఎన్నికల అధికారులు తొలగించారు. ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై ఎన్నికల అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు.

## చిన్నారిపై యువకుడి లైంగికదాడి

**హైదరాబాద్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. గంజాయి మత్తులో ఓ దుండ గుడు 8 ఏళ్ల చిన్నారిపై అత్యాచా రానికి పాల్పడ్డాడు. దంపతులు హైదరాబాద్ -సైదాబాద్ పరిధిలోని సింగరేణి కాలనీలో కూతురు(8), కుమారుడు(7) లతో నివసిస్తూ, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దంపతులిద్దరు కూలీ పనుల కు వెళ్లిన సమయంలో ఇద్దరు చిన్నారులను ఇంటికి పిలిచాడు ఓ యువకుడు. సోదరుడి ముందే బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాలిక అనారోగ్యానికి గురవ్వగా, తల్లిదండ్రులు చిన్నారి తమ్ముడిని నిలదీశారు. ఆ బాలుడు జరిగిన విషయాన్ని చెప్పాడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహాయంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## మందు కొడితే మాడిపోయింది



- కలుపు మందుకు దెబ్బతిన్న వరిపైరు

**రాయపర్తి,అక్టోబర్ 10(జనంసాక్షి):** పంటలో కలుపు పెరిగిపోయిందని మందు కొడితే కలుపు పోవడం మాటేమొ కాని పంట అంతా ఎండి పోయింది.లక్షల్లో పెట్టుబడి పెట్టిన తన పరిస్థితి ఏంటని ఆ రైతు ఆవేదన చెందుతున్నాడు. మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన రైతు అబ్బోజు సేనాపతి కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు.మూడు ఎకరాల్లో వరి సాగు చేశాడు.పంటలో కలుపు పెరగడంతో వరంగల్ లోని మాధురి ఎరువుల దుకాణానికి వెల్లగా పోటేవ,తారక్ కంపెనీలకు చెందిన మందు ఇచ్చాడు.వారు చెప్పిన మోతాదులో పంట పై పిచికారి చేశాడు.పంటలో ఉన్న కలుపు చావక పంట మొత్తం ఎండి పోవడతో రైతుకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.పంటకు ఇప్పటికే తమ శ్రమతో లక్ష వరకు పెట్టుబడి పెట్టానని రావాల్సింది పోయి ఇలా జరగడంతో తన పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నాడు.ఈ విషయమై తనకు పురుగుల మందు విక్రయించిన ఎరువులు దుకాణం యజమానిని అడిగితే పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు.ఎండిపోయిన పంటను చూసి చుట్టుపక్కల రైతులు సైతం తమ బాధను వ్యక్తం చేస్తున్నారు.ఆరుగాల శ్రమకోర్చి పంటను పండించే రైతుకు కష్టాలు తప్పడం లేదని పలువురు రైతులు పేర్కొన్నారు.తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తానని బాధిత రైతు పేర్కొన్నారు.

## నేడు కోయంబత్తూరుకు కేటీఆర్..



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు కేరళలోని కోయంబత్తూరులో పర్యటించనున్నారు. ప్రతిష్టాత్మక ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్ స్పోర్ట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొనే ప్రతిష్టాత్మకమైన 10వ ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ కాంపిటీషన్ 2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన రేపు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కార్యక్రమం కోయంబత్తూరులోని కుమారగురు ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరగనుంది. దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించే ఈ జాతీయ పోటీల్లో కేటీఆర్ పాల్గొనడం గర్వకారణంగా భావిస్తున్నారు. యువతలో ఆవిష్కరణ దృక్పథం, టెక్నాలజీ ప్రోత్సాహం, మోటార్‌స్పోర్ట్స్ రంగంలో కొత్త ప్రతిభను వెలికితీసే వేదికగా కార్యక్రమం నిలువనున్నది.

## శబరిమల బంగారం మాయం ఘటనలో దృష్టి మరల్చేందుకే సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులు

**కేంద్రమంత్రి సురేశ్ గోపి సంచలన వ్యాఖ్యలు**

**తిరువనంతపురం, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** కేరళలోని శబరిమల ఆలయంలోని బంగారు విగ్రహాల తాపడం బరువు తగ్గడంఇటీవల వివాదాస్పదమైన నేపథ్యంలో, ఈ ఘటనపై నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. శబరిమల అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. పాలక్కడ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సురేష్ గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఎదురైన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ ఆరోపణలు చేశారు. శబరిమల బంగారు సమస్య నుంచి దృష్టిని మరల్చేందుకు ఇద్దరు సినీ నటులను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఆ నటుల పేర్లను ఆయన ప్రస్తావించలేదు. శబరిమల బంగారు కవచాలకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లు ముమ్మర దర్యాప్తు చేస్తున్నాయన్నారు. కేంద్రమంత్రిగా దీనిపై తాను ఇంతకుమించి వ్యాఖ్యానించలేనన్నారు. ఇలాంటి ఘటనలు సాధారణమేనన్నారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే సంఘటనలు జరిగినప్పుడు.. ప్రముఖులే లక్ష్యంగా పోలీసులు చర్యలు తీసుకోవడం మామూలే అన్నారు. ఇలాంటివి మరిన్ని చూడాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి ఆ నటుల పేర్లు చెప్పనప్పటికీ.. భూటాన్ నుంచి లగ్జరీ కార్లను అక్రమంగా దిగుమతి చేసుకున్నారన్న కేసులో ఇటీవల పలువురి నటుల ఇళ్లల్లో కస్టమ్స్ అధికారులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఆఫీసుతో పాటు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చకల్‌కల్ ఇళ్ల పైనా ఈ దాడులు జరిగాయి. దీంతో వీరిని ఉద్దేశించే సురేష్ గోపి తాజా వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

## నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ప్రస్తుత కాలానికి అనుగుణంగా వ్యవసాయ విద్యార్థులు తమ విజ్ఞానాన్ని అన్నదాతలకు అందించి అధిక ఫలితాలు సాధించేలా రైతులకు చేరువయ్యేలా కృషి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని ఎల్కుర్తి హవేలీ గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సు కార్యక్రమానికి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా వచ్చారు.వ్యవసాయ విద్యార్థులు ,శాస్త్రవేత్తలు, రైతులకు మధ్య వారధిగా ఉండి నూతన వ్యవసాయ విజ్ఞానాన్ని రైతాంగానికి పరిచయం చేయాలని అన్నారు. రానున్న కాలంలో వ్యవసాయంలో జరిగే నూతన మార్పులకు, మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులను సన్నద్ధం చేస్తూ వారికి తోడుగా నిలబడాలని కోరారు. అలాగే సదస్సు నిర్వహించి ఆధునిక పద్ధతులను రైతులకు అర్థమయ్యేలా చెప్పడమే కాక చూపిస్తున్నందుకు అభినందించారు.ప్రస్తుత వ్యవసాయంలో వరి, పత్తి పంటల కోతలు ఉన్నందున మార్కెటింగ్ పరంగా రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉంది. వరి కొనుగోలు కేంద్రాలను, పత్తి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ సహపరిశోధన సంచాలకులు డాక్టర్ ఉమా రెడ్డి, రైతులు తక్కువ ఖర్చుతో అత్యధిక దిగుబడిని పొందడానికి, నేల ఆరోగ్యాన్ని తప్పకుండా కాపాడాలని, ఎరువులను మోతాదుకు మించి వాడకూడదని, కూలీల కొరత వల్ల వ్యవసాయంలో యాంత్రికరణను రైతులు అలవర్చుకోవాలని కోరారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఏ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వరీ పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, గింజ మచ్చ తెగులు మరియు కంకి నల్లి నివారణ చర్యలను వివరించారు. అధిక వర్షాల వల్ల పత్తి పంటలో ఎండు తెగులు మరియు కాయ కుళ్లు తెగులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొందరు అభ్యుదయ రైతులు వారి అనుభవాలను తోటి రైతులతో పంచుకున్నారు. రైతులు వారి సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. వీటితో పాటు భాగంగా వరల్డ్ ఎగ్ డే సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బివి రాజ్ కుమార్, డాక్టర్ ఆర్. విశ్వతేజ వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రమేష్, డాక్టర్ నరేందర్, గోపిక , శ్రీమతి ప్రజ్ఞ, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ జిల్లా ద్యాన శాఖ అధికారి శ్రీనివాసు, మండల రెవెన్యూ అధికారి , మండల వ్యవసాయ అధికారి శ్రీ హరి ప్రసాద్, 9 గ్రామాల రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రామ్ విద్యార్థినులు, పాల్గొన్నారు.

## ధర్నా చేసిన రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగం

- పోలీసులపై చర్యలకు మానవహక్కుల కమిషన్ ఆదేశం

**నల్గొండ, అక్టోబర్ 10 (జనంసాక్షి):** దామరచర్ల మండలం వాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో యూరియా కోసం ధర్నా చేసినందుకు గిరిజన రైతు సాయి సిద్దును పోలీసులు విచక్షణారహితంగా కొట్టిన విషయం తెలిసిందే. అయితే అతనిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, సాయి సిద్దు భార్యను కులం పేరుతో దూషించారని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సామాజికవేత్త రేవంత్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన జాతీయ మానవ హక్కుల కమిషన్ పోలీసులపై చర్యలు తీసుకుంది. సాయి సిద్దుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎస్పీకి మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ సంఘటనపై వెంటనే ఉన్నత స్థాయి విచారణ చేపట్టి, బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని వెల్లడించింది.

## దుర్గంధ సువాసనలు

పుడమి తల్లి ముఖంపై
పొగరుగా విసిరేసిన
పనికిరాని వ్యర్థాలను
ప్రేమగా తడిమి తుడిచి
పోగుపెట్టి తట్టకెత్తిన
నిజమయిన బిడ్డలు వీళ్ళు

శ్వాసనాపే మురికి కుంటలో
భక్తి శ్రద్ధలతో నిండా మునిగి
దేశ మలాన్ని తమ దోసిళ్లతో
కడిగేసినా కరుణ పొందని
భరతదేశ భక్తులు వీళ్ళు

దుర్గంధ పరిసరాల్లో
బ్రతుకంతా గడిపేసి
శ్రమశక్తి సువాసనలు
వీధులన్నీ వెదజల్లే
స్వచ్ఛమైన మనుషులు వీళ్ళు

దేహమంతా పుండ్లు పడిన
దేశ దారులంతా పూలు జల్లి
చివరి శ్వాసను చెత్త కొదిలిన
చీపురు కట్టల ఊపిరి వీళ్ళు

చిన్న మనుషులు చీత్కరించిన
చిరునవ్వుతో సాగిపోయే
పెద్ద మనసున్న రాజులు వీళ్ళు
ప్రతిదినం మన వీధుల్లో
సూర్యునిలా ఉదయించే
పారిశుధ్య యోధులు వీళ్ళు.

**నేపా సంతోష్**
**అచ్యుత్ కుమార్,**
**అసిస్టెంట్ ప్రొఫెసర్,**
**కాళోజి ప్రతిభ**
**పురస్కార గ్రహీత,**
**8639442397**



## రెక్కలు

ఎట్లాగోలా బతికేద్దాం అనేవాడు
ఎట్లాగోలా బతికేస్తాడు !
ఇట్లాగే బతకాలనుకునేవాడే...
యుద్ధం చేస్తాడు !!

**అవుసలి వీరబ్రహ్మం**
**న్యాయవాది**
**యెల్లకొండ**
**6309118965**

# భారత ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు దేనికి సంకేతం?

అది భూషణ్ రామకృష్ణ గవాయి అనే వ్యక్తి మీద రాకేశ్ కిషోర్ అనే వ్యక్తి చెప్పు విసిరాడన్నంత సాధారణ ఘటన కాదు. అది భారత రాజ్యాంగాన్ని పరిరక్షించే, వ్యాఖ్యానించే, వివరించే బాధ్యత ఉన్న సర్వోన్నత న్యాయస్థానపు ధర్మాసనానికి, ప్రధాన న్యాయమూర్తి పదవికి జరిగిన అవమానం. ఆ చెప్పు విసిరిన వ్యక్తి ఏదో తాత్కాలిక, క్షణికావేశంతో ఆ పని చేయలేదు. ఉద్దేశపూర్వకంగా, నింపాదిగా, పథకం ప్రకారం ఆ పని చేశాడు. ఆ వ్యక్తి ఉన్మాది కాదు, మతి స్థిమితం లేనివాడు కాదు. అనేక డిగ్రీలు సంపాదించిన ఉన్నత విద్యావంతుడు. న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నవాడు. చెప్పు విసురుతున్నప్పుడు ఆ వ్యక్తి "సనాతన ధర్మానికి అవమానం జరిగితే హిందుస్తాన్ సహించదు" అన్నాడు. తర్వాత ఇంటర్వ్యూలో తాను ఏమీ పశ్చాత్తాపపడడం లేదని, అసలు నిజానికి తాను చెప్పు విసరలేదని, తనతో భగవంతుడే చెప్పు విసిరించాడని కూడా అన్నాడు. అది చర్యకు ప్రతిచర్య అన్నాడు.

జస్టిస్ బి ఆర్ గవాయి అంతకు ముందు సనాతన ధర్మాన్ని అవమానించారనే ఆరోపణతో పాటు, తాను హిందుస్తాన్ ప్రతినిధిగానో, భగవంతుడి ప్రతినిధిగానో, లేదా భగవల్లీలలో పనిముట్టుగానో ఆ పని చేశానని, తాను చేసినది పశ్చాత్తాపపడవలసిన అవసరం లేని సక్రమమైన చర్య అని రాకేశ్ కిషోర్ భావిస్తున్నాడని ఆ మాటలను బట్టి తేలుతున్నది. ఈ ఘటనలో ఆలోచించవలసిన, అర్థం చేసుకోవలసిన కోణాలు ఎన్నో ఉన్నాయి. ఇక్కడ అది ఒక పథకం ప్రకారం జరిగిన నేరపూరిత చర్య అనే కోణం, అది ఒక సాంస్కృతిక ఆధిపత్య భావజాలపు చర్య అనే కోణం మాత్రం ప్రధానంగా చూడవలసి ఉన్నాయి.

జస్టిస్ బి ఆర్ గవాయి చేసిన ఏ వ్యాఖ్యలనైతే ఈ చర్యకు కారణంగా చూపుతున్నారో, ఆ వ్యాఖ్యలు సెప్టెంబర్ 16న సుప్రీం కోర్టులో బహిరంగంగా చేసినవి. ఆ వ్యాఖ్యల మీద వెంటనే ఆవేశంతో వ్యాఖ్యలు, దూషణలు, ట్రోలింగ్ జరిగిన మాట కూడా నిజమే. ఆ వ్యాఖ్యలకు స్పందనగా జస్టిస్ గవాయి ఆ మర్నాడే తన వ్యాఖ్యలను అగౌరవంగా అపార్థం చేసుకోవద్దనీ, తనకు అన్ని మతాల పట్ల గౌరవం ఉందనీ స్పష్టత ఇచ్చారు. అంటే ఒకవేళ ఆయన వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవనీ, కోపం తెప్పించాయనీ అనుకున్నా, వాటి ప్రాసంగికత ఆ మర్నాడు ఆయన వివరణతో అయిపోయి ఉండాలి. సరిగ్గా ఇరవై రోజుల తర్వాత ఆ వ్యాఖ్యలను సనాతన ధర్మానికి అవమానకరమైనవని అభివర్ణిస్తూ, ఆ అవమానాన్ని సహించని హిందుస్తాన్ తరఫున ఒక వ్యక్తి ప్రతీకార చర్యగా చెప్పు విసరవచ్చునని భావించాడంటే, ఇక్కడ తక్షణ, తాత్కాలిక, క్షణిక ఆవేశం పాత్ర ఏమీ లేదు. పూర్వాపరాలన్నీ ఆలోచించి, ఏ పర్యవసానాలు ఉండే అవకాశం ఉందో ఊహించి, అయినా తన చర్యకు ఇవాళ దేశంలో సమర్థన దొరికే అవకాశం ఉందని కూడా ఊహించి, పథకం ప్రకారం చేసిన చర్య అది. ఒక న్యాయమూర్తిని అవమానపరిచిన చర్య. ఆ న్యాయమూర్తి పుట్టుకతో దళితుడు గనుక ఈ చర్య షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నిరోధ) చట్టం కింద శిక్షార్హమైన నేరం. అది ప్రజాస్వామ్యానికీ, నాగరిక, సభ్య ప్రవర్తనకూ వ్యతిరేక చర్య.

ఆ చర్య తనను ప్రభావితం చెయ్యజాలదనీ, దాన్ని పట్టించుకోనక్కరలేదనీ అనడం జస్టిస్ గవాయి ఔదార్యం. ఆ చర్యకు గాను నేరం నమోదు చేసి విచారణ చేపట్టవద్దని కూడా ఆయన వారించి ఉండవచ్చు. అయినా పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, నేరస్తుడిని విచారణ



పరిధిలోకి తీసుకువచ్చేలా చూడవలసిన బాధ్యత సుప్రీంకోర్టు అధికారులది. ఒకవేళ వారు కూడా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు అలా చేయకపోతే, స్వయంగా పోలీసులే సువో మోటు (ఫిర్యాదు లేకుండానే) నేరం నమోదు చేసి, తగిన చర్యలు తీసుకోవలసి ఉంటుంది. దేశంలో కొనసాగుతున్న చట్టాల ప్రకారం, అమలులో ఉన్న సంప్రదాయాల ప్రకారం పోలీసులు అటువంటి సువో మోటు కేసులు ఎన్నో చేపడుతూనే ఉన్నారు. ఒక ప్రధాన న్యాయమూర్తిని అవమానించిన సంఘటన మీద కేసు పెట్టకపోవడం, కోర్టు హాలులో బహిరంగంగా అందరి ముందూ జరిగిన నేరంలో నేరస్తుడిని అరెస్టు చేయకపోవడం, విచారణ ప్రక్రియ ప్రారంభించకపోవడం ఈ దేశంలో నడుస్తున్న తలకిందుల మనువాద న్యాయానికి ఉదాహరణ. వందలాది మేధావులు, సామాజిక కార్యకర్తలు, రచయితలు ఎటువంటి నేరమూ చేయకపోయినా, అధికారవర్గానికి భిన్నాభిప్రాయాలు ప్రకటించారనే కారణంతో తప్పుడు కేసులలో ఇరికించబడి సంవత్సరాలూ దశాబ్దాలూ జైలు నిర్బంధాలు అనుభవిస్తున్న ఉదాహరణలతో పోలిస్తే, ఈ బహిరంగ నేరస్తుడి పట్ల రాజ్యం అనుసరిస్తున్న ఔదార్యం క్షమార్హం కాదు. దేశంలో అమలు జరగవలసిన చట్టబద్ధ పాలనకు వ్యతిరేకం. చట్టం ఎదుట అందరూ సమానమే అని చెప్పే రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం. ఇది రాకేశ్ కిషోర్ అనే ఒక్క నేరస్తుడి విషయం మాత్రమే కాదు, అసలు సెప్టెంబర్ 16న జస్టిస్ బి ఆర్ గవాయి వ్యాఖ్యలు బైటికి వచ్చిననాటి నుంచీ, బిజెపి ఐటీ సెల్ ద్వారా, సంఘ్ పరివార్ సామాజిక మాధ్యమపు హాండిల్స్ ద్వారా జస్టిస్ గవాయి మీద సాగిన నిందలూ దుర్భాషలూ ఆయన మీద ఇటువంటి ఏదో ప్రతీకారం తీసుకోవాలని రెచ్చగొడుతూ చేసిన వ్యాఖ్యలూ ఎన్నో ఉన్నాయి. అంటే జస్టిస్ గవాయి మీద చెప్పు విసరడం ఒక వ్యక్తి ఉన్మాద చర్య కాదు, అది ఒక సమూహం ఉద్దేశపూర్వకంగా, పథకం ప్రకారం చేసిన కుట్ర. కాబట్టి కుట్రదారులందరి మీద నేరారోపణలు నమోదు చేయాలి. విచారణ ప్రక్రియ ప్రారంభించాలి.

**అస్పృశ్యుడిగా ఉండవలసిన వ్యక్తి తీర్పరిగా, న్యాయమూర్తిగా, సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉంటాడా అనే మనువాద అహంకారమే. ఇది వాస్తవంగా మనువాద భావజాలపు సమస్య. రాకేశ్ కిషోర్ ఇంటర్వ్యూ ఆ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నది. ఆ ఇంటర్వ్యూలో ఆయన మాటలన్నీ సంఘ్ పరివార్ అబద్ధాల చరిత్ర ఫాక్టరీలో తయారైనవే.**

జనమే సాక్షి

ఉదాహరణకు, అజీత్ భారతి అనే సంఘ్ పరివార్ యూట్యూబర్, జస్టిస్ గవాయి వ్యాఖ్యల మీద నడిపిన ఒక పాడ్ కాస్ట్‌లో, "మనం గాడ్సేలం కాక పోయినా, గాంధీలం అయినా కావచ్చు గదా. జస్టిస్ గవాయి కోర్టుకు వచ్చేప్పుడో, వెళ్లేప్పుడో ఆయన కారును అడ్డగించి మన నిరసన తెలపలేమా" అని స్పష్టంగా రెచ్చగొట్టే వ్యాఖ్య చేశాడు. ఆయనతో పాటు ఉన్న ఇద్దరు సహ పాడ్ కాస్టర్లలో ఒకరు, "కారుకు అడ్డం తిరిగి చుట్టూ నిలబడడం ఏమిటి? మొఖం మీద ఉమ్మేస్తే కాదా?" అని కూడా అన్నాడు. ఈ యూట్యూబ్ వీడియో క్లిప్ ను సంఘ్ పరివార్ విపరీతంగా ప్రచారంలో పెట్టి వైరల్ చేసింది. నిజానికి ఈ మాట ఒక్కటే నేరం చేసే ఉద్దేశాన్ని స్పష్టంగా చూపుతున్నది గనుక, ఎవరి మీద ఉమ్మి వేయమని ఈ వీడియోలో చెప్పారో వారు దళిత కులానికి చెందినవారు గనుక స్పష్టంగా ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధ చట్టం కింద వెంటనే అరెస్టు చేసి విచారణ జరపదగిన నేరం అవుతుంది.

నిజానికి జస్టిస్ బిఆర్ గవాయి చేసిన వ్యాఖ్య ఎక్కువలో ఎక్కువ విసుగుతో, వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్య మాత్రమే. మధ్యప్రదేశ్ లోని ఖజురహో ఆలయ ప్రాంగణంలోని జవారి ఆలయంలో ఒక ఏడడుగుల తల లేని విగ్రహం ఉంది. ఈ దేశంలో ఎక్కడ ధ్వంసమైన విగ్రహాలున్నా అవన్నీ ఎప్పుడో ఒకప్పుడు ముస్లిం రాజులు చేసినవే, చేయించినవే అనే తప్పుడు ప్రచారం సంఘ్ పరివార్ కు చాలా ఇష్టమైన ప్రవృత్తి. ఒకప్పుడు ఆలయాలు సంపదకు కేంద్రాలుగా ఉండేవి గనుక ఒక రాజ్యం మీద దాడి చేసిన రాజులు తప్పనిసరిగా ఆలయాల మీద దాడులు చేసేవారు. విగ్రహాల లోపల బంగారం, నిధులు దాచారనే అనుమానంతో విగ్రహాలను ధ్వంసం చేసేవారు. ఇది అన్ని మతాల రాజులూ చేశారు. పదకొండో శతాబ్దికి చెందిన హర్షదేవుడనే హిందూ రాజు దేవోత్పతన నాయక అని ప్రత్యేకంగా దేవాలయాల విధ్వంసం కోసం ఒక మంత్రిని పెట్టుకున్నాడని చరిత్రలో నమోదయింది. కనుక ఒక విగ్రహం ఎవరి వల్ల ధ్వంసం అయి ఉంటుంది అని ఎటువంటి చారిత్రకాధారాలు లేకుండా వాదించడం మరొక మతం పట్ల విద్వేషం వెళ్లగక్కడానికి ఉపయోగపడుతుంది గాని వాస్తవం కాదు.

ఈ ఖజురహో తల లేని విగ్రహం విష్ణుమూర్తిదని, దాన్ని ముస్లింలు ధ్వంసం చేశారని, మళ్లీ దానికి తల అతికించాలని రాకేశ్ దలాల్ అనే వ్యక్తి గత కొంతకాలంగా ప్రయత్నిస్తూ, భారత పురావస్తు శాఖకు దరఖాస్తు పెట్టుకున్నాడు. జవాబుగా భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 2020 మేలో "ప్రాచీన చిహ్నాల, పురావస్తు స్థలాల, శిథిలాల చట్టం 1958 ప్రకారం తాము పురావస్తువుల మరమ్మత్తు, సంరక్షణ మాత్రమే చేయగలం గాని, పునర్నిర్మించే, విడిపోయిన భాగాలను వెతికి తెచ్చి అతికించే చర్యలు తమ పరిధిలోకి రావు" అని స్పష్టంగా జవాబు రాశారు. అయినా ఆ పని చేయమని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాను ఆదేశించాలని కోరుతూ ఆయన సుప్రీం కోర్టులో పిటిషన్ వేశాడు. చట్టప్రకారం ఆ పని చేయడానికి వీలు లేదు అని చెప్పిన తర్వాత కూడా ఆ పని చేయించమని పిటిషన్ వేయడమంటే, కొట్టివేస్తారని తెలిసి కూడా మరేవో దురుద్దేశాలతోనే ఆ పిటిషన్ వేశారనుకోవాలి. జస్టిస్ బి ఆర్ గవాయి, జస్టిస్ మసీహ్ ధర్మాసనం చట్టం ప్రకారం ఆ పని జరగదు అని మరొకసారి స్పష్టం చేశారు. అయినా పిటిషనర్ తరఫు న్యాయవాది పదేపదే అదే మాట అడుగుతుంటే, విసుగెత్తిన జస్టిస్ గవాయి "విష్ణుమూర్తినే అడగండి" అన్నారు. ఎంత విసుగుతోనైనా ఆయన ఆ మాట అనవచ్చునా అనేది వేరే చర్చ. కాని అదేమీ ఎవరికీ అవమానం కాదు. అసలు ఆ పిటిషనే తప్పు.

జనంసాక్షి

చెప్పు విసిరినందుకు తనకు పశ్చాత్తాపం లేదంటూనే, అయినా అది తాను చేయలేదని, భగవంతుడే చేయించాడని రాకేశ్ కిషోర్ అన్నాడు. మరి నిజంగా అలా అన్ని పనులూ అందరిచేతా భగవంతుడే చేయిస్తాడనే విశ్వాసం ఉంటే జస్టిస్ గవాయితో ఆ మాట కూడా భగవంతుడు అనిపించినదే అనుకోవచ్చు గదా!

ఇంతకూ ఆ మాట సాకు మాత్రమే. అసలు సమస్య మనువాదం. ఆ సాకు సాయంతో సంఘ్ పరివార్ జస్టిస్ గవాయి మీద దాడి చేయడానికి అంతకు ముందు నుంచీ వేస్తున్న ప్రణాళికలకు అవకాశం దొరికించుకుంది. ఈలోగా ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆహ్వానం అందుకుని, దాన్ని నిరాకరించి, ఆ ఉత్సవాలకు తాను వెళ్లడం లేదని జస్టిస్ గవాయి తల్లి కమల్ తాయి ప్రకటించడం అసలే కల్లు తాగిన కోతికి ముల్లు గుచ్చుకున్నట్టయింది. వారి అసలు సమస్య, తమ మనుస్మృతి ప్రకారం ఊరవతల, అస్పృశ్యుడిగా ఉండవలసిన వ్యక్తి తీర్పరిగా, న్యాయమూర్తిగా, సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉంటాడా అనే మనువాద అహంకారమే. ఇది వాస్తవంగా మనువాద భావజాలపు సమస్య. రాకేశ్ కిషోర్ ఇంటర్వ్యూ ఆ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నది. ఆ ఇంటర్వ్యూలో ఆయన మాటలన్నీ సంఘ్ పరివార్ అబద్ధాల చరిత్ర ఫాక్టరీలో తయారైనవే. కుల అంతరాల నిచ్చెనమెట్ల వ్యవస్థను, కుల వివక్షను, దళితుల పట్ల అవమానాన్ని, అస్పృశ్యతను సహజం అనుకునే మనువాద భావజాలపు పర్యవసానమే ఈ ఘటన, తదనంతర పరిణామాలు.



• ఎన్ వేణుగోపాల్

# కాన్షిరాం కుల రాజకీయ ప్రకంపనలు

ఓటు హమారా-రాజ్ తుమారా, నహీ చలేగా.. నహీచలేగా" (ఓట్లు మావి-రాజ్యం మీది, ఇకపై చెల్లదు, ఇకపై చెల్లదు), జిస్కి జితినీ సంఖ్యా భారి, ఉస్కి ఉత్ని ఇస్సేదారి (ఎవరెంతో, వారికంతా) వంటి నినాదాలతో దేశ రాజకీయాల్లో ప్రకంపలను సృష్టించిన వీరుడు కాన్సిరాం. స్వాతంత్రానంతరం రాజ్యాంగం అమల్లోకి వచ్చాక అటు దేశంలో, ఇటు రాష్ట్రాల్లోనూ అగ్రకుల ఆధిపత్య రైటిస్ట్, లెఫ్టిస్ట్ పార్టీలే అధికారంలో ఉండేవి. 1975 ఎమర్జెన్సీ తరువాత కూడా ఆ పార్టీలే అధికారంలోకి రావడం గమనార్హం. వీటికి అభిముఖంగా కాన్సిరాం బహుజన ఉద్యమం బయలుదేరింది. ములాయం సింగ్ యాదవ్ 1992 ముందు జనతా దళ్(సోషలిస్ట్) నుంచి ముఖ్యమంత్రి అయ్యాడు. కాన్సిరాం ఆ పార్టీ నుంచి బయటికి రప్పించి ఆయనతో సొంతగా బీసీల రాజకీయ పార్టీనీ పెట్టించాడు. 1993లో ఆ పార్టీ పొత్తుతో యూపీలో బహుజన రాజ్యాధికారం చేజిక్కించుకున్నాడు. ఇది ఆనాటి సాంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా కాన్సిరాం సృష్టించిన రాజకీయ ప్రకంపనలు. డిఆర్డిఓలో శాస్త్రవేత్తగా జీవితాన్ని ఆరంభించిన కాన్సిరాం 31వ ఏటా అంబేద్కర్ రాసిన 'కుల నిర్మూలన' గ్రంథం చదివి ప్రేరేపితుడయ్యాడు. ఈ దేశంలో అట్టడుగు వర్గాల విముక్తికి ఉద్యమాలు సాగించిన పూలే, సాహు మహరాజ్, పెరియార్, నారాయణ గురు, అంబేద్కర్ లకు ప్రతిరూపంగా నిలిచాడు. బహుజన కులాలను ఏకం చేసేందుకు బామ్ సేఫ్, డీఎస్-4 వంటి సంస్థలను ఏర్పాటు చేసి సామాజిక సాంస్కృతిక రాజకీయ చైతన్య బేరి మోగించాడు. 1984 ఏప్రిల్ 14న బహుజన సమాజ్ పార్టీని స్థాపించాడు. ఇదీ 1996 నాటికి జాతీయ పార్టీగా ఎదిగి బహుజన రాజ్యానికి దిక్సూచిగా నిలిచింది. కాన్షిరాం మన నుంచి దూరమై రెండు దశాబ్దాలు కావస్తున్నా ఆయన స్వరాజ్య, సామాజిక న్యాయ పోరాటం కొనసాగుతుంది. ఇటీవల దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల కుల గణన, రిజర్వేషన్ల పెంపు వంటి సామాజిక న్యాయ డిమాండ్లు ఇందుకు నిదర్శనం. కానీ అగ్రకుల రాజకీయ నీడలో అని విఫలమవుతున్నాయి. ఇటీవల తెలంగాణ హైకోర్టులో స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ పై స్టే రావడమే ఇందుకు నిదర్శనం. కోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి తొలగించలేని పరిస్థితి. ఈ క్రమంలో కాన్సిరాం కుల రాజకీయ ఉద్యమపోరాటం పునరుద్ఘాటించాల్సిన సందర్భం ఇదీ.


**కులాల కేంద్రంగా రాజకీయాలు**

కాన్షిరాం కులాన్ని రాజకీయ అస్త్రంగా వాడిని రాజనీతిజ్ఞుడు. కులం పునాదుల మీద ఒక జాతిని కానీ, ఒక నీతిని కానీ నిర్మించలేమని" ఆనాడు అంబేద్కర్ పేర్కొన్నారు. ఆయన ఆధిపత్య కుల పునాదుల మీద జాతీయవాదాని నిర్మించాలన్న అగ్రకులాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్య చేశాడు. దీనిలోని తాత్వికతను అర్థం చేసుకున్న కాన్సిరాం గారు "కులాన్ని రెండంచుల కత్తి"గా పేర్కొంటూ కులాల కేంద్రంగా రాజ్యాధికారాన్ని సాధించాడు. మినీ ఇండియా లాంటి ఉత్తరప్రదేశ్ కు ఒక దళిత మహిళలైన మాయావతిని నాలుగు సార్లు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాడు. ఆమె హయాంలో ప్రజల సామాజిక, ఆర్థిక స్వావలంబనకు పునాది పడ్డది. అట్టడుగు వర్గాల చేతిలో ఆధికారమే ఇలాంటి మార్పులకు కారణమైనది. కాన్సిరాం బహుజనోద్యమం పంజాబ్, రాజస్తాన్, కర్ణాటక, హర్యానా, ఢిల్లీ,కాశ్మీర్, బీహార్, మధ్యప్రదేశ్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా ప్రభావం చూపింది. ఆయన రాజకీయ చైతన్య పోరాటం బీసీ వర్గాలలో రాజకీయ కాంక్షను రగిలించింది. ఆ వర్గాలలో నుంచీ యూపీలో ములాయం సింగ్ యాదవ్, బీహర్ లో లాలూ ప్రసాద్ యాదవ్, రామ్ విలాస్ పాశ్వాన్, నితీష్ కుమార్ మొదలైనవారు తమ సొంత రాజకీయ పార్టీలతో శాసించగలిగారు. దక్షిణాన తమిళనాట ఆత్మగౌరవ రాజకీయాలు ఇందుకు నిదర్శనమే.

**రాజకీయాల్లో సరికొత్త విప్లవం**

రాజకీయాల్లో సరికొత్త నినాదానికి తెరలేపిన కాన్షిరాం గారి

జనంసాక్షి




బాట నేటికి మరువలేనిది. ఒక ఓటు-ఒక నోటు నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారిచ్చే డబ్బుతోనే ప్రచారం చేశాడు. కులాన్ని నిర్మూలిద్దాం-బహుజన రాజ్యాన్ని నిర్మిద్దాం అంటూ దేశవ్యాప్తంగా తనదైన శైలిలో రాజకీయ ఉద్యమం సాగించాడు. నువ్వు 85 శాతం ఉండగా 15 శాతం మీద ఎందుకు ఆధారపడతావు? అని ప్రశ్నించాడు. నీ కాళ్లమీద నీవే పార్లమెంటు, అసెంబ్లీకి నడువు అంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్వాభిమానన్నీ నేర్పిన యోధుడు. ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి, ప్రజల భూమి మీద ప్రజలకు హక్కులేదా? అంటూ అగ్రకుల పాలకులపై ప్రశ్నల వర్షం కురిపించాడు. అనాడు మండల్ కమిషన్ (1980) ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. వీటి అమలుకై డిల్లీ బోట్స్ క్లబ్ ముందు 48 రోజుల ధర్నా చేశాడు. కాన్సిరాం బీసీ రిజర్వేషన్ ఉద్యమం విప్లవానికి కారణమైనది.

**బడుగు బలహీన వర్గాల కన్నీళ్లు, కష్టాలు తీరలేదు. 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలు అగ్రకులాల చేతులకు అధికారమిచ్చి అడుక్కోవడమే దీనికి కారణం. ఈ క్రమంలో భారత రాజ్యాంగం ద్వారా బాగుపడ్డ వారు పీడిత వర్గాల విముక్తికి తోడ్పడాలి. కాన్షిరాం యూపీ తర్వాత ఏపీలో రాజ్యాధికారం కోసం విశ్వప్రయత్నం చేశాడు. ఇక్కడ అగ్రకుల నీడలో నడిచిన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఆయనకు సహకరించలేదు.**

విప్లవం అంటే రేషన్ కార్డు, పెన్షన్ కోసం వంటి సంక్షేమ పథకాల కోసం ఉద్యమాలు, ధర్నాలు చేయడం కాదు. వేల సంవత్సరాల నుంచి దోపిడి చేస్తున్న అగ్రకులాలు మాకు న్యాయం కావాలని రోడ్లపైకి రావడమే విప్లవం. ఇదీ భారతదేశ చరిత్రలో రెండు సందర్భాల్లో జరిగింది. మొదటిది రాజ్యాంగం అమలైన తరువాత, అగ్రకులాలు అదనపు హక్కులు కోల్పోతున్నామని ఎన్.డి తివారి నాయకత్వంలో వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి రాజ్యాంగాన్ని కాల్చి ధర్నా చేశారు. రెండోది 1990లో మండల్ కమీషన్ కు వ్యతిరేకంగా రోడ్లపైన ధర్నా చేస్తూ న్యాయాన్ని అభ్యర్థించారు. ఇలాంటి అనివార్యతను సృష్టించిన అధినాయకుడు కాన్సిరాం గారు. ఇప్పుడు మనం కూడా ఆ సందర్భాలు సృష్టించడమే విప్లవం.

**జాక్ (జేఏసీ) రూపంలో కాన్షిరాం ఉద్యమం**

వేల సంవత్సరాలుగా అణిచివేయబడిన వర్గాలకు పడ్డ బానిస సంకెళ్లు తెంపడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం రాశాడు. కోట్లాది ప్రజలకు ఓటు అనే ఆయుధమిచ్చి మరణించాడు. అయినా బడుగు బలహీన వర్గాల కన్నీళ్లు, కష్టాలు తీరలేదు. 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలు అగ్రకులాల చేతులకు అధికారమిచ్చి అడుక్కోవడమే దీనికి కారణం. ఈ క్రమంలో భారత రాజ్యాంగం ద్వారా బాగుపడ్డ వారు పీడిత వర్గాల విముక్తికి తోడ్పడాలి. కాన్షిరాం యూపీ తర్వాత ఏపీలో రాజ్యాధికారం కోసం విశ్వప్రయత్నం చేశాడు. ఇక్కడ అగ్రకుల నీడలో నడిచిన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఆయనకు సహకరించలేదు. ఇప్పుడు తెలంగాణలో కాన్సిరాం ఉద్యమానికి కొనసాగింపుగా బీసీ ఎస్సీ ఎస్టీల ఐక్య కార్యాచరణ సమితి (జాక్) ఆవిర్భవించింది. ఇది రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ చిరంజీవులు, డాక్టర్ విశారదన్ మహరాజ్, ఉమ్మడి ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, ప్రో.నాగం కుమారస్వామి, ప్రో. రామయ్య షెపర్డ్ మొదలైన వారి ఆధ్వర్యంలో ఏర్పడింది. ఈ జాక్ సారథ్యంలో లక్ష కిలోమీటర్ రథయాత్ర సాగుతున్నది. ఇదీ తెలంగాణలో మూడున్నర కోట్ల పీడిత ప్రజల విముక్తి కోసం సాగే మహా ప్రయాణం. ఇప్పుడు వీరంతా సంఘటితమై, భారత రాజ్యాంగ బలంతో రాజ్యాధికారం వైపు నడవాలి. అప్పుడే సామాజిక న్యాయం సాకారమవుతుంది.



**సంపతి రమేష్ మహారాజ్**
**సామాజిక విశ్లేషకులు**
**7989579428.**

# అహింసతో ప్రజాస్వామ్య దీపం వెలిగించిన మహిళ



2025 అక్టోబర్ 10న నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ శాంతి పురస్కారం ప్రకటించబడింది. ఈ సంవత్సరం ప్రపంచం ఎదురు చూసిన ఆ ప్రతిష్ఠాత్మక బహుమతిని వెనిజులా నేత మరియా కొరినా మచాడో సొంతం చేసుకున్నారు. నార్వేజియన్ నోబెల్ ఇన్స్టిట్యూట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా అనేక మంది నాయకులు, కార్యకర్తలు, సామాజిక మార్గదర్శకులు ఈ పురస్కారానికి అర్హులుగా పరిగణించబడ్డారు. కానీ చివరికి మచాడోను ఎంపిక చేయడం వెనుక ఉన్న ఆలోచన, ఆమె జీవితంలో అహింసకు ,ప్రజాస్వామ్యానికి అంకితమైన పోరాటమే.

మరియా కొరినా మచాడో వెనిజులాలో ఒక ధైర్యవంతురాలైన రాజకీయ నాయకురాలు. ప్రజల హక్కుల కోసం, ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించేందుకు, స్వేచ్ఛా భావనలను కాపాడేందుకు ఆమె చేసిన కృషి విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఆమె రాజకీయ ప్రయాణం ఎన్నో కష్టాలతో నిండి ఉంది. ప్రభుత్వ నిర్బంధం, బెదిరింపులు, వ్యక్తిగత ఇబ్బందులు.. ఇవన్నీ ఎదురైనా ఆమె వెనుకడుగు వేయలేదు. న్యాయం, సమానత్వం, స్వాతంత్ర్యం వంటి విలువలను ప్రజల్లో నాటేందుకు ఆమె నిరంతర పోరాటం సాగించారు. నోబెల్ కమిటీ ఆమె పేరును ప్రకటిస్తూ, "ఈ పురస్కారం ధైర్యవంతురాలైన మహిళలకు అంకితం. చీకటిలో ప్రజాస్వామ్య వెలుగును వెలిగించిన వ్యక్తిత్వానికి ఇది చిహ్నం" అని పేర్కొంది. "మచాడో ప్రజాస్వామ్యమే శాంతికి దారి చూపగలదని రుజువు చేశారు. ఆమె అహింస విధానాల ద్వారానే సమాజ మార్పు సాధ్యమని నిరూపించారు" అని నోబెల్ కమిటీ తెలిపింది. ఈ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా మచాడోకు శుభాకాంక్షల వెల్లువ వచ్చింది.

మచాడో జీవితం ఒక ప్రేరణాత్మక గాథ. ఆమె రాజకీయ దృష్టి కేవలం వెనిజులా వరకే పరిమితం కాలేదు. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, స్వేచ్ఛా భావనలు వంటి విలువలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడమే ఆమె లక్ష్యం. అధికారమార్పిడి హింస ద్వారా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారానే జరగాలని ఆమె ఎప్పుడూ విశ్వసించారు. మచాడో వంటి నాయకురాళ్లు చూపిన దారి ప్రపంచ దేశాలకు ఒక మార్గదర్శక దీపంలా నిలుస్తుంది.

ఆమె పోరాటం అనేది హింసను ప్రతిఘటించే శాంతి సత్యాగ్రహం లాంటిది. వెనిజులా ప్రజలు ఎదుర్కొంటున్న రాజకీయ సంక్షోభం, ఆర్థిక అస్థిరత, మానవహక్కుల ఉల్లంఘనల మధ్య కూడా ఆమె అహింసాత్మక మార్గాన్నే ఎంచుకున్నారు. ప్రజల్లో చైతన్యాన్ని రగిలించడం ద్వారా మార్పును తీసుకురావచ్చని ఆమె నమ్మకం. ఈ విశ్వాసమే ఆమెను ప్రపంచ శాంతి దిశగా అడుగులు వేయించిందని చెప్పవచ్చు. ఈ నోబెల్ పురస్కారం కేవలం మచాడోకు మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా శాంతి, ప్రజాస్వామ్యం, న్యాయం కోసం పోరాడుతున్న మహిళలందరికీ గౌరవప్రదమైన గుర్తింపు. నోబెల్ కమిటీ చెప్పినట్లు "అలుముకుంటున్న గాడాంధకారంలో ప్రజాస్వామ్య దీపాన్ని వెలిగించిన మహిళ"గా మచాడో నిలిచిపోయారు. ఆమె ధైర్యం, సంకల్పం, అహింసా విశ్వాసం ప్రపంచానికి కొత్త స్ఫూర్తిని ఇస్తుంది. ఇలాంటి స్ఫూర్తిదాయక వ్యక్తిత్వాలు మనకు ఒక సత్యాన్ని గుర్తుచేస్తాయి. హింసతో కాదు, ప్రేమతోబీ దమనంతో కాదు, సంభాషణతోబీ యుద్ధంతో కాదు, ప్రజాస్వామ్య విశ్వాసంతోనే శాంతి సాధ్యమవుతుందని. మరియా కొరినా మచాడోకు దక్కిన ఈ నోబెల్ శాంతి పురస్కారం ప్రపంచానికి అహింసా మార్గం పట్ల నూతన విశ్వాసాన్ని నింపింది. ఇది ఒక వ్యక్తి విజయం మాత్రమే కాదు, మానవతా విలువల విజయోత్సవం.శాంతి అనేది నిశ్శబ్దం కాదు, అది న్యాయం, ధైర్యం, ప్రజాస్వామ్యం కలయిక.

జనంసాక్షి



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలి



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ రూపొందించిన బాకీ కార్డును బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో విడుదల చేశారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ఆరు గారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారనీ ఆరోపించారు. హౌస్ అరెస్టులు చేస్తే బిఆర్ఎస్ పార్టీ భయపడేది కాదనీ , ఎన్ని అరెస్టులు చేసిన, కేసులు పెట్టిన కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన బిఆర్ఎస్ పార్టీ భయపడేది కాదని ఈ సందర్భంగా హెచ్చరించారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలను గుర్తుచేయడానికే కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోయారన్న భ్రమల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభయహస్తం ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు.ఈ బాకీ కార్డే కాంగ్రెస్ పతనాన్ని శాసిస్తుందన్నారు. కాగా బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డులోనీ వివరాలను వివరించాలని దిశ నిర్దేశం చేశారు. తెలంగాణలోని సబ్బండ వర్ణాలు తిరిగి కేసీఆర్‌నే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నాయన్నారు. మోసపోతే గోస పడతామని ఎన్నికలకు ముందు కేసీఆర్ పదే పదే చెప్పారు, అదే ఇవాళ నిజమైందన్నారు. ఎకరానికి రూ.15,000 ఇస్తామన్న హామీ ఏమైంది? అది బాకీ, రూ.2 లక్షల రుణమాఫీ ఊసేలేదు, అది బాకీ, రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి చేతులెత్తేశారు,అది కూడా బాకీనే. ఇవన్నీ బాకీ కాదా?" అని ప్రశ్నించారు. 2 లక్షల ఉద్యోగాల హామీ బాకీ. నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, 22 నెలలుగా ప్రతి నిరుద్యోగికి వేలల్లో బాకీ పడింది. ఈ మోసానికి కాంగ్రెస్ ఏం సమాధానం చెప్తుంది? "మహాలక్ష్మి పథకం పేరుతో ఆడబిడ్డలను ఇంత దారుణంగా మోసం చేసిన ప్రభుత్వం మరొకటి లేదు,నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పినరు బాకీ పెట్టారు. ఈ ప్రభుత్వం వచ్చాక పెళ్లైన ఆడబిడ్డలకు తులం చొప్పున బంగారం బాకీ అయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పిఏసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు జయరాజ్,ఆర్ కె శ్రీనివాస్, విశ్వం, మాయ. మల్లేశం, కో కన్వీనర్లు గడ్డమీద కృష్ణ గౌడ్ లింగారెడ్డి, మెదక్ హవేలీఘన్పూర్ మండల పార్టీ అధ్యక్షులు ఎం అంజ గౌడ్,సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ ఆంజనేయులు, నాయకులు ప్రభు రెడ్డి, కిష్టయ్య, ఎలక్షన్ రెడ్డి,ఇస్మాయిల్, బట్టి. ఉదయ్, సాంబశివరావు, శ్రీనివాస్ గౌడ్, నరేందర్ రెడ్డి నారాయణ, ప్రభాకర్ రాములు, బాలయ్య, మోహన్, మండల నాయకులు మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

# అరుదైన శస్త్ర చికిత్సతో మహిళ గర్భం నుండి క్యాన్సర్ కణతి తొలగింపు



**నారాయణపేట, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ఉట్కూర్ మండలానికి చెందిన హాలిమ బేగం (వయస్సు 42) గత సంవత్సరం నుండి కడుపు నొప్పితో బాధపడుతూ నారాయణ పేట్ గీత మల్టి స్పెషాలిటి వైద్యులను సంప్రదించగ శుక్రవారం మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రఖ్యత క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు రాజ్ కుమార్ ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు విశ్వనాథ్ డాక్టర్ గీత నీలవర్ణ స్త్రీ వైద్యనిపుణురాలు కొండలమ్మ వైద్యబృందం అతితక్కువ ఖర్చుతో నిరుపేద మహిళకు అరుదైన శస్త్ర చికిత్స తో ఆమహిళ గర్భం నుండి క్యాన్సర్ కణితి తొలగించారు. హాలిమ బేగం కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫ్రీడమ్ ఆయిల్ బ్రాండ్ అంబాసిడర్‌గా రాహుల్ ద్రావిడ్

- దేశ వ్యాప్తంగా ప్రచారం చేయనున్న మిస్టర్ డిపెండబుల్



**ఖైరతాబాద్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** దేశంలో ప్రముఖ వంటనూనె బ్రాండ్‌లలో ఒకటైన ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్, దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసుకుందని జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్ర శేఖర రెడ్డి, జెమిని ఎడిబు ల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ చేతన్ పింపాల్‌ఖుటే శుక్రవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ భాగస్వా మ్యం ద్వారా టెలివిజన్, డిజిటల్, సోషల్ మీడి యాలో వినూత్న ప్రచారాలలో రాహుల్ ద్రవిడ్ పాల్గొంటారని తెలిపారు. 'ఆరోగ్యకరంగా తినండి, ఆరోగ్యంగా జీవించండి' అనే బ్రాండ్ యొక్క సిద్ధాం తం ద్రావిడ్ యొక్క నమ్మకమైన శ్రద్ధ, సమతుల్యత, చురుకైన ఎంపికలు, సమతుల్యతతో సజావు గా సమలేఖనం చేయబడిందన్నారు.

# కాంగ్రెస్ హయంలోనే అభివృద్ధి

- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం



**సదాశివపేట, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** బిఆర్ఎస్ హయాంలో సదాశివపేట మున్సిపాలిటీ అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 10 ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సదాశివపేట మున్సిపాలిటీనీ ఉద్ధరించింది ఏమీలేదని, అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటుందని గాలి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారాధ్యంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందించడం, గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వడం, పేద ప్రజలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయడం వంటి ప్రజల మేలు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. బిఆర్ఎస్ పాలనలో భూదందాలు, అక్రమాలు జరిగాయని అన్నారు. అభివృద్ధి జరిగిందంటే అది జగ్గారెడ్డి ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు సంగారెడ్డిలో ఐఐటి, ప్రభుత్వ మెడికల్ కాలేజ్, నూతన కలెక్టరేట్ భవనం వంటి ద్వారా సంగారెడ్డి ప్రాంతం అభివృద్ధి పథంలో నడిచిందని తెలిపారు. చింతా ప్రభాకర్ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సదాశివపేట ప్రాంతంలో అభివృద్ధి జరిగిందేంటని ప్రశ్నించారు. పట్టణంలో అభివృద్ధి చేస్తామని చెప్పుకుంటున్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేని సిద్ధాపూర్ లో ఏర్పాటు చేయడంతో ప్రజలు ఆసుపత్రికి వెళ్లాలంటే ?100 ఆటో ఛార్జ్ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో లేని విధంగా పనులు చేపట్టారని ఎద్దేవా చేశారు. పట్టణంలోని వార్డులలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి అవసరాలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ల సహకారంతో ప్రజల అవసరాలను తీరుస్తామని తెలిపారు. అనంతరం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో మైనార్టీలకు చేసింది ఏమీ లేదని, వర్క్ బోర్డు ఆస్తులను అమ్ముకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనార్టీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాయపాడు రమేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు గౌడ్,నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, శంకర్ గౌడ్, షజ్జీ, ఖలీమ్, వెంకన్న, బిట్ల ప్రేమ్, వీరన్న,లతీఫ్,రఘు ,మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన దిండు ప్రవీణ్ గౌడ్



**హయత్‌నగర్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్ లోని ప్రగతినగర్ కాలనీ లో శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ పునర్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కు డైరెక్టర్ అఫ్ ఎండోమెంట్ కర్మాంఘాట్ హనుమాన్ దేవస్థానం, చైర్మన్ నల్ల పోచమ్మ దేవాలయం దిండు ప్రవీణ్ గౌడ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ కొండ సురేఖ సానుకూలంగా స్పందించి తప్పనిసరిగా దేవాలయం పునర్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వారు తెలియజేశారు.

# జాతీయ బీసీ సేన నాయకులు అరెస్ట్




**జిల్లేడు చౌదరి గూడెం, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** జిల్లేడు చౌదరిగుడా మండల కేంద్రంలో బిసి సేన జిల్లా ప్రధాన కార్యదర్శి జయమ్మ ఆధ్వర్యంలో42% బీసీల రిజర్వేషన్ కొరకు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు జిల్లా ప్రధాన కార్యదర్శి జయమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల 42 శాతం రిజర్వేషన్ జీవో 9 అమలు చేయాలని డిమాండ్ చేశారు అగ్రవర్ణాధిపత్యంతో బీసీలను కాల రాస్తున్నారని బిసిల ఐక్యత ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాలు రాజకీయాల్లోకి రాకూడదనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కలిపించినట్లే కలిపించి వెనకులాకుందని మండిపడరు. అలాగే అగ్రవర్ణాల నాయకులు బీసీల హక్కులను అడ్డుకుంటున్నారని వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల జోక్యంతో ధర్నా భగ్నం అయ్యిందని ఈ అరస్ట్ లతో మా ఉద్యమాని ఆపలేరని తెలిపారు. ఈ కార్యక్రమానికి మద్దతిస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం జరుగుతున్న పోరాటం సామాజిక న్యాయానికి ప్రతీక అని పేర్కొన్నారు స్టే పేరుతో బీసీలకు అన్యాయం జరుగుతుంటే విద్యార్థి ఉద్యమం తరపున మద్దతు పోరాడుతామని అన్నారు. బీసీల హక్కులను రక్షించేలా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ బీసీలు వెనకబడుతూ వస్తున్నారు నేటికీ కూడా బీసీలను వెనకకు నేటిస్తునారు ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 9 వెంటనే అమలు చేయాలనీ పేర్కొన్నారు. పోలీసులు అరస్ట్ చెసి జిల్లేడు చౌదరిగూడ ఠానకు తరలించారాని జిఓ 9అమలుయనంతవరకు కొట్లాడతామణిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మండల్ అధ్యక్షురాలు వీరాపురం అనిత. ఆకాష్. చౌదర్ గూడా మండల్ అధ్యక్షుడు బోయ చెన్నయ్య. నాయకుడు ఆకాష్ దామోదర్. బాలమణి, పొట్టి లావణ్య, ముష్టిపల్లికన్న జంగయ్య ముష్టిపల్లి కన్న మల్లేష్.లుపాల్గొన్నారు.

# మున్సిపల్ ఐదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



**చేవెళ్ల, అక్టోబరు 10 (జనంసాక్షి) :** మున్సిపల్ ఐదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి దేవేందర్ తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యూనియన్ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈనెల 14, 15 తేదిల్లో తుర్కయంజాలలో తెలంగాణ మున్సిపాల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఐదవ రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహా సభకు మున్సిపాల్ కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ యూనియన్ చేవెళ్ల ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరేష్, కోశాధికారి సిద్ధమ్మ, ఉపాధ్యక్షులు దస్తగిరి, నాయకులు జనార్దన్, రంగా, రాఘవేందర్, ప్రశాంత్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలి

- సమీక్షలో కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను సేకరించి భూ భారతి పోర్టల్ లో నమోదు చేసి వాటిని నిషేధిత జాబితాలోకి చేర్చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలసి అన్ని మండలాల తహాసిల్దార్ల తో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా అసైన్డ్ భూము లు,ఎండోమెంట్స్, వక్ఫ్ బోర్డులు లేదా ఇతర మత సంస్థలకు కేటాయించిన భూములు, సీలింగ్, భూదాన్ భూముల వివరాలను సేకరిం చి వాటిని భూ భారతి పోర్టల్ లో నమోదు చేసి నిషేధిత జాబితాలోకి చేర్చాలని తెలిపారు. మండలాల వారీగా ఆయా భూముల వివరాలను తహశీల్దార్ల ను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

### వరి కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ తప్పనిసరి

జిల్లాలో ఈ ఖరీఫ్ వానాకాలం సీజన్ లో వరి ధాన్యం దిగుబడి పెరిగిందని, ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల పై తహసీల్దార్ల పర్యవేక్షణ ఉండాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ఆదేశించారు.గత సీజన్ లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. మండల స్థాయిలో ఏవో, ఏఈఓ, హార్వెస్టర్ లతో తహసిల్దార్లు సమావేశం నిర్వహించి వరి కొనుగోళ్ల ప్రక్రియ జిల్లాలో సజావుగా కొనసాగించేలా చూడాలన్నారు. వరి ధ్యానంతో పాటు ఈ సారి పత్తి కొనుగోళ్ల విషయంలో ను ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీలులేదని, కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సమావేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి బాలామణి, పౌరసరఫరాల శాఖ అధికారులు సైదులు, బాల్ రాజ్, అన్ని మండలాల తహా సిల్దారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులందరూ సకాలంలో నిర్మించుకునేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు.శుక్రవారం ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం 26 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనప్పటికీ 8 మంది లబ్ధిదారులు మాత్రమే నిర్మాణాలు చేపట్టారని,మిగతా వాళ్లు కూడా నిర్మించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇసుక కొరత కారణంగా నిర్మాణం ఆలస్యం అవుతుందని పలువురు లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇసుక కొరత లేకుండా లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జిల్లాలో సకాలంలో పూర్తయి రాష్ట్రంలోనే ముందంజలో ఉండేలా చూడాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఇటిక్యాల ఎంపీడీవో సయ్యద్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి శారద,ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు స్టేకు నిరసనగా తాండూర్ అంబేద్కర్ చౌక్ వద్ద బీసీల ధర్నా

- ధర్నాలో జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్



**తాండూరు, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడం హైకోర్టు స్టే ఇవ్వడం అగ్రవర్ణాల కుట్రలో భాగమేనని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తాండూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు విధించిన స్టే ఆర్డర్కు వ్యతిరేకంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా జరిగింది. బీసీ నాయకుల నినాదాలతో తాండూర్ దద్దరిల్లింది. ఈ సందర్భంలో జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం, హైకోర్టు ద్వారా స్టే ఇప్పించడం అగ్రవర్ణాల కుట్రలో భాగమని తీవ్రంగా విమర్శించారు. రాజ్యాధికారాలు అగ్రవర్ణాల చేతుల్లో ఉన్నంతకాలం బహుజనులు బానిసలుగానే ఉంటారని ఆయన పేర్కొన్నారు,ఎమ్మెల్యే నుండి సీఎం వరకు ఎక్కువ శాతం అగ్రకులాలే పదవులు అనుభవిస్తుంటే కేవలం స్థానిక సంస్థల ఎన్నికలకు 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కేటాయిస్తే ఓర్వలేక కోర్టులను ఆశ్రయించారని ఆవేదన వ్యక్తం చేశారు.అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల సమస్యలపై నిజమైన నిబద్ధత ఉంటే, బిజెపి మరియు బిఆర్ఎస్ పార్టీలు కోర్టులో ఇంప్లేడ్ పిటిషన్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు బిజెపి పార్టీ 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు అయితే ముస్లింలు లబ్ధి పొందుతారని సాకుతో అడ్డుకుంటున్నారని గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం 34 ఉన్న బీసీల రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గడానికి కారణమైందని ఆరోపించారు.అలాగే కోర్టులో పిటిషన్ వేయకుండా మాధవరెడ్డిని అడ్డుకునే శక్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేదా?అని ప్రశ్నిస్తూ, ప్రభుత్వం బీసీల హక్కుల విషయంలో నిష్క్రియగా వ్యవహరిస్తోందని ఆరోపించారు బీసీ హక్కుల కోసం, రిజర్వేషన్ల రక్షణ కోసం, ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టులో విరోధ పిటిషన్ స్లీప్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్యదర్శి సయ్యద్ సుకుర్ ,జిల్లా బీసీ నాయకులు గడ్డం వెంకటేష్ ,మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి విజయలక్ష్మి, జగదీశ్వరి, పెద్దేముల్ మండల అధ్యక్షురాలు శివ లీల,బీసీ సంఘం సోషల్ మీడియా ఇంచార్జ్ బసవరాజ్,బీసీ సంఘం బషీరాబాద్ మండల అధ్యక్షులు నరేందర్,రజక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ,నాయి బ్రాహ్మణ సమాజ అధ్యక్షులు పరమేష్, ముద్రాజ్ సంఘం కార్యదర్శి రాము, బిసి యువ నాయకులు పరమేష్, మంతటి రాజు, బాబు మల్కాపూర్, యాసర్, టైలర్ రమేష్, జావీద్ జుంటుపల్లి వెంకట్, శివ, అరుణ్ రాజ్ సురేష్, అంజద్ అలీ భాష, సిబి వినోద్, నందు,పాండు ముదిరాజ్ ధర్నాలో బీసీ సంఘాల ప్రతినిధులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
11 అక్టోబర్ 2025

# అబద్ధాలు, మోసాలకు కేర్ ఆఫ్ కాంగ్రెస్

- కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదు
- హైడ్రా లింక్‌తో జూబ్లీహిల్స్ పోటీకి ఎంఐఎం దూరం
- ఎవరితో కలవాల్సిన అవసరం బిజెపికి లేదు
- బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నామాజీ




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** అబద్ధాలు, మోసాలకు కేర్ ఆఫ్ కాంగ్రెస్ అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. శుక్రవారం నారాయణపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండు రెడ్డి,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,కోశాధికారి సిద్ధి వెంకట్ రాములు,మీడియా ఇంఛార్జి కిరణ్ దగే,జేఏసీ వెంకటయ్య తో కలిసి మాట్లాడుతు ప్రజలను మోసం చేయడం అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్ పార్టీ నైజం అని అన్నారు.ఇప్పుడు కపట ప్రేమ వలకబోస్తు 42శాతం బిసి రిజర్వేషన్ల పేరుతో బిసిలను మోసం చేసిందని అన్నారు.బిసి రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని జిఓ 9 నీ కోర్టు కొట్టి వేయడంతో మరోసారి మోసం బయట పడిందని అన్నారు. నిజంగా బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని చిత్తశుద్ధి ఉంటే పకడ్బందీగా ప్రకటించాలఅన్నారు.అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్ కు పంపిన బిల్లుపై గడువు ముగియకుండా గవర్నర్ నిర్ణయం కోసం ఎదురు చూడకుండా 42 శాతం బిసి రిజర్వేషన్లను ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఎలాగో ఎవరైనా కోర్టుకు వెళతారు జిఓను కోర్టు కొట్టివేస్తే నెపాన్ని ఇతరులపై నెట్టాలనే కాంగ్రెస్ కుట్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు మోసాలతో పదవిని కాపాడుకుంటున్నారు. అని విమర్శించారు. బిసిల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదని అన్నారు.బిజెపి 42 శాతం రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు ఇచ్చిందని అన్నారు. కేవలం కోర్టు కొట్టి వేయడంతో కాంగ్రెస్ బండారం బయట పడడంతో నెపాన్ని బిజెపి, బిఆర్ఎస్‌లపై నెడుతున్నారు అని మండిపడ్డారు. కానీ బిజెపికి ఎవరితో కలవాల్సిన అవసరం లేదు అని స్పష్టం చేశారు.కాంగ్రెస్ బీఆర్ఎస్ కలిసి బిసిలను మోసం చేశాయని అన్నారు.అంతే కాకుండా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేయక పోవడంలో రెండు పార్టీల మధ్య ఉన్న ఫెవికాల్ బందం ప్రజలు గుర్తిస్తున్నారు అని అన్నారు.ఎం ఐ ఎం హైడ్రా భయంతో పోటీ చేయడం లేదని విమర్శించారు.కానీ హామీలు విధ్మరించి బిసిలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదనీ హెచ్చరించారు.ప్రజలు కాంగ్రెస్ కుటిల రాజకీయాలను గుర్తించి బుద్ధి చెప్పాలని కోరారు.

## ఏటీసీలో శిక్షణతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ఏటీసీలో శిక్షణతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట పడుతుందని జిల్లా కలెక్టర్ రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హవేలి ఘనపూర్ మండలం లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏటిసి సెంటర్ మొత్తం కలియ తిరిగి సౌకర్యాలను జరుగుతున్న వివిధ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు, పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీలో ఉన్న అధునాతన మిషనరీ గురించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ శిక్షణ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట ఏ టి సి సెంటర్ నిర్వాహకులు. సిబ్బంది పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రక్షణ కల్పించాలి



**మల్దకల్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గావాయ్ కి రక్షణ కల్పించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏల్కూర్ సవరన్న అన్నారు. శుక్రవారం కెవిపిఎస్ మల్దకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన దుండగుని శిక్షించాలని కోరుతూ బస్టాండులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్కూర్ సవరన్న మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానంలో ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా సనాతన మతోన్మాదం తలకెక్కిన న్యాయవాది రాకేష్ కిషోర్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై బూటి విసిరి దాడి చేయడానికి ప్రయత్నించడం ఆందోళనకర ఘటన అని అన్నారు.దాడి చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని లేనియెడల ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆటో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీతో ప్రజాస్వామ్యం ఖూనీ

- ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** దేశంలో ఓటు చోరీతో కేంద్ర పాలకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారనీ నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపుమేరకు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి. సలీం ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెంపర్ణిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఎమ్మెల్యే సంతకం చేసి,సంతకాల సేకరణ కార్యక్రమంను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు చోరీ చేయడమంటే దేశ పౌరుల హక్కులను దొంగలిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమేనన్నారు. ఓటు చోరీ చేస్తూ రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ప్రయత్నం చేస్తున్నదని, మహారాష్ట్ర, కర్ణాటకలలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా నిరూపించారన్నారు. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసుకొని కొన్ని రాష్ట్రాల్లో ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారన్నారు. ఉద్దేశ్య పూర్వకంగా ఓట్ల తొలగింపును కొందరు ప్రవేట్ వ్యక్తులు చేస్తున్నట్టు బహిర్గతం కావడం ఆందోళన కల్గిస్తున్న విషయామన్నారు. ఓటు చోరీ పై కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోరీ ఉద్యమానికి దేశ ప్రజలందరూ మద్దతూ తెలపాలని కోరారు. అందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన వోట్ చోరీ సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.ప్రతి గ్రామం మరియు వార్డ్ లలో ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎండి. సలీం, మాజీ మార్కెట్ చైర్మన్లు బండి. వేణుగోపాల్, సుధాకర్,సరాఫ్ నాగరాజు,మార్కెట్ వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు,ఆర్టివో బోర్డు సభ్యుడు పోషల్ రాజేష్, సీనియర్ నాయకులు గందే. చంద్రకాంత్, మనోహర్ గౌడ్,హరి నారాయణ భట్టాడ్,కోట్ల రవీందర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు మహేష్,రమేష్, మారుతీ, వెంకుగౌడ్,డా.సాయిబాబు మహిళావిభాగం జిల్లా మరియు పట్టణ అధ్యక్షురాలు ప్రసన్న రెడ్డి,శారద,సంధ్యరెడ్డి,జిల్లా యూత్ అధ్యక్షులు కోట్ల.మధుసూదన్ రెడ్డి, కుర్వ మనోజ్, బండి అనంద్,సునీల్,సిద్ధన్ లక్ష్మణ్,మసి పవన్, మాజీద్ పాషా, హసనుద్దీన్,సత్యా రెడ్డి, మధు యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు



**నంగునూరు, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు చట్టబద్ధత లేకుండానే ఎలక్షన్స్ నోటిఫికేషన్ వేసి సిఎం రేవంత్ రెడ్డి కుట్ర పూరిత చర్యలు చేపట్టాడని బీఆర్ఎస్ పార్టీ బీసీ నేతలు మండల పార్టీ అధ్యక్షులు, అనగోని లింగం గౌడ్ కోల రమేష్ గౌడ్, మండిపడ్డారు. కాంగ్రెస్ గవర్నమెంట్ జీవో 9 పేరిట బీసీలను నమ్మించి గొంతు కోసే ప్రయత్నాలు చేయడం తగదన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకులకు మద్దతు తెలుపుతూ మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానం కేవలం డ్రామా అని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధానమంత్రిని ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. ఇది బీసీల పట్ల ప్రభుత్వం ఎంత చులకన వైఖరి ప్రదర్శిస్తుందో తెలియజేస్తోందని ఆరోపించారు. జీవో 9 అమలు కాదని తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడిందని, అసెంబ్లీలోనే మాజీ మంత్రి హరీష్ రావు ఈ విషయాన్ని చెప్పినా, నాటకానికి శ్రీకారం చుట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలను అమలు చేయలేక పక్కా దారి పట్టించేందుకు ఈ నాటకం ఆడుతున్నారని వారు ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్'ను నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని, బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుంటే బీఆర్ఎస్ పోరాడుతుందని వారు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో పల్లెలు అద్భుతంగా ఉండేవని, కానీ కాంగ్రెస్ వచ్చాక అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ డిక్లరేషన్ పై అబద్ధాలు మోసాలు కాంగ్రెస్ గవర్నమెంట్ కే దక్కుతుందని అన్నారు. సమావేశంలో నాయకులు కిష్టారెడ్డి , వెంకట్ రెడ్డి, రంగు రాజు గౌడ్, జయపాల్ రెడ్డి, చెలికాని మల్లేశం, వేణు చక్రవర్తి, చిన్న మల్లయ్య, వీరా గౌడ్, ఆనందం, కనకయ్య పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేధించాలి

- ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి కె.రవీందర్ రెడ్డి




**నంగునూరు, అక్టోబరు 10 (జనం సాక్షి) :** విద్యార్థులకు ఇంటర్ కీలక దశ అని ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి కె.రవీందర్ రెడ్డి చెప్పారు.నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రధానాచార్యుడు కె.శివకోటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి కె.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దాన్ని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా తగిన కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కార్పొరేట్ కళాశాల కంటే నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని చెప్పారు. ఉన్నత చదువులు చదివి టీజీఎస్పీఎస్ ద్వారా ఎంపికైన అధ్యాపకులు ప్రభుత్వ జూనియర్ కళాశాల పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అధ్యాపకుల సేవలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలను సాధించాలని చెప్పారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా అధ్యాపకులు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కళాశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. వచ్చే వార్షిక ఇంటర్నెట్ ఫలితాల్లో జిల్లాలో నంగునూరు మండలం ప్రథమ స్థానంలో నిలిచే విధంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి, చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యుడు కె.శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు జ్యోతి, బీమ్ రావు, భరత్, కవిత, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** సమాచార హక్కు చట్టం ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత, జవాబుదారి తనాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించడం జరిగిందని, ఈ చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ అన్నారు. ఈనెల 5 నుంచి 12 వరకు ఆర్టీఐ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం గద్వాల ఐడిఓసీ సమావేశపు మందిరంలో జిల్లా అధికారులకు చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులకు సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం వారు అడిగిన సమాచారాన్ని నిబంధనల ప్రకారం ఇవ్వడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఆయా శాఖల నుంచి తమకు కావలసిన సమాచారాన్ని పొందడం పౌరుల హక్కుగా చెప్పారు.ఈ చట్టం ప్రకారం ప్రజలు అడిగిన సమాచారాన్ని నిర్దేశిత సమయంలో ఇవ్వకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వారోత్సవాల సందర్భంగా గ్రామాలు,మండల,డివిజన్,జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.సమాచార హక్కు చట్టం దరఖాస్తులను ఎలా అందజేయాలి,ఎలాంటి సమాచారాన్ని అడగకూడదు అనే విషయాలపై ప్రజలకు ముందుగానే తెలియజేయాలన్నారు. ప్రజలు అడిగిన దాని ప్రకారం ఆయా శాఖలలో ఉన్న సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వడం అధికారుల బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో సమాచార హక్కు చట్టంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, నర్సింగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**మల్దకల్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులుతమ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సంబంధాల శాఖ అర్ఫద్దీన్ ఆధ్వర్యంలో గ్రామ అధికారుల సమక్షంలో మల్దకల్ మండలం మల్లెందొడ్డి గ్రామంలో గ్రామ పరిసరాలు పరిశుభ్రత అంటువ్యాధులు తగు జాగ్రత్తలు పై గ్రామ ప్రజలకు గ్రామ పెద్దలకు యువతకు అందరికీ తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులుకేశవులు,హజ్రత్, స్వామి,భూపతి తమ ఆటపాట మాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

# అన్ని రకాల పంటలకు రైతు ఆధారిత బీమా సౌకర్యం కల్పించాలి



**మక్తల్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** అన్ని రకాల పంటలకు రైతు ఆధారిత బీమా సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదు. రైతే దేశానికి వెన్నుముక అని గొప్పలు చెప్పే నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒక్కసారి గ్రామాలకు వెళ్లి వారి కుటుంబాలను, పొలాల్లో వేసిన పంటలు చూడండి అప్పుడు వారి పరిస్థితి ఎలాగుందో అర్థం అవుతుంది.ఆరుగాలం కష్టపడి పంటలు పండిద్దాం అంటే పంట నష్టం ఏరూపంలో వస్తుందోనని దినదినం గండములా గడుపుతున్నాడు.పంట విత్తనాలు వేసిన మొదలు పంటలు చేతికి వచ్చి వ్యవసాయ మార్కెట్ లో అమ్మేవరకు గ్యారంటీ లేదు అని అంటున్నారు.విత్తనాలు నాటినప్పుడు వర్షాలు సరి అయిన సమయంలో రాకపోతే మొలకెత్తవు,ఒకవేళ మొలకెత్తిన వర్షాలు పక్షం రోజులు పడకపోతే వాడిపోతాయి.అన్ని తట్టుకొని పూత , పిందె దశకు వచ్చినప్పుడు అధిక వర్షాలు కురిస్తే పూత,పిందె రాలి అపార నష్టం కల్గుతుంది.మిగిలిన పూత, పిందె పంట చేతికి వచ్చే సమయంలో మళ్ళీ వర్షాలు పడితే పంటల దిగుబడి పూర్తిగా పడిపోతుంది.పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు.చివరకు పండిన కొద్ది పంట అమ్ముకుందామని మార్కెట్ కు తీసుక పోతే అనేక కారణాలు చెప్పి దళారులు మోసం చేస్తున్నారు అని తెలిపారు. ఈ సంవత్సరం రైతుల పరిస్థితులు పైన పేర్కొన్న విధంగా ఉన్నాయి.కావున ప్రజా ప్రతినిధులు,సంబంధిత అధికారులు,మంత్రులు అందరూ క్షేత్ర స్థాయి పంటలు పరిశీలించి ముఖ్యమంత్రి దృష్టికి రైతుల కష్టాలు, నష్టాలు తీసుకొని పోయి పంట నష్ట పరిహారం ఇప్పించే విధంగా కృషి చేయాలి.దానితో పాటు ప్రకృతి వైపరీత్యాలు, తుపానులు, అతివృష్టి, అనావృష్టి మరియు వాతావరణ పరిస్థితుల వలన పంట నష్ట పరిహారం జరిగితే రైతును ఆదుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక బీమా పథకం పెట్టి రైతులను ఆదుకొనట్లు తెలంగాణ ప్రభుత్వం కూడా గ్రామ యూనిట్‌గా రైతు ఆధారిత బీమా పథకాలు ప్రవేశ పెట్టి రైతులను ఆదుకోవాలని, పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలని అన్నారు. ఈ సంవత్సరం అధిక వర్షాల కారణంగా పత్తి పంట పూర్తిగా నష్టపోయింది,ఇలాగే వర్షాలు పడితే కంది పంట కూడా పూత దశలో ఉంది కావున పూత మొత్తం రాలుతుంది మరియు వరి పంటలు పొట్ట దశలో ఉన్నవి కావున వరి పంటలు అన్ని కూడా అడ్డం పడి వడ్లు తాలు మరియు మొలకలు వచ్చే పరిస్థితి ఉంది అని అన్నారు.కావున ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులకు ఖచ్చితంగా నష్టపరిహారం చెల్లిస్తేనే రైతులకు కొంత అండ ఉంటుందని లేకపోతే అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యలు పెరిగే అవకాశం ఉన్నాయని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా ఆవేదన వ్యక్తం చేశారు.

# స.హ చట్టం నిబంధనల ప్రకారం సమాచారాన్ని అర్జీదారులకు అందించాలి

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 10 (జనంసాక్షి) :** సమాచార హక్కు చట్టంలో అందిన దరఖాస్తులకు సంబంధించిన సమాచారాన్ని నిబంధనల ప్రకారం అర్జీదారులకు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజా సమాచార అధికారులతో సమాచార హక్కు చట్టం – 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టంలో పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకమని, సమాచార హక్కు చట్టం నిర్వహణలో పారదర్శకత ప్రామాణికమని, అభ్యర్థులు దరఖాస్తు ద్వారా కోరిన సమాచారాన్ని చట్టం నిబంధనలకు లోబడి అందించాలని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ చట్టం అమలు ద్వారా పని సామర్థ్యం పెరుగుతుందని, దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా అందించాలని తెలిపారు. అధికారులు సమాచార చట్టాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లాలని, ప్రజా సంఘాల సభ్యులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అర్జీదారులు కోరిన సమాచారాన్ని అందించడం ద్వారా ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో ప్రతి అంశంపై అవగాహన కలిగిన పౌరులు సమాజాభివృద్ధికి పునాది లాంటి వారని తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రతి భారత పౌరులకు వర్తిస్తుందని, ఈ చట్టాన్ని వినియోగించుకుని సమాచారం తెలుసుకోవడం ద్వారా మాట్లాడడం, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పొందడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో జరిగే ప్రతి విషయంపై అవగాహన కల్పించి పూర్తి సమాచారం తెలియజేయడం ద్వారా పారదర్శకమైన ప్రభుత్వ పాలన ప్రజలకు అందుతుందని తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సేవ అభినందనీయం

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబా




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం (వరల్డ్ మెంటల్ హెల్త్ డే) ను పురస్కరించుకొని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ కార్యదర్శి యం.సాయి కుమార్ అధ్యక్షతన "మిషనరీస్ ఆఫ్ ఛారిటి", కాశిబుగ్గ, వరంగల్ లోని మేథో దివ్యాంగులైన చిన్నారులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ మరియు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ హాజరై, మాట్లాడుతూ "మానసిక దివ్యాంగులను చేరదీసి, వారిని ఏ విషయంలోనూ తక్కువ చేసి చూడొద్దన్నారు. దివ్యాంగులకు సేవ చేస్తున్న సిబ్బందిని అభినందించారు. న్యాయ సేవలు, సహకారం కోసం న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. భవిష్యత్తులో వీరికి కావలసిన అన్ని రకాల వైద్య సేవలకు మమ్మల్ని సంప్రదించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, డిప్యూటి లీగల్ ఏయిడ్ కౌన్సిల్ శ్రీనివాసరావు, ఇంతెజార్గంజ్ సబ్ ఇన్స్పెక్టర్లు టీ.తేజ, ఎన్.వెంకటేశ్వర్లు డా.క్యూరీ, డా.అనూహ్య, సిస్టర్ సవీన మరియా, సిస్టర్ అంజలిక మరియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేథో దివ్యాంగులకు పండ్లు, స్వీట్లను అందించి, వారితో కలిసి కాసేపు సరదాగా గడిపారు.

## ప్రజావాణి 13 నుండి కొనసాగింపు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 10 (జనంసాక్షి) :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 13వ తేదీ నుండి యధావిధిగా కొనసాగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని, అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



## జూకల్ విద్యార్థినుల ప్రతిభకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**చిట్యాల, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** భూపాలపల్లిలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన 69వ ఎస్ జి ఎఫ్ ఐ గేమ్స్ జిల్లా స్థాయి అండర్–17 బాలికల వాలీబాల్ పోటీలలో జడ్పిహెచ్ఎస్ జూకల్ పాఠశాల విద్యార్థినులు నూనేటే ఐశ్వర్య, కొడారి శరణ్య తమ అత్యుత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణ తెలిపారు. ఈనెల 14న వరంగల్‌లోని ఓసిటి గ్రౌండ్ వద్ద జరిగే పోటీలలో వీరు పాల్గొననున్నారు. పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చడం గర్వకారణం. రాష్ట్ర స్థాయిలో కూడా వారు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని నమ్మకం ఉందని అన్నారు. విద్యార్థినుల విజయానికి ఫిజికల్ డైరెక్టర్ గాజర్ల శ్రీనివాసు కృషి విశేషమని ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణపేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు విద్యార్థినులను అభినందించారు.



## విద్యార్థులు చేసే పనిలో నైపుణ్యం సాధించాలి

- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** విద్యార్థులు చేసే పనులు పర్ఫెక్ట్‌గా ఉండాలని, నైపుణ్యం ఉన్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తారంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని (ఎటిసి) జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లను, పరికరాలను పరిశీలించి వాటి పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆధునాతన పరికరాలు ఏర్పాటు చేసినందున వాటిని సమర్థవంతంగా ఉపయోగించి నైపుణ్యం సాధించాలని విద్యార్థులకు సూచించారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. క్రమం తప్పక కళాశాలకు హాజరు కావాలని, ఎంపిక చేసుకున్న కోర్సుల్లో చక్కటి నైపుణ్యం సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ జుమ్మా నాయక్ కలెక్టర్‌కు ఏటీసీలో ఒక సంవత్సరం, రెండు సంవత్సరాల వ్యవధిలో 6 కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మొత్తం 244 మంది విద్యార్థులు నమోదు చేసుకునే అవకాశం ఉండగా ఇప్పటివరకు 172 మంది విద్యార్థులు నమోదు అయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జుమ్మా నాయక్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందే..

- టిఆర్పీ జిల్లా నాయకుడు రవి పటేల్
- భూపాలపల్లిలో ధర్నా, రాస్తారోకో
- లీడర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందేనని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పీ)జిల్లా నాయకుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త బంద్ లో భాగంగా పార్టీ జిల్లా నాయకులు రవి పటేల్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా, రాస్తారోకో చేశారు. అంతకుముందు నాయకులు, కార్యకర్తలు కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న విషయాన్ని గమనించిన ఎస్సై సాంబమూర్తి ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తమ సిబ్బందితో వెళ్లి ధర్నా చేస్తున్న నాయకులను బలవంతంగా లాక్కెళ్లి, అదుపులోకి తీసుకుని వదిలేశారు. ధర్నా సందర్భంగా టిఆర్పీ జిల్లా నాయకుడు రవి పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను అణిచివేయడానికి పెద్ద మొత్తంలో పోలీసులను మోహరించి ఉద్యమాన్ని అణిచివేసే విధంగా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఏం జరిగినా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చే వరకు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి పార్టీలకు బీసీలపై చిత్తశుద్ధి లేదని, 42 శాతం రిజర్వేషన్లపై అన్ని పార్టీలు తమ ద్వంద వైఖరిని ప్రకటిస్తున్నాయన్నారు. 64శాతం ఉన్న బీసీలు తమ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమ తరహాలో మరో ఉద్యమం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ 9లో ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురాకుండా దొంగ కారణాలు చెప్పి వెనకబడేస్తున్నారని విమర్శించారు. అన్ని పార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో లేదని, కావున ప్రజలం తా కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి నేతలను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్పీ జిల్లా నాయకులు కరుణాకర్, చంద్రశేఖర్, సంతోష్, శ్రీను, వెంకన్న, సమ్మయ్య, నవీన్, అక్షయ్, సన్నీ, శంకర్రావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## భారీగా పోలీసుల మోహరింపు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో పోలీసులు శుక్రవారం భారీగా మోహరించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో వివిధ సంఘాలు బంద్ కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కాగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా భూపాలపల్లి పట్టణంలోని ముఖ్యకూడళ్ల వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. లాఠీ కర్రలు పట్టుకుని మోహరించడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఇదిలా ఉండగా భూపాలపల్లి పట్టణంలో రిజర్వేషన్లపై ధర్నాలు, ర్యాలీలు మినహా ఎలాంటి బంద్ ప్రభావం కనిపించలేదు.

# ముగ్గురు నకిలీ వైద్యులపై కేసులు

**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం గత నెలలో నిర్వహించిన తనిఖీ లలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ మరియు హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు నకిలీ వైద్యుల (ఫేక్ డాక్టర్లు) పై ఎన్ ఎం సి చట్టం మరియు టి ఎం పి ఆర్ చట్ట ప్రకారం కేసులు నమోదు చేశారు.

**తనిఖీలలో పట్టుబడ్డ నకిలీ వైద్యులు :**

1. బొనగల అనిల్, ఎర్రగట్టుగుట్ట, హసన్పర్తి మండలంలోని ఎస్ ఆర్ ఆర్ దయగ్నొస్టిక్స్ వద్ద తాను ఎంబీబీఎస్ యోగ్యత లేకుండా అలొపతి వైద్యం చేస్తూ, ఇంజెక్షన్లు మరియు మందులు అందజేసినందుకు మరియు అనుమతి లేకుండా డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహించినందు ఎఫ్ ఐ ఆర్ నెంబర. 553/2025, హనూమకొండ పోలీసులు కే యూ సి పి ఎస్ వద్ద నమోదు చేయబడింది.




2. యాదవ నగర్ లో దుర్గ0 క్రాంతి కుమార్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ గా చదివి "ఫస్ట్ ఎయిడ్ సెంటర్ బెడ్లతో కూడిన ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహిస్తూ, అలొపతిక్ వైద్య పరీక్ష మరియు మందులు ఇస్తున్నట్టుగా మరియు నకిలీ వైద్యుడిగా ఎఫ్ ఐ ఆర్ నెబర్. 519/2025 హనుమకొండ పోలీస్ స్టేషన్ వద్ద నమోదు.

3. హన్మకొండ భీమారం ఇందిరా గాంధీ బొమ్మ వెనకాల శ్రీనివాస క్లినిక్ నిర్వాహకుడు నకిలీ వైద్యుడు ఇగ్గడి శ్రీనివాస్ కూడా తన మెడికల్ స్టోర్ అక్రమంగా క్లినిక్ నిర్వహిస్తూ అలోపతి వైద్యం సేవలు నిర్వహిస్తునట్టు గుర్తించి. కేసు 552/2025 కె యూ పోలీస్ స్టేషన్ లో నమోదు చేశారుఫేక్ డాక్టర్లు ప్రజల ఆరోగ్యానికి అత్యంత హానికరం మరియు వారు చేసే తప్పు వైద్యం వల్ల మరణాలకు దారితీయవచ్చు.ఏవైనా నకిలీ వైద్యుల గురించి సమాచారం ఉన్నట్లయితే, వెంటనే తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కి వాట్సాప్ నంబర్ 9154382727 తెలియజేయగలరు అని పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డా వి.నరేష్ కుమార్ తెలియ చేశారు.నకిలీ వైద్యుల నుండి ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం తనిఖీలు ఇంకాజరుగుతాయని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వెల్లడించింది.

## ముల్కనూరులో వీధికుక్కల స్వైర విహారం



**భీమదేవరపల్లి, అక్టోబర్ 10(జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో వీధికుక్కలు భయాందోళన రేపుతున్నాయి. గురువారం రాత్రి గ్రామంలోని ప్రధాన రహదారిపై ఒకేసారి ఇరవైకి పైగా కుక్కలు ప్రత్యక్షమై ప్రయాణికులపై దాడి చేయడానికి యత్నించాయి.బైక్‌పై వెళ్తున్న కొంతమంది యువకులు తృటిలో తప్పించుకున్నట్లు సమాచారం. గ్రామస్తులు తెలిపారు. గత కొద్ది రోజులుగా గ్రామంలో వీధికుక్కల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాత్రివేళ బయటకు రావడానికి భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికే భయపడుతున్నారని చెప్పారు. గ్రామ ప్రజలు కోరుతూ పంచాయతీ అధికారులు కుక్కల పట్టేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను గ్రామ ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే వెటర్నరీ శాఖ సహకారం తీసుకుని కుక్కల బాధ నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పోగొట్టుకున్న బంగారు నక్లెస్ అప్పగింత



**జనగామ ప్రతినిధి, అక్టోబర్ 10(జనంసాక్షి):** మూడు తులాల బంగారు నెక్లేస్ ను పోగొట్టుకున్న మహిళ ఫిర్యాదుతో క్షణాల్లో స్పందించిన జనగామ పోలీసులు బాధితురాలికి తిరిగి అట్టి నెక్లేస్ ను అప్పగించారు. జనగామ ఇన్స్పెక్టర్ పి.సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం 10.10.2025 మధ్యాహ్నం 12 గంటల సమయంలో పుట్ట శ్రావణ్ కుమార్ మరియు అతని భార్య పుట్ట అశ్విని ఇద్దరు భార్యాభర్తలు మర్రిగడి గ్రామం నుండి పల్సర్ బండి పై జనగామ ఓల్డ్ బీట్ బజార్ నందు జ్యువెలర్స్ షాప్ వద్దకు వచ్చి వారి మూడు తులాల బంగారం నెక్లెస్ వంకు తెగిపోయిన దానిని అతికించుకొని అట్టి నెక్లెస్ ను పుట్ట అశ్విని తన హ్యాండ్ బ్యాగ్ లో పెట్టీ అట్టి బ్యాగ్ ను పల్సర్ బండి పై పెట్టుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్య లో చూసుకొనగా బ్యాగ్ కనపడక పోయే సరికి వెంటనే జనగామ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా జనగామ పోలీస్ వారు స్పందించి జనగామ సి ఐ ఆదేశాల మేరకు ఎస్సై భరత్ మరియు క్రైమ్ సిబ్బంది బి.కరుణాకర్ వెంటనే సీసీ కెమెర ఆధారంగా విచారణ చేసి బ్యాగును వెతికి పట్టి అందులో ఉన్నటువంటి మూడు తులాల బంగారు నెక్లేస్ ను బాధితులకు అందజేసినారు.

# దివ్యాంగులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలి

- దివ్యాంగులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుంది
- భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** దివ్యాంగులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని, దివ్యాంగులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ రమేష్ బాబు అన్నారు. భూపాలపల్లి జిల్లా హెచ్ఎంఆర్ డివిస్ దివ్యాంగ బాలల పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం కార్యక్రమానికి భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. శరీర విభాగాలు అన్ని సరిగా ఉంటేనే సరిపోదని, మానసిక ఆరోగ్యం బాగున్నప్పుడే ఆరోగ్యం, జీవితం బాగుంటుందని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవాళ్లు సమాజంలో సక్రమంగా నడుచుకోవడం లేదని, వారి కంటే ఈ దివ్యాంగులే గొప్పవారని తెలిపారు. దివ్యాంగుల్లో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభను మనం గుర్తించి ప్రోత్సహించినట్లయితే వారు కూడా సమాజంలో ఉన్నతంగా జీవించేటువంటి అవకాశం ఉంటుందని తెలియజేశారు. కాబట్టి అలాంటి వారికి ప్రతి ఒక్కరు ప్రోత్సాహం అందించాలని కోరారు. దివ్యాంగులకు ప్రభుత్వాలు అనేక పథకాలు అందించి, వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సంస్థ నిర్వాహకులకు ఏదైనా పిల్లలకు సంబంధించిన అవసరాలు ఉంటే మా న్యాయ సేవాధికార సంస్థని సంప్రదించినట్లయితే మా వంతుగా కూడా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలియజేశారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు పండ్లు, చాక్లెట్లు పంపిణి చేశారు. హియరింగ్ ఎయిడ్స్, హెల్త్ క్యాంపు, ఇతర ఏ సహాయం కావాలన్నా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. శ్రీనివాసచారి, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల బిక్షపతిలు ప్రధాన న్యాయమూర్తి చేతులమీదుగా హోమ్ నిర్వాహకులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.అక్షయ, హెచ్ఎంఆర్డిఎస్ సంస్థ నిర్వాహకులు రజిత, రాజయ్య, న్యాయవాది మొయినుద్దీన్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, దివ్యంగా విద్యార్థులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# 13న ఉచిత హోమియోపతి వైద్య శిబిరం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 10 (జనంసాక్షి) :** జాతీయ ఆయుష్ పథకంలో భాగంగా ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ఆయుష్ శాఖ, వైద్య శిబిరం ఇంచార్జ్ డా. సిహెచ్. స్పందన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జాతీయ ఆయుష్ పథకం క్రింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత హోమియోపతి వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
11 అక్టోబర్ 2025

## మాజీ మంత్రి దామోదర్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ముస్లింల ప్రార్ధనలు



**తుంగతుర్తి, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ఇటీవల అనారోగ్యంతో మరణించిన మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని శుక్రవారం మండల కేంద్రంలో మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు అనంతరం దువా చేశారు ఈ సందర్భంగా మసీదుఏ నూర్ మౌలానా అబ్దుల్ ఆహాద్ మాట్లాడుతూ రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి అసలైన సిక్కులర్ నాయకుడని ముస్లింల అభ్యున్నతి కోసం కృషి చేశాడని అన్నారు అనంతరం ఆయన నివాసానికి వెళ్లి పూలమాలలతో చిత్రపటానికి నివాళులర్పించారు ఆయన కుమారుడు సర్వోత్తమ్ రెడ్డికి భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని భగవంతుని వేడుకున్నారు. తుంగతుర్తి లోని ముస్లింల స్మశాన వాటిక కోసం తన సొంత స్థలాన్ని కేటాయించారని అదేవిధంగా ఈద్గా నిర్మాణం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఎండి జాన్, ఉస్మాన్, అన్వర్, రహీం, యాకూబ్, మన్సూర్ అలీ, ఎండి జానీ తో పాటు పలువురు ముస్లిం నాయకులు సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి లక్ష్మీ నరసమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలకు నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ హెలిప్యాడ్ వద్ద మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రితో పాటు నిజామాబాద్ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్ రెడ్డి, టీఎండీసీ చైర్మెన్ ఈరవత్రి అనిల్ కుమార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హోమ్దాన్, వ్యవసాయ రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డిలతో కలిసి లక్ష్మీ నరసమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## ఆసుపత్రి ఎదుట ఉద్యోగుల మౌన ప్రదర్శన



**దేవరకొండ, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం తమకు ఆలస్యంగా జీతాలు చెల్లించడం పై నిరసన వ్యక్తం చేస్తూ దేవరకొండ ఏరియా ఆసుపత్రిలోని వైద్య ఉద్యోగులు శుక్రవారం మౌన ప్రదర్శన నిర్వహించారు.పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ప్రధాన ద్వారం ముందు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ ప్లకార్డులు పట్టుకుని వారు నిశ్శబ్దంగా నిరసన తెలియజేశారు. జీతాలు చెల్లింపులో ప్రభుత్వ వైఖరి తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసిన వైద్య ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు మండిపడ్డారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, వారికి ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పిడి రాజశ్రీ, సువర్ణ లత,భాగ్యరాణి, అర్చన, కోటేశ్వరరావు,ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒకటో తేదీన జీతాలు అందించాలని ప్లే కార్డులతో నిరసన



**రామన్నపేట, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** ఒకటో తేదీన జీతాలు అందించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో శు క్రవారం వైద్యులు వైద్య సిబ్బంది ఆసుపత్రి ముందు ప్లే కార్డులతో నిరసన తెలుపుతూ మౌన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు రావిటి సతీష్ కుమార్ మాట్లాడుతూ... నెల నెల సకాలంలో జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. పదవ తేదీ దాటిన నేటి వరకు జీతాలు అందలేదని వాపోయారు. వెంటనే డి ఎస్ హెచ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దేవేందర్, నవీన్ సింగ్, రజిని, నర్సింగ్ సూపర్డెంట్ రాణి, వైద్య సిబ్బంది జే ఏ శ్రీనివాస్, , రేడియోగ్రాఫర్ శ్రీనివాస్, ఉదయ్ రాజ్, వాసంతి, నర్సింగ్ ఆఫీసర్స్ సుశీల వసంత, మారమ్మ, సునీత, భూపాల ,శ్యామల, రాధ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత సాధించడంలో కాంగ్రెస్ వైఫల్యం



**ఖమ్మం, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యమైందని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో.9పై హైకోర్టు స్టే ఇవ్వడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయమై నామ స్పందిస్తూ బీసీల హక్కులు, అవకాశాలను రక్షించాల్సిన బాధ్యత ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆయన విమర్శించారు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకొనిపోయి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. కానీ నేడు రాష్ట్రం లో బీజేపీ, కాంగ్రెస్ నుండి పదహారు మంది ఎంపీలు వుండి కూడా బీసీ రేజర్వేషన్ల విషయమై ఏనాడు కూడా పార్లమెంట్ ను స్థంబింపజేయలేదని, కనీసం వారి హక్కుల కోసం పోరాటం చేయలేదన్నారు. రెండు పార్టీలు కూడా బీసీ లను మోసం చేశాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీల ద్వంద వైఖరి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా పార్లమెంటులో చట్టం ద్వారా బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కేసీఆర్ సూచనలు మేరకు బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిన తీరు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సక్రమంగా సిద్ధం చేయకపోవడం, చట్టపరమైన ప్రక్రియలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు బీసీ వర్గాల అభ్యున్నతి పేరుతో గొప్ప హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను మరిచిపోయిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చట్టబద్ధమైన మార్గంలో ముందుకు సాగకపోవడం వల్ల బీసీ వర్గాల ఆత్మగౌరవం దెబ్బతింటోందని మాజీ ఎంపీ నామ ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు తర్వాత అయినా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల హక్కులు, ప్రయోజనాలను కాపాడే దిశగా సక్రమమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ పాలనలో బీసీలకు గౌరవం, హక్కులు రెండూ సమానంగా లభించాయి. కానీ కాంగ్రెస్ పాలనలో మళ్లీ నిర్లక్ష్యం తాలూకు చీకట్లు కమ్ముకుంటున్నాయన్నారు. బీసీల హక్కులు, గౌరవం రక్షించడంలో బిఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందన్నారు.

## పేరూరు వంతెన తాత్కాలిక పునరుద్ధరణకు అంచనాలు రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**హాలియా, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తెగిపోయిన హాలియా మండలం పేరూరు వంతెన తాత్కాలిక పునరుద్ధరణకు అంచనాలు రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డితో కలిసి పేరూరు గ్రామ శివారులో తెగిపోయిన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు, గ్రామస్తులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వంతెన తెగిపోవడం వల్ల ప్రజల రవాణాకు, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే తాత్కాలిక చర్యలు చేపట్టాలని, ఇందులో భాగంగా పేరూరు వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించాలని, అలాగే శాశ్వత ప్రాతిపదికన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కాగా 40 సంవత్సరాల కు పూర్వం నిర్మించిన ఈ వెస్టడ్ కాజ్ వే పై అటువైపు నుండి మదారి గూడెం, ఇటువైపు పేరూరు గ్రామాలను కలుపుతుంది .అయితే చుట్టుపక్కల ఉన్న ఏడేనిమిది గ్రామాల ప్రజలు కూడా ఈ వంతెన తెగిపోవడం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి రాగా ఆమె స్థానిక శాసనసభ్యులతో కలిసి వంతెనను పరిశీలించి తక్షణ చర్యలకు ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం హాలియా తహసిల్దార్ కార్యాలయంలో ఇదే విషయంపై మరోసారి శాసన సభ్యులతో కలెక్టర్ చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలిక వంతెనకు తక్షణ చర్యలు చేపట్టాలని శాసన సభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేందర్, డిఈ సతీష్, ఏఈ సాయి రెడ్డి,మున్సిపల్ కమిషనర్ రామ్ దుర్గా రెడ్డి,తహసిల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు ఢీ



**బూర్గంపహాడ్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక పెట్రోల్ బంక్ దగ్గరలో రహదారి మలుపు వద్ద శుక్రవారం భద్రాచలానికి చెందిన రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. భద్రాచలం నుంచి, ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సును, ఖమ్మం నుంచి భద్రాచలం వస్తున్న మరొక ఆర్టీసీ బస్సు ఢీ కొనడం వలన ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారుగా 31 మందికి గాయాలు కాగా, వెంటనే వైద్యం కొరకు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ముదికొండ రామకృష్ణ ఆధ్వర్యంలో గాయాలు పాలైన వారందరికీ వెనువెంటనే వైద్యం అందించారు. ఈ ప్రమాదంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చిన వారికి ఎటువంటి ప్రమాదం లేదని అందరికీ సరైన సమయంలో సరైన వైద్యం అందించడం జరిగిందని, భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. రామకృష్ణ తెలిపారు.

# అమెరికాలో సత్తా చాటిన డాక్టర్ పసుమర్తి సందీప్



**కల్లూరు, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు కుమారుడు డాక్టర్ పసుమర్తి సందీప్"అమెరికాలోని వర్జినియా రాష్ట్రంలో డెంటల్ డాక్టర్ గా పని చేస్తున్నారు.అమెరికాలోఎడ్జ్ పత్రిక నిర్వహించిన 15వ వార్షిక అమెరికా టాప్ యంగ్ డెంటిస్ట్ – 2025 (టాప్40/అండర్40) లో స్థానం సంపాదించి అవార్డుకు ఎంపిక కావడం జరిగింది. ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణానికి చెందిన డాక్టర్ పసుమర్తి సందీప్ విజయవాడలోని ఎన్టీఆర్ యూనివర్సిటీ అండ్ హెల్త్ సైన్సెస్ నుండి బిడిఎస్ డిగ్రీ పొంది అమెరికాలోని నోవా సౌత్ ఈస్ట్రాన్ యూనివర్సిటీ నందు ఉన్నత చదువులు పూర్తి చేసుకుని వర్జీనియా రాష్ట్రంలోని డాన్ విల్లె లో దంత వైద్యులుగా పనిచేయుచున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యం అందించాలని డాన్ విల్లె ప్రాంతాన్ని ఎంచుకోవడం జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్లకు అంగవైకల్యం కలిగిన వారికి పునరావాస కేంద్రాలలో ఉన్న వారికి వైద్య సహాయం అందించినందుకు, దంత పరిశోధనకు క్రియాశీలక సహాయ సహకారాలు అందించినందుకు, అనేక పబ్లికేషన్స్ రచనలకు, అంతర్జాతీయ ఇంప్లాంటాలజిస్ట్ కళాశాల సభ్యుడిగా ఉన్నందుకుగాను ఈ అవార్డు ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పసుమర్తి సందీప్ చరవాణి ద్వారా మాట్లాడుతూ తనకు స్ఫూర్తి ప్రదాతలు మా తల్లిదండ్రులే నా మీద నమ్మకంతో విదేశీ విద్యకు పంపి నేను ఇంతటి విజయాలను సాధించుటకు తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహమే అందుకు కారణం. అన్నారు. తాను రిటైర్మెంట్ అయిన తర్వాత ప్రతి సంవత్సరం వేరువేరు దేశాలను సందర్శిస్తూ, అక్కడ ప్రజలకు వైద్య సేవలందిస్తానని అవార్డు గ్రహీతడాక్టర్ పసుమర్తి సందీప్ తెలియజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతకు కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు కల్లూరు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

## సైన్స్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



**కోదాడ, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** కోదాడ పట్టణంలోని పీఎం శ్రీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్టోబర్ 17,18 తేదీలలో హైదరాబాదు నందు జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన సదరన్ సైన్స్ డ్రామా జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువా, మెమెంటో తో సన్మానించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవజాతి ప్రయోజనం కోసం శాస్త్ర, సాంకేతిక రంగాల ఆవశ్యకత, యువతపై మాదకద్రవ్యాల ప్రభావం వంటి అంశాలపై చేసిన డ్రామా పోటీలలో జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, మండల విద్యాధికారి సలీం షరీఫ్, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, గైడ్ టీచర్లు అశోక్ గౌడ్, లామ్ దేవరాజ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మొహమ్మద్ గౌస్ పాషా జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి



**తుంగతుర్తి, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** మహాత్మా గాంధీ ఆశించిన స్వచ్ఛభారత్ కల సాకారం కావాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి మొహమ్మద్ గౌస్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్ట్ ఆవరణలో న్యాయవాదులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఒకరోజు కాకుండా ప్రతిరోజు పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు స్వచ్ఛత కోసం కృషి చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రత లేకపోవడం వల్ల దోమలు వ్యాప్తి చెంది టైఫాయిడ్ మలేరియా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. వీరి నివారణ కు పరిసరాల పరిశుభ్రత చక్కటి మార్గమని అన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నపర్తి జ్ఞాన సుందర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన స్వచ్ఛభారత్ కార్యక్రమంప్రతి ఒక్కరూ ఆచరణలో చూపించాలి అని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే మనం ఆరోగ్యంగాఉండవచ్చని అన్నారు బహిరంగ ప్రదేశంలో మలమూత్రాలు విసర్జించకుండా మరుగు దొడ్లు నిర్మించుకోవాలని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్రాలు విసర్జించవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జయకుమార్ స్వామి,హరిచరణ్, జాయింట్ సెక్రటరీ రవికుమార్, ట్రెజరర్ సతీష్ సెక్రటరీ వజీర్, న్యాయవాదులు వంగాల నాగరాజు, వరుసు రాజు, పులిచెర్ల శ్రీనివాస్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ లేక హెూమియోపతి వైద్యశాల వెల వెల



**చంద్రుగొండ, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** మొన్నటిదాకా హెూమియోపతి వైద్యశాల రోగులతో రుగ్మతలతో బాధపడుతున్న వారితో నిత్యం సుమారు 200 మంది పేషెంట్లు పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన ప్రభుత్వ వైద్యశాలేనా అని అనుమానం రాకపోదు. గతంలో ఇక్కడ పనిచేసిన గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఇటీవల ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆ రోజు నుంచి అసలు ప్రభుత్వ వైద్యశాలలో హెూమియోపతి వైద్యశాల ఉన్నదా అనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో మెదులుతుందంటే ఆశ్చర్యం కలుగుతుంది. నలుమూలల నుండి వివిధ జిల్లాల నుండి ప్రతిరోజు సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యం హెూమియోపతి కోసం వస్తూ ఉండటంతో ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం కోసం వచ్చే వారితో కిటకిటలాడుతూ ఉండేది. ప్రభుత్వం, జిల్లా వైద్యాధికారుల సైతం వెంటనే హెూమియోపతి వైద్యుని నియమించాలనే ఆలోచన లేకపోవడం తో ప్రతిరోజు వైద్యం కోసం వచ్చేవారు నేడు నిరాశతో అక్కడికి వచ్చి వెళ్ళిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి హెూమియోపతి వైద్యుని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## వంతెన నిర్మాణం కొరకు కృషి



**గట్టు, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** గద్వాల నియోజకవర్గం గట్టు మండలం చిన్నోనిపల్లి రిజర్వాయర్ పరిశీలనలో బోయిలగుడం, చిన్నోనిపల్లి గ్రామాలకు సంబంధించిన వాగు ను పరిశీలించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రైతులతో మాట్లాడుతూ ఈ పరిశీలనలో బోయలగూడెం, చిన్నోనిపల్లి అంతంపల్లి, లింగాపురం గ్రామాల నుండి ఐజకు వెళ్ళుటకు రోడ్డుకు మధ్యన ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం కొరకు గ్రామాలకు సంబంధించిన రైతులు ప్రజలు రాకపోకలు ఇబ్బందులకు గురి కావడంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు బ్రిడ్జి నిర్మాణం చేయడానికి త్వరలోనే సీఎం గారి దృష్టికి తీసుకువెళ్లి బ్రిడ్జి నిర్మాణం చేసే విధంగా కృషి చేయడం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, నాయకులు చంద్రశేఖర్ రామాంజనేయులు, రైతులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# దూసుకెళ్లిన ఎస్‌బీఐ

**• లాభాల్లో స్టాక్ మార్కెట్లు..**

**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్‌మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశా యి. ఫార్మా, బ్యాంకింగ్ షేర్లలో లాభాల కారణంగా ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు వరుసగా రెండవ ట్రేడింగ్ సెషన్‌లోనూ ఎగువన ముగిశాయి.ఐటీ స్టాక్స్ బలహీనత మధ్య 100 పాయింట్ల క్షీణతతో 82,075 వద్ద ప్రారంభమైన బీఎస్‌ఈ సెన్సెక్స్ వెంటనే పుంజుకుంది. ఇంట్రా-డే డీల్స్ లో 579 పాయింట్లు పెరిగి 82,654 వద్ద గరిష్ట స్థాయికి ర్యాలీ చేసింది. ఎట్టకేలకు 329 పాయింట్లు లేదా 0.4 శాతం లాభంతో 82,501 వద్ద ముగిసింది.ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 సూచీ 25,331 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 104 పాయింట్లు లేదా 0.4 శాతం పెరిగి 25,285 వద్ద స్థిరపడింది. ఈ



ప్రక్రియలో ఎన్‌ఎస్‌ఈ బెంచ్ మార్క్ ఇండెక్స్ జూన్ 27 నుండి అతిపెద్ద వారాంతపు లాభాన్ని (1.6 శాతం) నమోదు చేయగలిగింది. సెన్సెక్స్ స్టాక్స్ లో ఎస్బీఐ 2 శాతానికి పైగా లాభపడింది. మారుతి సుజుకి, యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్ 1 శాతం లాభపడ్డాయి. మరోవైపు టాటా స్టీల్ 1.5 శాతం పడిపోయింది.క్యూ2 ఫలితాలను నివేదించిన తర్వాత టీసీఎస్ కూడా ఒక రోజు 1 శాతం తగ్గింది. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ 0.4 శాతం, స్మాల్ క్యాప్ 0.6 శాతం పెరిగాయి.రంగాలవారీగా.. బీఎస్‌ఈ హెల్త్‌కేర్, బ్యాంకెక్స్ ఒక్కొక్కటి 1 శాతం వరకు పెరిగాయి. ఆటో, క్యాపిటల్ గూడ్స్ ఒక్కొక్కటి 0.5 శాతం లాభపడ్డాయి. 2030 నాటికి భారత్-బ్రిటన్ వాణిజ్యం రెట్టింపు అవుతుందనే వార్తల మధ్య ఇంట్రాడే డీల్స్ లో టెక్స్ టైల్ కంపెనీల షేర్లు 17 శాతం వరకు పెరిగాయి.

## అమెజాన్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు

**న్యూఢిల్లీ:**రాయల్ ఎన్‌ఫీల్డ్ ఆన్‌లైన్ ఉనికి విస్తరణలో భాగంగా అమెజాన్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీంతో రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు చెందిన క్లాసిక్ 350, బుల్లెట్ 350, హంటర్ 350, గోవాన్ క్లాసిక్ 350, కొత్త మీటియోర్ 350 బైక్‌లను అమెజాన్ ఇండియా ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేయొచ్చు. అహ్మదాబాద్, చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీ, పూణే నగరాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంది. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసినప్పట్టికీ.., డెలివరీ, విక్రయానంతర సేవలను కస్టమర్ ఎంపిక చేసుకున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ సర్వీస్ సెంటర్ ద్వారా అందిస్తామని కంపెనీ తెలిపింది.





## 'నన్ను నమ్మండి బ్రో'..


### అరట్టై ప్రైవసీపై యూజర్ సందేహంపై శ్రీధర్ వెంబు రిప్లై

**న్యూఢిల్లీ:**జోహో మెసేజింగ్ యాప్.. అరట్టై గత కొన్ని రోజులుగా అధిక ప్రజాదరణ పొందుతోంది. మెటా యాజమాన్యంలోని వాట్సాప్ యాప్ కంటే కూడా ఎక్కువ ఫీచర్స్ ఉండటం వల్ల, దేశీయ యాప్ కావడం వల్ల ఎక్కువమంది డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.దీనిని ఉపయోగించాలని కేంద్ర మంత్రులు కూడా పిలుపునిచ్చారు. అయితే ఇప్పుడు సమాచార గోప్యతకు సంబంధించిన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఒక నెటిజన్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.మెసేజస్ పంపుకోవడానికి, ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్స్ వంటివి షేర్ చేసుకోవడానికి.. వాయిస్ కాల్స్ వీడియో కాల్స్ చేసుకోవడానికి అరట్టై ఉపయోగపడు తుంది. "అరట్టై చాట్ యాప్‌ని ఉపయోగిస్తున్నప్పు డు భార్యాభర్తలు షేర్ చేసుకునే ఫోటోలు ఎంత వరకు గోప్యంగా ఉంటాయని" ఒక యూజర్ అడిగారు. దీనిని 'నన్ను నమ్మండి బ్రో' అంటూ జోహో ఫౌండర్ శ్రీధర్ వెంబు పేర్కొన్నారు. యూజర్ల గోప్యతను దృష్టిలో ఉంచుకునే యాప్ రూపొం దించామని, వినియోగదారుల భద్రతకు ఎలాంటి భంగం కలగదని శ్రీధర్ వెంబు పేర్కొన్నారు. దీనికోసం ప్రత్యేకంగా 'ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్' కూడా రాబోతోందని ఆయన అన్నారు. నమ్మకం చాలా విలువైనది.. మేము ప్రపంచ మార్కెట్‌లో ప్రతిరోజూ ఆ నమ్మకాన్ని సంపాదిస్తున్నాము. మా వినియోగదారుల నమ్మకాన్ని మేము నెరవేరుస్తూనే ఉంటామని వెంబు స్పష్టం చేశారు .ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. నెటిజన్లు కూడా స్పందిస్తున్నారు. వాట్సాప్ ప్రారంభమైన తరువాత ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ 2016 వరకు అందుబాటులో లేదు. అరట్టై కొత్తది కాబట్టి.. ఇందులో కూడా అలాంటి ఫీచర్ తప్పకుండా వస్తుందని ఒక యూజర్ పేర్కొన్నారు. ఎవరైనా ఒక మంచి చేస్తుంటే బెదిరించడానికి ప్రయత్నించవద్దని.. ఇంకొకరు అన్నారు. ఏదైనా లోపాలను గుర్తించి మెరుగుపరచడంలో సహాయపడటం మంచిది. ఉద్దేశాలు మంచిగా ఉండాలి, సామాజిక వ్యాఖ్యాతల ఆధారంగా పక్షపాతంతో ఉండకూడదని మరొకరు పేర్కొన్నారు.

## కొత్త రేటుకు వెండి

**• రాబర్ట్ కియోసాకి**

**న్యూఢిల్లీ:**బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు అమాం తం పెరుగుతున్నాయి. ఈ తరుణంలో రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి' చేసిన ట్వీట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది.వెండి 50 డాలర్లు దాటేసింది, తరువాత 75 డాలర్లకు.. సిల్వర్, ఎథిరియం హాట్, హాట్ (ధరలు భారీగా ఉన్నాయని) అంటూ కియోసాకి ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. వెండి రేటు గ్లోబల్ మార్కెట్లో.. మొదటిసారి ఔన్స్‌కు 50 డాలర్ల స్థాయికి చేరి, 2012 నాటి గరిష్టాన్ని చెరిపేసింది. ఇన్నాళ్ల తర్వాత తిరిగి వెండికి బలమైన డిమాండ్ కనిపిస్తోంది. పరిశ్రమల నుంచి పెరుగుతున్న డిమాండ్ మాత్రమే కాకుండా.. అమెరికా టారిఫ్స్ కూడా వెండి ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయని నిపుణుల అభిప్రాయం.భారతదేశంలో 2025 అక్టోబర్ ప్రారంభంలో రూ. 1,61,000 వద్ద ఉన్న సిల్వర్ రేటు.. ఈ రోజు (అక్టోబర్ 10) రూ. 1,80,000 వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే 10 రోజుల్లో వెండి ధరలు ఎంతగా పెరిగాయో.. స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 7 (గురువారం) వెండి రేటు ఏకంగా రూ. 7,000 పెరిగి.. ఒక్కసారిగా షాకిచ్చింది. ఈ రోజు (శుక్రవారం) కూడా సిల్వర్ రేటు రూ. 3000 పెరిగింది. దీంతో ఒక గ్రామ్ సిల్వర్ రేటు 180 రూపాయలకు చేరింది.



## ఒక్క ఉంగరం ధర రూ.9 కోట్లు

### ఈ దుబాయ్ యువరాణి ఎంత రిచ్ అంటే..

**న్యూఢిల్లీ:**ప్రపంచవ్యాప్తంగా రాజ కుటుంబాలు ముఖ్యంగా వారి విలాసవంతమైన జీవనశైలి, వ్యక్తిగత జీవితాల గురించి తెలుసుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపిస్తారు. ఈ క్రమంలోనే దుబాయ్ యువరాణి షేఖా మహ్రాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.ఆమె తరచూ తన జీవనశైలి, వ్యాపార యత్నాలు, సొంత ప్రయాణాల గురించి అభిమానులతో పంచుకుంటారు.

[illegible]

పలు నివేదికల ప్రకారం.. షేఖా మహ్రా నెట్‌వర్త్ 300 మిలియన్ డాలర్ల నుండి 1.5 బిలియన్ల డాలర్ల (రూ.2,600 కోట్ల నుంచి రూ.13,000 కోట్లు) మధ్య ఉంటుందని అంచనా. ఆమె సంపాదనకు ఆమె కుటుంబ వారసత్వం, వ్యాపారంలో విజయాలు, 2024లో ప్రారంభించిన లగ్జరీ పెర్ఫ్యూమ్ బ్రాండ్ "మహ్రా ఎం1"తో సహా పలు కారణాలు దోహదం చేశాయి. తన వ్యక్తిగత అనుభవం ప్రేరణతో "డివోర్స్" పేరుతో ఆమె తన బ్రాండ్ మొదటి ఫ్రాగ్రన్స్‌ను విడుదల చేయగా విజయవంతమైంది.

విలాసవంతమైన జీవనశైలి




షేఖా మహ్రా విలాసవంతమైన జీవనశైలితో ప్రసిద్ధి చెందారు. రోల్స్ రాయిస్, లంబోర్ఘిని, ఫెరారీ వంటి లగ్జరీ కార్లెన్నో ఆమె వద్ద ఉన్నాయి. ఆమె సంపాదన నెలకు సుమారు 5 మిలియన్ డాలర్లు (రూ.41 కోట్లు). ఆమెకు గుర్రాలంటే అమితమైన ఇష్టం. ఫ్యాషన్ సెన్స్ కూడా మహ్రా ప్రసిద్ధి చెందారు.

రూ.9 కోట్ల ఉంగరం

2024లో షేఖా మహ్రా తన భర్త షేక్ మానా బిన్ మోహమ్మద్ కు ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా విడాకులు ప్రకటించింది. తర్వాత 2025లో ఆమె రాపర్ ఫ్రెంచ్ మోంటానాతో నిశ్చితార్థం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమె 11 క్యారెట్ల డైమండ్ ఎంగేజ్‌మెంట్ రింగ్ ధరించారు. దీని విలువ 1.1 మిలియన్ డాలర్లు (రూ.9 కోట్లు) అని అంచనా.

## స్మార్ట్‌ఫోన్ కంపెనీలో జెరోధా కామత్ ఇన్వెస్ట్‌మెంట్

**న్యూఢిల్లీ:**స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ నథింగ్‌లో వెల్త్‌టెక్ యూనికార్న్ సంస్థ జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ 2.1 కోట్ల డాలర్లు(రూ. 186 కోట్లు) ఇన్వెస్ట్ చేశారు. కంపెనీ ఇటీవల చేపట్టిన 20 కోట్ల డాలర్ల నిధుల సమీకరణ లో భాగంగా పెట్టుబడులను సమకూర్చినట్లు కామత్ వెల్లడించారు. 1.3 బిలియన్ డాలర్ల(రూ. 11,530 కోట్లు) విలువలో నథింగ్ సిరీస్ సీ రౌండ్‌కు పెట్టు బడులు అందించినట్లు పేర్కొన్నారు. తదుపరి దశ ఏఐ టెక్నాలజీ కంపెనీగా అభివృద్ధి చెందేందుకు ప్రధానంగా నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు సెప్టెం బర్‌లో నథింగ్ ప్రకటించింది. నథింగ్‌కు తెరతీయ క ముందు కార్ల్ పే.. స్మార్ట్‌ఫోన్ల దిగ్గజం వన్‌ప్లస్ సహవ్యవస్థాపకుడిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.




# పేరుకు పేరు.. డబ్బుకు డబ్బు..

**నోబెల్ బహుమతి అంటే పేరు మాత్రమే కాదు • కోట్ల రూపాయల ప్రైజ్ మనీ కూడా!**



**ఓస్లో:** ఈ ఏడాది ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి మరియా కొరనీ మచాడోను వరించింది. వెనెజువెలాకు చెందిన మరియా కోరీనా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకు గానూ నార్వే నోబెల్ కమిటీ ఆమెకు ఈ బహుమతి అందిస్తున్నట్లు తెలిపింది.ఈ క్రమంలో ప్రపంచంలోనే అత్యంత అరుదైన నోబెల్ శాంతి పురస్కారం పొందిన గ్రహీతలకు అందే ప్రోత్సహకాలపై చర్చ మొదలు కాగా.. వాటి వివరాలు నోబెల్ పీస్ ప్రైజ్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. వాటి ఆధారంగా ఎవరైతే నోబెల్ శాంతి బహుమతి పొందారో వారికి ప్రైజ్ మనీ కింద 11 మిలియన్ స్వీడిష్ క్రోనార్ అందుతుంది. అంటే ఇండియన్ కరెన్సీలో అక్షరాల రూ.102 కోట్లు పైచీలుకు మొత్తాన్ని దక్కించుకోవచ్చు.స్వీడిష్ రసాయన శాస్త్రవేత్త ఆవిష్కర్త ఆల్ఫ్రెడ్ నోబెల్ కోరిక మేరకు 1901 నుంచి అవార్డుల ఇవ్వడం ప్రారంభమైంది. మానవాళికి ప్రయోజనం చేకూర్చుతూ పాటుపడిన శాంతి, సాహిత్యం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్యం, ఆర్థిక శాస్త్రాలు ఆరురంగాల వారికి అందిస్తూ నిర్ణయం తీసుకున్నారు.తన మరణానికి ఒక సంవత్సరం ముందు, 1895 నవంబర్ 27న తన వీలునామాపై సంతకం చేసిన ఆల్ఫ్రెడ్ నోబెల్, తన సంపదలో ఎక్కువ భాగాన్ని, ఎస్ఈకే 31 మిలియన్లకు పైగా సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టారు. ఆ పెట్టుబడి నుంచి వచ్చిన ఆదాయాన్ని ఏటా మానవాళికి గణనీయంగా ప్రయోజనం చేకూర్చిన వారికి బహుమతులుగా పంపిణీ చేసేలా వీలునామాలో పేర్కొన్నారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామా ఆధారంగా పైన పేర్కొన్న ఆరు రంగాల్లో విశేష కృషి చేసినందుకు నోబెల్ బహుమతి అందివ్వడం ఆనవాయితీగా వస్తుంది. నోబెల్ బహుమతి పొందిన వారికి భారీ మొత్తంలోప్రైజ్ మనీ దక్కనుంది.

**పతకం రూపకల్పన**

నోబెల్ శాంతి బహుమతి పతకాన్ని నార్వేజియన్ శిల్పి గుస్తావ్ విజిలాండ్, స్వీడిష్ శిల్పి ఎరిక్ లిండ్‌బర్గ్ సహకారంతో రూపొందించారు. ఈ పతకం మొదట 1902లో అవార్డు వేడుకలో ఉపయోగించారు.

ఆరంభంలో..23-క్యారెట్ బంగారంతో తయారు చేశారు. బరువు 192 గ్రాములు 1980 తర్వాత.. 18 క్యారెట్ బంగారంగా మార్చారు. బరువు కొద్దిగా పెరిగి 196 గ్రాములు అయ్యింది.

*వ్యాసం: 6.6 సెంటీమీటర్లు ఇది స్థిరంగా ఉంది.*
*పతకం రూపం,చిహ్నాలు:*
*నోబెల్ ప్రైజ్ ముందు భాగం,ఆల్ఫ్రెడ్ నోబెల్ పోర్ట్రెయిట్, ఆయన పేరు, జనన తేదీ, మరణ సంవత్సరం*
*వెనుక భాగం:*
*ముగ్గురు నగ్న పురుషులు కౌగిలించుకున్న దృశ్యం.. ఇది అంతర్జాతీయ సోదరభావానికి చిహ్నం*
*లాటిన్ శాసనం: 'ప్రజల మధ్య శాంతి, సోదరభావం కోసం'*
*అంచు:5 మిల్లీమీటర్ల మందపాటి అంచు చుట్టూ ,సంవత్సరం, అవార్డు గ్రహీత పేరు చెక్కబడి ఉంటుంది*
*ఈ పతకం రూపకల్పన, దాని చిహ్నాలు, దాని వెనుక ఉన్న భావన నోబెల్ శాంతి బహుమతికి ఉన్న ఆధ్యాత్మికత, గౌరవం, ప్రపంచ శాంతికి అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయి.*



శబరిమలై వివాదం..

## సురేష్ గోపి సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:**మాలీవుడ్ అగ్రతారలను జాతీయ దర్యాప్తు సంస్థలు లక్ష్యంగా చేసుకున్న వేళ.. సీనియర్ నటుడు, కేంద్ర మంత్రి సురేష్ గోపి సంచలన వ్యాఖ్యలు చేశారు. శబరిమలై అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే సినీ తారలను తెర మీదకు తెచ్చారంటూ వ్యాఖ్యానించారాయన.ఆలయం నుంచి బంగారం మాయం కావడం కేరళను కుదిపేస్తుండగా అక్కడి హైకోర్టు ఇప్పటికే సిట్ దర్యాప్తునకు ఆదేశించిన సంగతి తెలిసిందే.శుక్రవారం పాలక్కాడ్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ గోపికి తారలపై జరుగుతున్న దర్యాప్తు సంస్థల సోదాల గురించి ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన స్పందిస్తూ.. శబరిమలై బంగారు చోరీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే ఆ ఇద్దరు తారలను ముందుకు తెచ్చారని ఆరోపించారు. అయితే ఇలాంటి ఘటనలు అసాధారణం కావని, ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పడేసే సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు.. ఇలా ప్రముఖుల ప్రతిష్టను మసకబార్చే ప్రయత్నం జరుగుతుందని చెప్పారయన. భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని చూడాల్సి వస్తుందంటూ ఆసక్తికర వ్యాఖ్యలే చేశారాయన. అయితే.. ఈ వ్యవహారంలో జాతీయ దర్యాప్తు సంస్థల విచారణ కొనసాగుతున్నందున.. కేంద్రమంత్రిగా ఇంతకు మించి తానేం మాట్లాడబోనని ముగించారు. ఈ క్రమంలో ఎక్కడా ఆ కేసు ఏంటి? ఆ తారలు ఎవరు? అనే విషయాన్ని మాత్రం సురేష్ గోపి ప్రస్తావించలేదు. ఇదిలా ఉంటే.. భూటాన్-నేపాల్ మార్గం ద్వారా అక్రమంగా లగ్జరీ కార్లను దిగుమతి చేసుకున్నారనే అభియోగాలపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు ఆపరేషన్ నమ్‌ఖోర్ చేపట్టాయి. అగ్రనటులు పృథ్వీరాజ్ సుకుమారన్‌తో పాటు దుల్కర్ సల్మాన్, మరికొందరు తారల ఇళ్లలో తనిఖీలు చేశాయి. ఈ క్రమంలో దుల్కర్‌కు చెందిన రెండు కార్లను ఈడీ సీజ్ చేసింది. కోయంబత్తూర్‌కు చెందిన ఓ నెట్‌వర్క్ ద్వారా హవాలా మార్గంలో లావాదేవీలు జరిపి.. అక్రమ రిజిస్ట్రేషన్‌లతో లగ్జరీ కార్లు తెప్పించుకున్నారన్న ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలో దుల్కర్ తండ్రి.. అగ్రనటుడు మమ్ముట్టి ఇళ్లు, ఆఫీసుల్లో కూడా తాజాగా సోదాలు జరిగాయి.ఇక.. శబరిమలై అయ్యప్ప దేవాలయంలో బంగారం మాయం కావడం కలకలం రేపింది.

## గాజా శాంతి ప్రణాళికకు సై

ప్రణాళిక విజయవంతం కావడానికి కృషి చేసినందుకు గాను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పై ఇజ్రాయెల్ ప్రశంసలు కురిపించింది. తమ పార్లమెంట్ కు వచ్చి ప్రసంగించాల్సిందిగా ఇజ్రాయెల్ పార్లమెంట్ స్పీకర్ అమిర్ ఒహన అమెరికా అధ్యక్షుడిని ఆహ్వానిస్తూ లేఖ రాశారు. అందులో ట్రంప్‌ను యూదులకు గొప్ప మిత్రుడిగా అభివర్ణించారు. ట్రంప్‌ను ఆహ్వానిస్తూ.. వైట్‌హౌస్‌కు రాసిన లేఖను అమిర్ ఒహన సోషల్ మీడియాలో పంచుకున్నారు. హమాస్ చెరలో బందీలుగా ఉన్న తమ పౌరులు విడుదలయ్యే విషయంలో ట్రంప్ చూపిన చొరవను అమిర్ ఒహన ప్రశంసించారు. తమ సైనికుల త్యాగం, ప్రధాని నెతన్యాహు సంకల్పం, ఆయనకు ట్రంప్ ఇచ్చిన మనోధైర్యం వల్లే ఈ విజయం సాధించామన్నారు. ట్రంప్ నాయకత్వంలో అమెరికా మిలిటరీ నైతిక విలువల్లోనూ సూపర్ పవర్‌గా నిలిచిందని కొనియాడారు. బలంతో శాంతిని సాధించొచ్చని అమెరికా అధ్యక్షుడు నిరూపించారన్నారు. 2008లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ఇజ్రాయెల్‌లో పర్యటించిన అనంతరం.. అమెరికా అధ్యక్షుడి స్థానంలో ఉన్నవారు తమ దేశానికి వచ్చి, ప్రసంగించడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న బలమైన బంధాలకు ఈ ఆహ్వానం నిదర్శనమన్నారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య సుదీర్ఘ యుద్ధాన్ని నిలిపివేసేందుకు ఇజ్రాయెల్-హమాస్ తాజాగా అంగీకరించాయి. బందీలు, ఖైదీల విడుదలకు సమ్మతించాయి. ఇజ్రాయెల్, హమాస్ ఒప్పందంపై తొలుత ట్రంప్ ప్రకటన చేశారు. యుద్ధం ముగింపు తొలి దశ ప్రణాళికకు ఆ రెండు వర్గాలు అంగీకరించాయని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం- హమాస్ చెరలోని బందీలంతా అతి త్వరలో విడుదలవుతారు. గాజా నుంచి ఇజ్రాయెల్ క్రమంగా తన బలగాలను ఉపసంహరించుకుంటుంది.

# డెబ్యూతోనే పెద్ద రిస్క్

**• పీకే ఏమన్నారంటే..**

**ముంబై:**అదేదో సినిమాలో.. ఏమాత్రం రాజకీయానుభవం లేనివాళ్లను ఎన్నికల్లో నిలబెట్టి గెలిచి.. చివరకు తాను కాకుండా ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని సీఎం చేస్తాడు క్లైమాక్స్‌లో హీరో.బీహార్ ఎన్నికల వేళ సోషల్ మీడియాలో ఈ సీన్‌ను ప్రస్తావిస్తున్నారు పలువురు. ప్రశాంత్ కిషోర్ లాంటి ఎన్నికల వ్యూహకర్త(మాజీ).. తన పార్టీ జన్ సురాజ్ తరఫున అభ్యర్థుల ప్రకటనే ఇందుకు ప్రధాన కారణం.ప్రశాంత్ కిషోర్ బీహార్ ఎన్నికల బరిలో తొలిసారి తన జన సురాజ్ పార్టీని ఒంటరిగా పోటీకి నిలిపిన సంగతి తెలిసిందే. ఎన్నికల కోసం 51 మందితో కూడిన తొలి జాబితాను రిలీజ్ చేశారాయన. అందులో.. ప్రముఖ మ్యాథ్స్ ప్రొఫెసర్ కేసీ సిన్హా(పాట్నా వర్సిటీ మాజీ వీసీ), మాజీ అడ్వొకేట్ జనరల్ వైబీ గిరి, రితేష్ రంజన్ పాండే (బోజ్‌పురి గాయకుడు)తో పాటు డాక్టర్లు, లాయర్లు, రిటైర్డ్ బ్యూరోక్రాట్లు, పోలీస్ అధికారులు సైతం ఉన్నారు. ఇవన్నీ ఒక్క ఎత్తు అయితే.. గోపాల్‌గంజ్ భోరే నియోజక వర్గంలో జన్ సురాజ్ తరఫున పోటీ చేయబోతున్న ప్రీతి కిన్నర్ ఈ జాబితాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎందుకంటే.. ఆమె ఓ ట్రాన్స్‌జెండర్ కాబట్టి. ప్రీతి కిన్నర్.. స్వస్థలం కల్యాణ్‌పూర్. ట్రాన్స్‌జెండర్ల నాయకురాలిగా.. సామాజిక వేత్తగా స్థానికంగా ఆమెకు మంచి పేరుంది. ఇంతకీ ఆమె పోటీ చేయబోతోంది ఎవరి మీదనో తెలుసా?.. ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సునీల్ కుమార్ మీద. అందుకే ఆమె గురించి ప్రత్యేకంగా చర్చ నడుస్తోంది. అయితే.. స్థానిక సమస్యలపై ఆమెకు అవగాహన ఉండడం కలిసొచ్చే అంశమని జన్ సురాజ్ భావిస్తోంది.

**గెలిచిన దాఖలాల్లేవ్!:**రాజకీయాల్లో ట్రాన్స్‌జెండర్లు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. ఎన్నికల్లో గెలిచిన సందర్భాలు అత్యంత అరుదనే చెప్పాలి. 1998 మధ్యప్రదేశ్ ఎలక్షన్స్‌లో శబ్నం మౌసీ సోహగ్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా నెగ్గి.. దేశ రాజకీయాల్లో చరిత్ర సృష్టించారు. 2015లో మధు కిన్నర్ చత్తీస్‌గఢ్ రాయ్‌ఘడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నెగ్గి.. మేయర్ పదవి చేపట్టారు కూడా. అయితే.. ఆ తర్వాతే ఆ వర్గం నుంచి చెప్పుకోదగ్గ విజయాలేవీ నమోదు కాలేదు.



2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కల్కాజీ నుంచి రాజన్ సింగ్ పోటీ చేసి.. కేవలం 85 ఓట్లే దక్కించుకున్నారు. ఈ తరుణంలో ప్రీతి కిన్నర్.. అదీ జన్ సురాజ్ నుంచి బీహార్ ఎన్నికల బరిలో దిగడం ఆసక్తికర చర్చకు దారి తీసింది. ప్రీతి కిన్నర్(ఎడమ), ప్రొఫెసర్ కేసీ సిన్హా(మధ్యలో), సింగర్ రితేష్ రంజన్ పాండే(చివర.. కుడి)

రిస్క్‌పై పీకే ఏమన్నారంటే..

జన్ సురాజ్ తొలి జాబితాలో.. సామాజిక న్యాయం వరకు అయితే బాగానే జరిగింది. 17 మంది ఈబీసీలు, 11 మంది బీసీలు, 9 మంది మైనారిటీలు, ఏడుగురు షెడ్యూల్ కాస్ట్(ప్రీతి కూడా), ఎనిమిది మంది ఇతర వర్గాల వాళ్లు ఉన్నారు. "జన సురాజ్ అభ్యర్థులకు ఈ ఎన్నికల్లో ఓట్లు పడకపోతే.. అది నా తప్పేం కాదు. అది ముమ్మాటికీ బీహార్ ఓటర్లదే" అని ప్రశాంత్ కిషోర్ తేల్చేశారు. 'పార్టీకి సరైన గుర్తింపు లేదు, ప్రచార నిధులు పరిమితంగా ఉన్నాయి. పైగా అవతల జేడీయూ, ఆర్జేడీ, బీజేపీ లాంటి పార్టీలు ఉండగా.. ఎన్నికల్లో కొత్త ముఖాలతో వెళ్లడం రిస్క్ కాదా?' అనే మీడియా ప్రశ్నకు ఆయన పైబదులు ఇచ్చారు. అవినీతి నిర్మూలన, ప్రజా సమస్యల పరిష్కారం నినాదాలతో ప్రశాంత్ కిషోర్ జన్ సురాజ్ బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తున్నారు.

## ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం

### సునామీ హెచ్చరికలు జారీ

**మనీలా:** ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం సంభవించింది. మిండనోవా ద్వీపంలో రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.4తో భూమి కంపించినట్టు అధికారులు తెలిపారు.భూకంపం నేపథ్యంలో ఫిలిప్పీన్స్‌లో సునామీ హెచ్చరికలను జారీ చేశారు. పసిఫిక్ తీరంలో భారీగా అలలు ఎగసిపడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.భూకంపం కారణంగా భూమి కంపించడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. దీనికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
11 అక్టోబర్ 2025

# వైద్యశాఖలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఇష్టారాజ్యం

- అనుకూలమైతే ఓ లెక్క
- లేదంటే ఇబ్బందులు పక్కా

**నిజామాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 10 (జనంసాక్షి)** : జిల్లా వైద్య శాఖలో ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండానే బాన్సువాడ డివిజన్ వైద్యశాఖ అధికారిణి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీంతో ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పాలవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఆమెకు అనుకూలంగా ఉన్నవారికి ఒక రకంగా ఉంటూ, లేదంటే ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న విషయాలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. డివిజన్ లోని అస్పత్రులలో విధులు నిర్వహిస్తున్న తమకు అనుకూలంగా ఉన్నవారికి ఎక్కడపడితే అక్కడ విధులు ఏర్పాటు చేస్తూ, అనుకూలంగా లేని వారికి చుక్కలు చూపిస్తున్నారని సిబ్బంది లబో దిబోమని మొత్తుకుంటున్నారు. గతంలో సైతం ఈ అధికారిణిపై ఇలాంటి అనేక ఆరోపణలు ఉండగా తాజాగా బిచ్కుంద మండలం పుల్కల్ పిహెచ్సి పరిధిలో ఒక అధికారికి తమకు అనుకూలంగా ఉన్న చోట విధులు ఏర్పాటు చేయడం చర్చానియాంశంగా మారింది. ఒక ఉద్యోగికి డిప్యూటేషన్ ఏర్పాటు చేయాలంటే జిల్లా ఉన్నతాధికారి ప్రమేయం ఖచ్చితంగా ఉండాలి. కానీ ఆమె మాత్రం అలాంటిది ఏమీ లేకుండానే లోలోపల పనులను చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఎవరు సక్రమంగా పని చేస్తే వారికి విధులు కేటాయించి ప్రజలకు మంచి వైద్యం అందించాల్సింది పోయి తమ స్వప్రయోజనాల కోసం పుల్కల్ పిహెచ్సి తో పాటు డివిజన్ లోని పలు సబ్ సెంటర్లను సైతం సక్రమంగా నడపనివ్వకుండా బాన్సువాడ డివిజన్ పరిధిలోని అధికారులు అందరిపై అజమాయిషీ చెలాయిస్తూ తమకు అనుకూలంగా ఉండే వారికి కనీసం రెండు కిలోమీటర్లు కూడా లేని పక్క సెంటర్లలో డిప్యూటేషన్ విధులు నిర్వహించడంపై సర్వత్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ డిప్యూటేషన్ చేయరాదని ఉన్నతాధికారులు సైతం చెబుతుండగా బాన్సువాడ డివిజన్ అధికారిణి ఏవిధంగా అనుమతి ఇచ్చిందని, దానికి సంబంధించిన పత్రం సైతం బయటకు రావడం గమనార్హం. పుల్కల్ పిహెచ్సి పరిధితో పాటు సబ్ సెంటర్లలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు వివరించాల్సింది ఉండగా సదరు అధికారిణి తానే అన్నింటిలో ప్రమేయం అవుతూ ఇష్టానుసారంగా ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా ప్రజా ఆరోగ్యం పై ఎలాంటి దృష్టి సారించకుండా గందరగోళ పరిస్థితులకు నెలకొనేట్లు చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. పుల్కల్ పిహెచ్సిలో విధులు నిర్వహించాల్సిన వైద్యునీతో పాటు ఫార్మసిస్టు ఉండగా మరొక మేల్ ఏఎన్ఎం ను ఎందుకు డిప్యూటేషన్ పై పుల్కల్ పిఎస్సి కి అనుమతి ఇచ్చారనేది సర్వత్ర చర్చ జరుగుతోంది. కాగా సదరు మెయిల్ ఏఎన్ఎం స్థానికంగా ఓ ప్రవేట్ క్లినిక్ ను నడిపిస్తూ ఎక్కువ సమయం దానికే కేటాయిస్తూ ప్రభుత్వ నుండి జీతం తీసుకుంటూ ప్రైవేట్ క్లినిక్ పనులు చేస్తున్నాడని, దీంతోపాటు ఆసుపత్రికి వచ్చే పలు మందులు, సెలెన్ బాటిల్ లను సైతం తన ప్రైవేట్ క్లినిక్ లో ఉపయోగిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్ట్ పై విధు



లు నిర్వహిస్తున్న సదరు మెయిల్ ఏఎన్ఎంకు ఇటీవలే రెగ్యులర్ కాగా రెగ్యులర్ అయిన వెంటనే పక్కనే రెండు కిలోమీటర్ల దూరంలో డిప్యూటేషన్ వేయడం, అదీ ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం అందించకుండా సదరు డివిజన్ అధికారిణి తన చతురతను ప్రదర్శించి ఒక పత్రాన్ని సృష్టించి మరీ పుల్కల్ పిహెచ్సికి పంపడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి సంఘటనలు పునారవృతం కాకుండా ప్రజలకు మంచి వైద్యం అందించాలని స్థానికులు మండల ప్రజలు కోరుతున్నారు. పుల్కల్ పిఎస్సిని సందర్శించిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ పుల్కల్ పిహెచ్సిని శుక్రవారం డిప్యూటీ డిఎంహెచ్వో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్సిలో ఏఎన్ఎంలు, ఆరోగ్య ఆశ కార్యకర్తలుతో సమావేశం నిర్వహించారు.

# నాకు పదవుల కాదు ప్రజలే ముఖ్యం

- కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి, కమిట్మెంట్ లేకే చేతులు ఎత్తేసింది
- 25 ఏళ్లుగా హుజురాబాద్ లో నాతో పాటు ఉన్నవాళ్ళని గెలిపించుకునే బాధ్యత నా మీద ఉంది
- మల్కాజ్గిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్



**హుజురాబాద్, అక్టోబర్ 10 (జనంసాక్షి)** : నాకు పదవుల కంటే కూడా ప్రజలే ముఖ్యం..ప్రజల సమస్యల పరిష్కారం, ఆపదలో ఉన్నపుడు అండగా ఉండటం ముఖ్యమని భావించేవాణ్ణని, అడ్జస్ట్ అయ్యేది ఉంటే కేసీఆర్ వద్దే ఉండేవాడినని హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం హుజరాబాద్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...రెండేళ్లు అయినా ఎన్నికలు జరగలేదు, ఆరు నెలల్లో 42 శాతం రిజర్వే షన్లు తీసుకొచ్చి ఎన్నికలు జరుపుతామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగు తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్ప టికైనా వంచనకు పాల్పడకుండా, మోసం, దగా చేయకుండా 42 శాతంతో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశా రు. బిజెపిలోకి వచ్చిన తర్వాత మొదటి సారిగా స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోతు న్నాయి, 25 ఏళ్లుగా నాతో పాటుగా ఉన్న వాళ్ళని గెలిపించుకునే బాధ్యత నా మీద ఉందని ఈటల రాజేందర్ రాజేందర్ అన్నా రు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి, నిజాయితీ, కమిట్మెంట్ లేక ఇవాళ చేతులు ఎత్తేసింది. ప్రజాక్షేత్రంలో అభాసు పాలయ్యింది. కాంగ్రెస్ కొత్త పార్టీ కాదు, రేవంత్ కొత్త నాయకుడు కాదు, 50 ఏళ్ళు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన పార్టీ ఇంత పేలవంగా, అనాలోచితంగా, ఇంత మూర?ంగా వ్యవహరిస్తారని ఎవరు అనుకోలేదు. మోసం చేసే వారిని ప్రజలు ఇష్టపడతారు, మోసం చేస్తేనే నమ్ముతారు అనే ఫిలాసఫీ ఉన్నవాడు కాబట్టి మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేశారు, దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీదే అన్నారు.

## ఆర్మూర్ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి

- సీఎంకు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వినతి



**ఆర్మూర్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఆర్మూర్ నియోజకవర్గంలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వినతితో తెలిపారు. ప్రధానంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ, ఆర్ఓబి పనులకు త్వరితగతిన బిల్లులు మంజూరు చేయాలని కోరారు. భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ,ప్రధాన కార్యదర్శులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

# రాజన్న ఆలయం యధావిధిగా కొనసాగింపు

- నేటి నుంచి భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శనాలు
- అధికారులు,సిబ్బందికి విధులు కేటాయించిన ఈవో

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జనంసాక్షి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా భీమేశ్వరాలయంలో నేటి నుంచి భక్తులకు దర్శనాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం సంబంధిత అధికారులకు, సిబ్బందికి విభాగల వారీగా విధులను కేటాయిస్తూ ఆలయ ఈవో ఎల్ రమాదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఉదయం స్వామి వారి కళ్యాణం,సత్యనారాయణ స్వామి వ్రతములు, చండీయాగము మొదలగు కైంకర్యములు శ్రీ భీమేశ్వర స్వామి మరియు శ్రీ నగరేశ్వర స్వామి ఆలయం నందు పుణ్యాహ వచనం, మంగళ వాయిద్యాలు, వేద స్వస్తి,మరియు సంప్రోక్షణ కార్యక్రమం అనంతరం ప్రారంభిం చనునట్లు ఆలయ ఇన్చార్జి స్థానాచారి ఉమేష్ ఇచ్చిన నివేదిక మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విఐపి దర్శనాలు భోజన ఏర్పాట్లు ఇతర సదుపాయాల కోసం ఏఈఓ జి అశోక్, సూపరిండెంట్ వి శ్రీకాంత్ కు విధులు కేటాయించారు. పార్వతీపురం నందు నిర్వహించు పూజా కార్యక్రమాలు , పుణ్యా హవాచన కార్యక్రమం పర్యవేక్షణ కోసం సూపరిండెంట్ సంతోష్, కోడె మొక్కుబడి అవసరమైన కోడలను అలంకరించి భీమేశ్వరాల నందు ఏర్పాటు చేయుట కోసం విజయ్ కుమార్ సూపరిండెంట్ గొట్టం రవి జూనియర్ అసిస్టెంట్, భీమేశ్వరాలయంలో నిర్వహించు పూజా కార్యక్రమాలకు అవసరమైన నిర్వహణ ఎం నరేందర్ ఆర్.వి భీమేశ్వర్ సూపరిండెంట్, గౌతమ్ సీనియర్ అసిస్టెంట్, భక్తుల సౌకర్యార్థం ప్రసాదం కౌంటర్లు ఏర్పాట్లు పర్యవేక్షణ సంజీవరావు సూపర్డెంట్ వై శివకుమార్ జూనియర్ అసిస్టెంట్ కు విధులు కేటాయించారు. భీమేశ్వరాలయం నందు పూర్తి భద్రత ఏర్పాట్ల కోసం మహేందర్ ఎస్పిఎఫ్ ఏఎస్ఐ మహేందర్ భద్రత ఏర్పాట్లు పరివేక్షించనున్నారు. భీమేశ్వర ఆలయంలో కౌంటర్లో ఏర్పాట్లను దిలీప్ సీనియర్ అసిస్టెంట్, రాజు జూనియర్ అసిస్టెంట్




పర్యవేక్షించనున్నారు. శనివారం భీమేశ్వరాలయం నగరేశ్వరాలయం నందు స్వామివారికి కైంకర్యంలో ప్రారంభించుటకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆలయ ప్రధాన అర్చకులు , ఇ న్చార్జి స్థానాచారితో పాటు ప్రధాన ,పర్య వేక్షణను ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ విభాగం సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 19,20న శృంగేరి పీఠాధిపతి ఆలయాన్ని సందర్శించనున్నారు. అప్పటివరకు రాజన్న ఆలయం యధావిధిగా తెరిచి ఉంటుందని సమాచారం. శృంగేరి పీఠాధిపతి పర్యటన ముగిసిన అనంతరం శ్రీ రాజారాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు దర్శనాలు నిలిపివేయనున్ననట్లు సమాచారం.

# హైకోర్టులో బీసీ రిజర్వేషన్లపై స్టే పాపం బిజెపి బిఆర్ఎస్‌లదే

**జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర సర్కార్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 9 పై తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడం పట్ల స్పందిస్తూ శుక్రవారం రోజు జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి డిసిసి కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఢిల్లీ వేదికగా జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో అన్ని కుల సంఘాలను ఆహ్వానపరిచి ధర్నా చేపట్టినప్పటికీ ఈ రాష్ట్రం నుండి గెలిచిన ఎనిమిది మంది బిజెపి సభ్యులైన, కేంద్ర మంత్రి బండి సంజయ్, కిషన్ రెడ్డి అలాగే రాష్ట్రానికి చెందిన బిజెపి శాసనసభ్యులు 35 మందితో ప్రధాన ప్రతిపక్ష హోదాలో ఉన్న టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీలు , ఎమ్మెల్యేలు ఎవరు కూడా ఆ ధర్నాలో పాల్గొనలేదు. ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఎలాంటి మద్దతు తెలియజేయకుండా బీసీలపై తమ కక్ష ధోరణిని వ్యక్తం చేశారు.




వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ, నాడు వీపీ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడైనా, నేడు నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్నప్పటికైనా బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో అడ్డుపడింది, అడ్డుకున్నది బిజెపి పార్టీ మాత్రమే అన్నారు. రిజర్వేషన్ బిల్లు సాధించి ఎన్నికలకు వెళ్తాము అని, బిసిల పట్ల చిత్తశుద్ధి ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అన్నారు. ఈ పత్రిక విలేఖరుల సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పురం రాజేశం, నాయకులు రామిడి రాజిరెడ్డి, కామ్ రెడ్డి రాంరెడ్డి, రామిడి తిరుపతిరెడ్డి, కంకణాల అనిల్ కుమార్, సాయిని తిరుపతి, వంగల విద్యాసాగర్, కోల రమేష్, నూనె గోపాల్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేసిన రేవంత్ సర్కార్

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని, (జనంసాక్షి) :** బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్ సర్కార్ మోసం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. శుక్రవారం మంథని పట్టణంలోని పూలే చౌక్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే పాదాలకు పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియా తో ఆయన మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్‌లను 42 శాతం ఇస్తామని ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్‌పేరుతో గొప్పగా కామారెడ్డిలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ద రామయ్య తీసుకువచ్చి సభ నిర్వహించి అనేక విషయాలను ప్రకటించారన్నారు. ఒక్క బీసీ డిక్లరేషన్ 42 శాతమే కాదు అనేక విషయాలను పొందుపర్చారని అన్నారు. బీసీ డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్‌లు ఆరు నెలల్లోనే పెంచుతామని చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. రిజర్వేషన్‌ల విషయంలో అనేక ఆంక్షలు ఉండవచ్చుని, రాజ్యాంగ బద్దంగా ఆలస్యం కావచ్చున్నారు. కానీ ఆరు నెలలలో ఎందుకు ప్రయత్నం చేయలేదని ఆయన ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో ప్రభుత్వ సివిల్ కాంట్రాక్టుల్లో 42 శాతం రిజర్వేషన్‌లు, బీసీ చిరు వ్యాపారులకు వ్యాపారాలు చేసుకునేందుకు రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామని చెప్పి 22 నెలలైనా ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. కేవలం ఇటు ప్రజలను అటు బీసీలను మోసం చేయడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర చేశారన్నారు. అంతేకాకుండా జనగామ జిల్లాకు సర్వాయి సర్థార్ పాపన్న పేరు పెడుతామని చెప్పిండ్లని, కానీ పీసీసీ అధ్యక్షులుగా ఉన్న మహేష్‌కుమార్ గౌడ్ మాత్రం ఏకంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని గౌడ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు.



ఆనాడు సీఎం కేసీఆర్ హాయాంలో గౌడలకు మద్యం షాపుల్లో 15 శాతం రిజర్వేషన్‌లు ఇచ్చారని, ప్రస్తుతం 25 శాతం ఇస్తామని గొప్పలు చెప్పిండ్లే కానీ ఎక్కడా అమలు చేయలేదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఆనాడు ఆర్డినెన్స్ తీసినం సరిపోతదని చెప్పి మళ్లీ గవర్నర్ దగ్గర ఉందన్నారని, మళ్లీ అది సరిపోతలేదని అసెంబ్లీలో బిల్లుపెట్టి ఇది పక్కగా ఉందని ఒక్కో మంత్రి ఒక్కో విదంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. ఆరు నెలల్లో బీసీ డిక్లరేషన్ 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని 22 నెలలైనా అతీగతీ లేదని ఆయన విమర్శించారు. బీసీ డిక్లరేషన్‌పై ఎవరూ కోర్టుకు వెళ్లవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పితే రేవంత్‌రెడ్డితో ఉండే వ్యక్తి కోర్టుకు పోయాడని, ఈ విషయంపై మంత్రి పొన్నం ఎందుకు మాట్లాడటం లేదన్నారు. చట్టాలు, మానీఫెస్టోలు తయారు చేస్తూ గొప్పోళ్లుగా కీర్తించబడుతుంటే మంత్రులై ఉండి కోర్టుకు పోయి అబాసుపాలు అవుతారా అని అన్నారు. రిజర్వేషన్‌లో ఆలస్యం అయినా మిగిలిన అంశాలను అమలు చేయచ్చు కదా అనిప్రశ్నించారు. ప్రభుత్వ కాంట్రాక్ట్‌లో రిజర్వేషన్, బ్రాండి షాపులో 25 శాతంకు ఇబ్బంది ఏంటన్నారు. ఆనాడు పూలేను, అంబేద్కర్‌ను ఈ సమాజానికి అర్థం కాకుండా చేసింది కాంగ్రెస్ పార్టీనేనని, అప్పటి నుంచి ఇప్పటి వరకు బీసీలను మోసం చేస్తూనే ఉందన్నారు. రాబోయే రోజుల్లో బీసీలతో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కాకతప్పదని ఆయన హెచ్చరించారు.

# అటవీ భూమి అన్యాక్రాంతం

**వ్యక్తులపై కేసు నమోదు**

**నాగిరెడ్డిపేట్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** నాగిరెడ్డిపేట మండలం అడవి శాఖ రేంజ్ పరిధిలోని లింగంపేట్ మండలం కన్నాపూర్ గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో అటవీ భూమిని అన్యాక్రాంతము చేయడానికి ప్రయత్నించే వ్యక్తులపై అటవీ శాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని నాగిరెడ్డిపేట్ అటవీ రేంజ్ డిప్యూటీ ఎఫ్ఆర్వో రవికుమార్ తెలిపారు. లింగంపేట్ మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన వడ్ల ఏలేశం, గంగరబోయిన భూమయ్య,జింక వెంకటి, గరబోయిన కవిత, నిరుడి సంతోష్,గారబోయిన ధరత,నిరుడి సుజాతలు అటవీ అధికారుల విధులకు ఆటంకం కలిగించినందున అట్టి వ్యక్తులపై పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ చేయడం జరిగిందని డిప్యూటీ ఎఫ్ఆర్వో రవికుమార్ తెలిపారు. ఎవరైనా నాగిరెడ్డిపేట్ రేంజ్ పరిధిలో అటవీ భూమిని అన్యాక్రాంతము చేయడానికి ప్రయత్నిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని నాగిరెడ్డిపేట్ రేంజి డిప్యూటీ ఎఫ్ఆర్ఓ రవికుమార్ హెచ్చరించారు.

## భూ సేకరణ సమస్యలు త్వరితగతన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రెవిన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. భారత జాతీయ రహదారి సంస్థ, వరంగల్ ప్రాజెక్ట్ సంచాలకులు భరద్వాజ్, రెవిన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్ , రమేష్ బాబుతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమావేశం నిర్వహించారు.



భూసేకరణకు సంబంధించి పెండింగ్లో ఉన్న అంశాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా పిడి భరద్వాజ్ విషయాలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా భూసేకరణలో ఉన్న సమస్యలన్నింటిని త్వరితగతిన పరిష్కరించాలని, భారత జాతీయ రహదారి సంస్థకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

## సీహెచ్‌పీలో కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం

- గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రవీందర్



**యైటీంక్లయిన్ కాలని అక్టోబర్ 10 (జనంసాక్షి) :** సింగరేణి ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 సీహెచ్‌పీ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి జీగురు రవీందర్ అన్నారు. శుక్రవారం సీహెచ్‌పీ గుర్తింపు సంఘం నాయకులు పర్యటించి పలు సమస్యలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఫ్లోఫీడర్‌లో ఉన్న బురద, డస్ట్, పోగతో కార్మికులకు శ్వాస తీసుకునే అవకాశం లేదన్నారు. మోకాళ్ల లోతు బురదలో అధికారులు భయభ్రాంతులకు గురి చేసి పని చేయిస్తున్నారని , కనీసం ప్రమాదం జరిగితే తప్పించుకునే అవకాశం లేదన్నారు. పని ప్రదేశాలంలో చాలా ప్రమాదాలు జరిగియని తెలిపారు. కాగా ఫైర్ కోల్ వల్ల బంకర్స్ డ్యామేజ్ అయి కోల్ నేరుగా బెల్టు మీద పడి పక్కన వున్న కార్మికులకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ఫైర్ కోల్ సీహెచ్‌పీ రాకుండా వాటర్ పాండ్స్ తయారు చేసి దానిలో డంప్ చేసిన తరువాతనే సీహెచ్‌పీకి తీసుకరావాలన్నారు. సీహెచ్‌పీలో టెండాల్ యాక్టింగు చేస్తున్న కార్మికులకు వెంటనే ప్రమోషన్స్ కల్పించాలని యాజమాన్యా న్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట గంధం సాంబశివరావు, సెగ్గం శంకర్, ఆల్లి రమేష్,రాజశేఖర్, గాజుల శ్రీనివాస్, తిరుపతి, టీ. అంజయ్య, శంకర్, పిట్టల రమేష్‌లు ఉన్నారు.

# రాజన్న లడ్డు ప్రసాదంలో వాసన

- భక్తుల మనోభావాలు కాపాడాలని డిమాండ్
- భాజాపా నాయకుల ఆందోలన
- మరోసారి ఇలా జరగకుండా చూస్తామన్న ఆలయ అధికారులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జనంసాక్షి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదంపై భక్తులు మక్కువ చూపిస్తుం టారు. దిట్టం ప్రకారం తయారు చేసే రాజన్న లడ్డుల కోసం భక్తులు క్యూ లైన్ లలో గంటల తరబడి వేచి ఉండి ప్రసాదాలు కొనుగోలు చేస్తుంటారు. శుక్రవారం స్వామివారిని దర్శించు కున్న అనంతరం లడ్డు కౌంటర్లలో పలువురు భక్తులు ప్రసా దం కొనుగోలు చేయగా లడ్డు ప్రసాదం వాసన రావడంతో భక్తులు విస్మయానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న భాజపా పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో భాజపా నాయకులు ఆలయం వద్దకు చేరుకొని భక్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. లడ్డు కౌంటర్ ను పరిశీలించారు. లడ్డు కౌంటర్లో లడ్డులు దుర్వాసనతో ఫంగస్



తో కూడిన లడ్డులు ఉన్నాయని వారు ఆరోపించారు. సంఘటనపై ఆలయ ఈఓ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలు కాపాడే విధంగా చూడాలన్నారు. లేని పక్షంలో భాజపా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై ఆలయ ఏఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ట్రేలలోని లడ్డూలు ఆరకపోవడంతో వాసన వచ్చినట్లు తెలిపారు. వాసన వస్తున్న లడ్డులను కౌంటర్ నుండి తొలగించి తయారైనా లడ్డూలను భక్తులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మరోసారి ఇలాంటి సంఘటన చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# సమాచార హక్కు చట్టం 2005 అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జనంసాక్షి):** సమాచార హక్కు చట్టం 2005 ని అన్ని ప్రభుత్వ కార్యాలయంలో పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్టిఐ 2005 వారోత్సవాలలో భాగంగా అన్ని జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు మరియు డివిజన్ ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల ఆర్టిఐ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు సమాచార హక్కు చట్టం 2005 అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆర్టిఐ చట్టం వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలను ,చట్టం అమలు తీరు, ఆర్టిఐ చట్టంలో ఉన్న అంశాలను వివరించారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో పారదర్శకత, జవాబు దారీ తనంను పెంపొం దించేం దుకు ఆర్.టి.ఐ చట్టం తీసుకు తీసుకువచ్చారని ఆర్టిఐ చట్టం లక్ష్యాన్ని నెరవేర్చేలా అన్ని కార్యాలయాల పిఐఓ లు ప్రజలు అడిగిన సమాచారాన్ని ఎలాంటి దాపరికం లేకుండా నిర్ణీత సమయంలో నిర్ణీత పద్ధతిలో అందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్టిఐ చట్టం అమలును ఆర్టిఏ చట్టం మార్గదర్శకాలు ప్రకారం అమలు



చేస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, జిల్లా అన్న కలెక్టర్ లోకల్ బాడీ చందర్ నాయక్, డిఆర్ఓ మధు మోహన్, ఎల్లారెడ్డి ఆర్డిఓ పార్థసింహారెడ్డి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ ఏవో, సెక్షన్ ఆఫీసర్స్, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పిఐఓలు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి దారుణ హత్య



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లోని సెంటినరీకాలనీ పరిధిలో దారుణ హత్య సంచలనం రేపుతోంది. శుక్రవారం మధ్యాహ్నం సెంటినరీ కాలనీ సీటూ 200 నంబర్ గల క్వార్టర్ వద్ద కోట చిరంజీవి (38) అనే యువకుడిని గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఇనుప రాడ్, కత్తి తో కొట్టి అతి కిరాతకంగా హతమార్చారు. స్థానికుల కథనం ప్రకారం, మృతుడు న్యూమారేడుపాక పోతనకాలనీకి చెందినవాడు కాగా, మీసేవా కేంద్రం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. హత్య జరిగిన సమయంలో చిరంజీవి సెంటిన రీకాలనీలోని ఐకేపీ కార్యాలయానికి రాగానే అదే సమయం లో ముగ్గురు దుండగులు అతని మీద దాడి చేసి, రాళ్లతో అతి దారుణంగా హత్య చేసినట్టు తెలుస్తోంది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు మేరకు మృతుడి భార్య కొంతకాలం క్రితమే మృతి చెందిందని, అనంతరం చిరంజీవి మరో మహిళతో సన్నిహితంగా ఉంటున్నట్టు సమాచారం. ఇదే పరిణామం ఈ హత్యకు దారితీసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనాస్థలానికి చేరుకున్న గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ రాజు, రామగిరి ఎస్ఐ టీ శ్రీనివాస్ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

# నవంబరు నాటికి చెరువులు సిద్ధం చేయాలి

- తమ్మిడికుంట పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాలి
- నల్లకుంట చెరువుతో పాటు పార్కులు పూర్తి కావాలి
- అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**కూకట్‌పల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మాధాపూర్లోని తమ్మిడికుంట చెరువు, కూకట్పల్లిలోని నల్లచెరువు అభివృద్ధి పనులు నవంబరు నాటికి పూర్తి కావాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. శుక్రవారం ఈ రెండు చెరువుల అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ రెండుచెరువులు పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందాలని సూచించారు. శిల్పారామం, మెటల్ చార్మినార్ వైపుల నుంచి వచ్చే ఇన్లెట్ల అభివృద్ధిలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా ఇన్లెట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు చుట్టూ బండ్ బయటవైపు రిటైనింగ్ వాల్ నిర్మించాలని, చెరువు లోపలి వైపు రాతి కట్టడం పటిష్టంగా ఉండాలన్నారు. 14 ఎకరాల చెరువును 29 ఎకరాలకు విస్తరించడం జరిగిందని, అదే విస్తీర్ణంలో నీరు నిలిచేలా చెరు వు అభివృద్ధి చేయాలని సూచించారు.



**శిల్పారామం వైపు ప్రధాన ప్రవేశం..**

ఓవైపు హైటెక్ సిటీ, మరోవైపు శిల్పారామం.. అందుకే తమ్మిడికుంట చెరువు ప్రధాన ప్రవేశ మార్గం కూడా అటువైపే ఉండేలా తీర్చిదిద్దాల ని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. చెరువుకు చుట్టూ రహదారుల నిర్మాణం జరగాలని, చెరువులోకి డ్రైనేజీ కలవకుండా చూడాలని సూచించారు. తమ్మిడికుంట చెరువు నుంచి వరద నీరు బయట కు సాఫీగా వెళ్లేలా అలుగు, వరద కాలువ నిర్మా ణాలు జరగాలని సూచించారు. చెరువు చుట్టూ దాదాపు 3 కిలోమీటర్ల మేర ఉన్న పాత్వేలో ప్రాణ (ఆక్సిజన్) వాయువు అందించడంతో పాటు చల్లటి నీడనిచ్చే చెట్లు పెంచాలన్నారు. భవి ష్యత్తులో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, బయటకు.. తమ్మిడికుంట చెంత కనీసం 3 నుం చి4 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత తగ్గేలా చూడాలని సూచించారు.

**నల్లచెరువు చెంత సేదదీరేలా..**

కూకట్పల్లి నల్లచెరువు చుట్టూ వేలాది నివాసాలున్నాయి. లక్షలాదిమంది నివసిస్తున్నారు. వీరందరూ సేదదీరేలా నల్లచెరువును అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు. నల్లచెరువు చుట్టూ పాత్ వేను విశాలంగా అభివృద్ధి చేస్తే స్థానికులు పెద్దయెత్తున వాకింగ్ చేసే వెసులుబాటు ఉంటుందన్నారు. చెరువు ప్రధాన ప్రవేశ ద్వారం విస్తీర్ణం పెంచాలని, ఆ పక్కనే పిల్లలు, పెద్దలు సేదదీరే విధంగా పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు ఇన్లెట్, ఔట్లెట్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. చెరువులోకి మురుగు నీరు కలవకుండా నిర్మిస్తున్న కాలువ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అక్కడ పనులు పర్యవేక్షిస్తున్న జలమండలి అధికారులకు సూచించారు. గతంలో 17 ఎకరాల మేర ఉన్న చెరువు ఆక్రమణలను తొలగించి 27 ఎకరాలుగా తీర్చిదిద్దుతున్న తీరును చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ చెరువు అభివృద్ధితో మా ప్రాంతం ఆహ్లాదకరంగా మారిందంటూ కమిషనర్ ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# 42 శాతం ఫిట్ మెంట్‌తో పిఆర్సిని అమలు చేయాలి

- గెజిటెడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు

**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు 42% పిట్ మెంట్ తో పి.ఆర్. సి. ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ యూనియన్ అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మెదక్ జిల్లాలోని పాపన్నపేట మండలం ఏడుపాయలలో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. సత్యనారాయణ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ కార్యవర్గం, తెలంగాణ (33) జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, సచివాలయం, హైదరాబాద్ సిటీ అధ్యక్ష కార్యదర్శులతో పాటు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (106) శాఖల ఫోరమ్స్ అధ్యక్ష కార్యదర్శులు మహిళా విభాగం కార్యవర్గం పాల్గొన్నారు. పలు ముఖ్యమైన విషయాలపై విస్తృత మైన చర్చ అనంతరం



ఈ క్రింది తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు బి.శ్యామ్, కోశాధికారి, ఎం.ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏ, జగన్మోహన్ రావు, ఎస్. సహదేవ్, ఎం. రామకృష్ణ గౌడ్, ఎస్.నరహరి రావు, ప్రొ. జి. మల్లేశం, సెక్రటరీస్ ఏ పరమేశ్వర్ రెడ్డి, శిరీష, కె. శ్రీనివాస్ రెడ్డి, డా.టి.హరికృష్ణ, పి శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ కె. కిరణ్ కుమార్, ఆఫీస్ సెక్రెటరీస్ ఆర్. శ్రీనివాస్ మూర్తి పాల్గొన్నారు.

# మంచినీటికి మహాగోస

**పాపన్నపేట, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** మండల కేంద్రం పాపన్నపేటలో మూడు రోజులుగా నల్లాల ద్వారా మంచి నీటి సరఫరా జరగలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ వార్డులలో మోటారు బోర్లు సైతం పనిచేయక పోవడంతో వారు వాపోయారు. కొద్దీ



పాటి నీటి కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని చోట్ల ప్రజలే విద్యుత్ మోటారు బోర్ల వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. కాగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు అధికారులను కోరారు .

# పోలీసులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి
- మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ కార్యాలయం వార్షిక తనిఖీ

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్10 (జనంసాక్షి):** వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా పోలీస్ అధికారి డి. జానకి, మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, ట్రాఫిక్ వ్యవస్థను మరింత క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించడం, బాధితులకు తక్షణ సహాయం అందించ డంలో పోలీసు అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, దొంగతనాలు వంటి ఘటనలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ఎస్పీ అన్ని




రికార్డులు, రిజిస్టర్లు, దర్యాప్తు ఫైళ్ళను స్వయంగా పరిశీలించి, సిబ్బంది పనితీరు, క్రమశిక్షణ, ప్రజా సేవా ధోరణి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విధుల్లో నిజాయితీ, బాధ్యత, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రమణారెడ్డి, మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్, మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై, హన్వాడ ఎస్సై, నవపేట్ ఎస్సై, కోయిలకొండ ఎస్సై, మహమ్మదాబాద్ ఎస్సై, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### డేటా ఆధారిత యూజ్ కేస్ పోటీలలో..

# గద్వాల కలెక్టర్‌కు 2వ స్థానం

**గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 10 (జనంసాక్షి):** డేటా ఆధారిత యూజ్ కేస్ పోటీ- 2024-25 లో తెలంగాణలో జోగులాంబ గద్వాల జిల్లా జిల్లా కలెక్టర్ సంతోష్‌కి విద్యా రంగంలో 2వ స్థానంలో అవార్డుకు ఎంపిక యిన సందర్భంగా శుక్రవారం జిల్లా విద్యా శాఖ అధికారి విజయలక్ష్మి కలెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగినది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనకు ఈ అవార్డుతో పాటు ప్రభుత్వం నుండి లక్ష రూపాయల క్యాష్ ప్రైజ్ కూడా లభించనుం దని, ఈ అవార్డుకు కారణమైన ఉపాధ్యా యులను కలెక్టర్ అభినందించారు. అదేవి ధంగా



రాబోవు పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో కూడా జోగులాంబ గద్వాల జిల్లాను రాష్ట్రంలో ముందు స్థానంలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎసిఇ శ్రీనివాసులు,జిల్లా సమన్వయ అధికారి హంపయ్య పాల్గొన్నారు.

# అన్న మరణ వార్త విని.. ఆగిన తమ్ముని గుండె

- సంతాపం తెలిపిన జడ్చర్ల బృందావనం సభ్యులు

**జడ్చర్ల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** అన్న మరణ వార్త విన్న తమ్ముడు గుండెపోటుతో కుప్పకూలిన విషాద ఘటన జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సోదరులలో పెద్ద వాడైన నరసింహా రావు (65) వనపర్తి పట్టణంలో మృతి చెందగా, తమ్ముడు వలిపే సురేందర్ రావు (63) హైదరాబాద్ లోని ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఒకే రోజు అన్నదమ్ములు ఇద్దరు గుండె పోటుతో మృతి చెందడంతో కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది. వనపర్తిలో నివాసం ఉంటు న్న నరసింహా రావు గురువారం తెల్లవారు జా మున బాత్రూంకు వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలి పో యారు. జడ్చర్ల హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన సురేందర్ రావు ఇటీవల అస్వస్థకు గురై హైదరా బాద్ లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా బుధవారం గుండెకు స్టంట్స్ వేశారు. గురువారం ఉద




యం తన అన్న మరణ వార్త విన్న సురేందర్ రావు ఆస్పత్రిలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి హఠాన్మరణం చెందారు. ఇలా ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందడంతోఆ కుటుంబంలో విషాదం నింపింది.

**సంతాపం తెలిపిన జడ్చర్ల బృందావనం సభ్యులు**

జడ్చర్ల పట్టణానికి చెందిన సురేందర్ రావు ఆకస్మిక మరణం చెందడంతో పట్టణానికి చెందిన బృందావనం సభ్యులు లక్ష్మీ నరసింహా రావు, ప్రవీణ్, శిరీష్, వెల్దండ శ్రీధర్ రావు, రాఘవేందర్ రావు తదితరులు సంతాపం తెలిపారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా బోధించాలి

**గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 10 (జనంసాక్షి):** విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు వారిలో నైపుణ్యాలు పెంపొందేల ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు.ఇటిక్యాల మండలం ఎర్రవల్లిలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో పాఠాలు చదివించి ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు పాఠాలు అర్థం చేసుకొని ప్రతిభ చాటేలా కృషి చేయాలని సూచించారు. దసరా సెలవులు ముగిసినప్పటికీ విద్యార్థులు పూర్తిస్థాయిలో విద్యాలయానికి రాకపోవడమేమిటిని హాజరు శాతం పెరగాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కంప్యూటర్లు మంజూరైనప్పటికీ తరగతులు నిర్వహించకపోవడం ఏమిటి అని కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వర్ణలతను అడిగారు. జిల్లాలో ఉన్న అన్ని కేజీబీవీలలో విద్యార్థినిలకు కంప్యూటర్ తరగతులు నిర్వహించాలని,ఏమైనా



సమస్యలు ఉంటే పరిష్కరించాలని సెక్టోరియల్ అధికారి హంపయ్యను ఆదేశించారు. జిల్లాలోని అన్ని విద్యాలయాల్లో విద్యార్థులకు చక్కగా బోధన అందజేస్తే మంచి ఫలితాలు వస్తాయని డీఈవో విజయలక్ష్మికి సూచించారు. అనంతరం స్టోర్ రూమ్ లో సరుకులను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. కేజీబీవీ పరిసరాల్లో పలు సమస్యలను అక్కడి ఉపాధ్యాయులు కలెక్టర్



దృష్టికి తీసుకువచ్చారు. విద్యాలయం చుట్టూ పూర్తిస్థాయిలో ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి సమస్యలు పరిష్కరి స్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ పటాలములో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పలువురు విద్యార్థులతో పాఠాలు చదివించి, పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

# ప్రభుత్వ భూమిని రక్షించండి

- కబ్జా ప్రయత్నాలపై చర్యల కోసం హైడ్రా కమిషనర్ కు ఎమ్మెల్యే లేఖ

**అల్వాల్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ అశోకనగర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి రక్షించి ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలంటూ స్థానికులు పత్రికా సమావేశం నిర్వహించారు. సర్వే నంబర్ 605లోని 90 గజాల స్థలాన్ని కాపాడి, అక్కడ సామాజిక భవనం నిర్మించాలనే డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కాలనీవాసులు తెలిపారు. కార్పొరేటర్ భర్త అనిల్ కిషోర్ రూ.10




లక్షలు డిమాండ్ చేశాడని ఆరోపణలను బస్తీవాసులు దుష్ప్రచారం అని ఖండిస్తూ, కబ్జాదారులపై తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిని రక్షించడానికి కృషి చేస్తున్న వ్యక్తులపై తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని అన్నారు, ప్రభుత్వం కబ్జాదారుల మోసపూరిత చర్యల నుంచి భూమిని రక్షించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేశారు. సర్వే నంబర్ 605లోని 90 గజాల విస్తీర్ణంలో ఉన్న భూమి ప్రభుత్వానికి చెందినదని నిర్ధారణ అయిందని, దానిపై కంచె ఏర్పాటు చేసి రక్షించాలంటూ హైడ్రా కమిషనర్ కు లేఖ రాశారు. అశోకనగర్ 135వ డివిజన్ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు స్థానికులు ఆక్రమణ భయం ఉందని ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సర్వేయర్, కార్పొరేటర్, కాలనీవాసుల సమక్షంలో సంయుక్త సర్వే నిర్వహించారని ఆయన వివరించారు. ప్రజా ప్రయోజనార్థం భూమి రక్షణకు చర్యలు తీసుకోవాలని, వెంటనే కంచె ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే హైడ్రా అధికారులను కోరారు. ఈ సమావేశంలో శంకర్, సురేందర్, సత్యనారాయణ, భగవాన్, నాగేశ్వరరావు, విగ్నేష్, దినేష్ అనేకమంది మహిళలు పాల్గొన్నారు.

### బీరంగూడ - కిష్టారెడ్డిపేట రహదారి పరిధిలో..

# కోటి 50 లక్షలతో జంక్షన్ల అభివృద్ధి

- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, అక్టోబర్ 10 (జనంసాక్షి):** బీరంగూడ నుండి కిష్టారెడ్డిపేట ఔటర్ రింగ్ రోడ్డు వరకు 68 కోట్ల రూపాయలతో చేపట్టిన 100 ఫీట్ల రహదారి విస్తరణలో భాగంగా మండే మార్కెట్ జంక్షన్, గ్రీన్ ఫీల్డ్ జంక్షన్, పటేల్ గూడ డబుల్ బెడ్ రూమ్ జంక్షన్లను ఒక కోటి 50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి కూడళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ - కిష్టారెడ్డిపేట రహదారి పరిధిలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా గత ప్రభుత్వ హయాంలో బీరంగూడ కిష్టారెడ్డిపేట రహదారి విస్తరణ కోసం 68 కోట్ల రూపాయల కేటాయించి.. 100 ఫీట్ల రహదారిగా విస్తరించడం జరిగిందని తెలిపారు. రహదారి పరిధిలోని మండే మార్కెట్, గ్రీన్ ఫీల్డ్ జంక్షన్, పటేల్ గూడ డబుల్ బెడ్ రూమ్ జంక్షన్ల అభివృద్ధికి ఒక కోటి 50 లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ జంక్షన్ లో శివాజీ విగ్రహం, పటేల్ గూడా డబుల్ బెడ్ రూమ్ జంక్షన్ లో మహాత్మా గాంధీ విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేయబో



తున్నట్లు తెలిపారు. త్వరలో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సింఫనీ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీశైలం జాతీయ రహదారిపై అక్రమ నిర్మాణాలు...?

- పట్టించుకోని ఎన్ హెచ్ఏఐ అధికారులు

**మహేశ్వరం, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మహేశ్వరం మండలం జాతీయ రహ దారి లే మూర్ గేట్,రాచులూరు గేట్, తుమ్మలూరు గేట్,కొత్తూరు గేట్ సమీపంలో ఉన్న పెట్రోల్ పంపుల యజమానులు శ్రీశైలం జాతీయ రహదారిపైనే సిమెంట్ ఇటు కలతో అక్రమ నిర్మాణాలు చేపట్టారు .శ్రీశైలం జాతీయ రహదారి ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. రహదారి పైనే సిమె ంట్ ఇటుకలతో నిర్మాణాలు చేపట్టడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు.రహదారి పైన ప్రయాణించేటప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలు, వెనుక నుంచి వచ్చే వాహనాలు ఓవర్ టెక్ చేసే సమయంలో పెట్రోల్ బంక్ యజమానులు నిర్మించిన అక్రమ నిర్మాణాలు ఢీకొని పలు మార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. జాతీయ రహదారి పైన అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ఎన్ హెచ్ఏఐ అధికారులు మౌనం వహిస్తున్నారు.ఇటీవల తుమ్మలూరు గేట్ సమీపంలో ఉన్న ఇండి యన్



పెట్రోల్ పంపు యాజమాన్యం ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను ఢీ కొని ప్రమాదానికి గురయ్యారు.తుక్కుగూడ మున్సిపాలిటీ నుంచి నేదునూరు గేట్ వరకు శ్రీశైలం జాతీయ రహదారిపై విచ్చలవిడిగా టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్ లు,హోటళ్లు పదుల సంఖ్యలో వెలుస్తున్నాయి. హోటల్ కి వెళ్ళే వారు రోడ్డు మీదనే పార్కింగ్ చేస్తున్నారు.దీంతో రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎన్ హెచ్ఏఐ అధికారులు టిఫిన్ సెంటర్ల నుంచి నెలనెల మామూలు వసూలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా శ్రీశైలం జాతీయ రహదారిపై నిర్మిస్తున్న అక్రమాలను అరికట్టాలని ప్రయాణికుల పేర్కొంటున్నారు.

# పత్తి చేలకు వెళ్తున్న 30 మంది విద్యార్థుల విముక్తి


- మగ్దూంపూర్ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ



**లింగాల అక్టోబర్ 09 (జనంసాక్షి) :** పత్తి చేలకు వెళ్తున్న 30 మంది విద్యార్థుల విముక్తి కల్పించినట్లు లింగాల ఎస్సై వెంకటేష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని లింగాల మండలం మగ్దూంపూర్ గ్రామ శివారులో లింగాల ఎస్సై వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా ఏఎస్టియు, సిసిఎస్, సిఐ శంకర్, సి టీం ఎస్సై రజిత ముఖ్య అతిథిగా పాల్గొని వాహనాలను తనిఖీలు చేశారు. ఏడు వాహనాలలో విద్యార్థులను పత్తి చేలకు తరలిస్తుండగా వాటిని తనిఖీలు నిర్వహించి అందులో వెళ్తున్న 30 మంది విద్యార్థులను విముక్తి కల్పించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాల. వాహనాలకు ఈ పిట్టి కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ టియు, స్థానిక ఎస్సై వెంక టేష్ గౌడ్, సి టీం ఎస్సై రజిత, కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్, కానిస్టేబుల్ హెడ్ కానిస్టేబుల్ పర్వన్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర శర్మ, పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యమే అసలైన సంపద

**హైదరాబాద్ సిటీ/మల్కాజిగిరి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** సైకాలజిస్ట్ లు ఎదుర్కొంటున్న సమస్యల్ని రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, సమస్యల పరిష్కారానికి తనవంతుగా చేస్తానని మల్కాజిగిరి నియోజక వర్గ శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు.శుక్రవారం జరిగిన తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ మరియు హెలెన్ కెల్లర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని సరస్వతి ఫక్షన్ హాల్ లో నిర్వహించిన "ప్రపంచ మానసిక ఆరోగ్యవ దినోత్సవ "ప్రారంభ వేడుకల్లో ప్రసంగిస్తూ కార్యక్రమం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా వుంది అని అన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం అత్యంత ముఖ్యం. వ్యక్తి శారీరక ఆరోగ్యంగా వుండాలి అంటే మానసికంగా ఆరోగ్యం చాల ముఖ్యం. ప్రతి ఒక్కరు ఎన్నో ఒత్తిడులకు లోనవుతూ రకరకాల మానసిక వ్యాధుల బారిన పడుతున్నారు. వారిలో మనో స్థైర్యాన్ని నింపాల్సింది సైకాలజిస్ట్ లే అని అన్నారు. ఈనాటి యువత మానసిక ఆరోగ్యం దేశానికి ఎంతో ముఖ్యమని, జీవన విధానాల్ని మార్చుకోవలసిన అవసరముందన్నారు. ఒత్తిడులతో జీవితాల్ని అర్ధంతరంగా ముగించుకోవడం సరికాదన్నారు. మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి మాట్లాడుతూ మారుతున్న ప్రపంచంలో సవాళ్ళను ధీటుగా ఎదుర్కోవడానికి యువత మానసిక అనారోగ్యానికి గురై వ్యతిరేక దోరణులతో సమాజంలో సంఘ విద్రోహక చర్యలకు పాల్పడుతున్నారని, హత్యలు, ఆత్మ హత్యలకు పాల్పడుతున్న వారిని చూస్తూనే వున్నాం అని అన్నారు. ఇది ఒక సామజిక బాధ్యతగా భావించి టిపి ఏ సైకాలజిస్టు యువత ఆత్మహత్యల వైపు దారి మల్లకుండా వారిలో అవగాహన కల్పించడం మానసిక పరివర్తనకు ముందుకు రావడం నిజంగా ఒక శుభపరిణా మం అన్నారు. వారి మానసికస్థితిని గమనించి కౌన్సిలింగ్ అందించాల్సిన అవసరం ఎంతైనా వుందని అన్నారు. మానసిక వైకల్యం లేదా మానసిక ఆలోచన వైకల్యం కలవారిని భావిభారత పౌరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత సైకాలజిస్ట్ పై వున్నదని అన్నారు. హెలెన్ కెల్లెర్ గ్రూప్ ఆఫ్ ఇన్సిటూషన్స్ చైర్మన్ ప్రొఫ్ లయన్



పఠాన్ ఉమర్ ఖాన్ మాట్లాడుతూ.. ఈనాడు అంతర్జాలమాయలో పడి మనవ సంబంధాలు మరచి పోతున్నారు. సోషల్ మీడియా, సెల్ ఫోన్ ప్రపంచం లో మునిగి ప్రపంచం ఇదే అనే రీతిలో తన చుట్టూ వున్న కుటుంబ సభ్యులతో కనీసం పలుకరించే స్థితి లో లేకుండా పోతున్నారు. ఈ వ్యసనంతో మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం 2025 లో థీమ్ సహజంగా విపత్తులు, అత్యవసర పరిస్థితులలో మానసిక ఆరోగ్య సేవలకు ప్రాధాన్యత అనే అంశంపై డా ప్రవీణ్ కుమార్ సైకియాట్రిస్ట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా మోతుకూరి రాంచందర్ మాట్లాడుతూ.. ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా హైదరాబాద్ , తెలంగాణ లోని అన్ని జిల్లాలలో తమ సంఘం ద్వారా ఈ సంవత్సరం థీంకి అనుగుణంగా సంఘ సైకాలజిస్టులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సంఘం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకులు రాజు ఆచార్య, వైదేహి, నాయకులు అలియా పర్వీన్, డా వెంకటేశ్వర్లు, సోనాలి నాగ్దేవ్, కల్నల్ హ్యారీస్ శంకర్ దాస్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
11 అక్టోబర్ 2025

# హైడ్రా దూకుడు

## ఒకేసారి నాలుగు ప్రాంతాల్లో కబ్జాల నుంచి విముక్తి

- దాదాపు 12.50 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- దాదాపు రూ. 1100 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా





**హైదరాబాద్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** నగరంలో పలు చోట్ల ఆక్రమణలను శుక్రవారం హైడ్రా తొలగించింది. ఒకేసారి నాలుగు ప్రాంతాల్లో కబ్జాల నుంచి ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించింది. 12.50 ఎకరాల మేర ప్రభుత్వ భూమిని కాపాడింది. దీని విలువ రూ. 1100ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10లో మొత్తం 5 ఎకరాల మేర ఉన్న కబ్జాలనుతొలగించింది. ఇక్కడ ఈ భూమి విలువ రూ. 750 కోట్ల వరకూ ఉంటుందని భావిస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 7.50 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోగా.. రంగారెడ్డిజిల్లాలో ప్రజావసరాలకు ఉద్దేశించిన 680 గజాల స్థలాన్ని హైడ్రా శుక్రవారం కాపాడింది.

### తప్పుడు సర్వే నంబరుతో..

షేక్‌పేట మండలం, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10లోని సర్వే నంబరు 403లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాల చెర నుంచి హైడ్రా విడిపించింది. దీని విలువ రూ. 750 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. లేని సర్వే నంబరు(403/52)తో.. అన్ రిజిస్టర్డ్ సేల్‌డీడ్‌ను సృష్టించి ఈ భూమి తనదంటూ పార్థసారధి అనే వ్యక్తి కబ్జాకు పాల్పడినట్టు రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తాగు నీటి వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఇందులో 1.20 ఎకరాల భూమిని జలమండలికి ప్రభుత్వం ఇచ్చినా అక్కడ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారనేది మరో ఫిర్యాదు. ఈ రెండు ఫిర్యాదులను హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని ఆక్రమణలను శుక్రవారం తొలగించింది.

### వేట కుక్కలతో కాపలా..

చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్లతో పాటు వేటకుక్కలతో కాపాలా పెట్టి అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో పార్థసారథిపై బంజారా హిల్స్ పోలీసు స్టేషన్లో 4 క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. కోర్టులో వివాదం ఉండగా.. మొత్తం 5 ఎకరాల భూమిని తన ఆధీనంలోకి తీసుకొని అందులో షెడ్డు లు వేసి.. ప్రభుత్వ భూమినే అడ్డా వేసుకొని మద్యం సేవించి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు ఫిర్యాదులున్నాయి. ఫేక్ సర్వే నంబర్ (403/52) తో ప్రభుత్వ భూమి కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారని రెవెన్యూ అధికారులు కేసులు పెట్టారు. షేక్పేట రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య ఆక్రమణలను హైడ్రా తొలగించింది. పార్థసారథి వేసిన ఫెన్సింగ్ తో పాటు లోపల ఉన్న షెడ్డులను నేలమట్టం చేసింది. 5 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను హైడ్రా ఏర్పాటు చేసింది.

### మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోనూ..

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం మహాదేవపురం లో పార్కులు, ప్రజావసరాల కు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా క్షేత్రస్థాయిలో విచారించి శుక్రవారంచర్యలుతీసుకుంది. 3.50 ఎకరాల మేర పార్కు స్థలంలో ఆక్రమణలను తొలగించింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ విలేజ్ ఏజీ ఆఫీసు ఉద్యోగులకు చెందిన హౌసింగ్ సొసైటీ లే ఔట్‌లో కూడా పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన 3 ఎకరాల ల్యాండ్ కబ్జాకు గురి కాగా హైడ్రా శుక్రవారం ఆక్రమణలను తొలగించింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం తట్టి అన్నారం విలేజ్ శ్రీలక్ష్మి గణపతి కాలనీలో కూడా 680 గజాల మేర విస్తరించిన పార్కు ఆక్రమణలను కూడా హైడ్రా తొలగించింది. ఇందులో 270 గజాల ప్లాట్ తనకుందంటూ పార్కు స్థలంలోనే పాగా వేసేందుకు ప్రయత్నించగా స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. క్షేత్రస్థాయిలో విచారించిన దరిమిలా పార్కు స్థలాన్ని మొత్తం కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

# వేములవాడ లడ్డూ ఘటనపై మంత్రి కొండా సురేఖ ఆరా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వేములవాడ లడ్డూ ఘటనపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరా తీశారు. ఘటనకు సంబంధించిన సమగ్ర విషయాలు అందజేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. లడ్డూపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేఖ రాసినట్టు ఆలయ ఆలయ ఈఓ రమాదేవి స్పష్టం చేశారు. ఎక్కడా ఎటువంటి లోపం జరగలేదని వెల్లడించారు. అయినా, భక్తుల మనోభావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. దీంతో ఎటువంటి తప్పిదాలు జరగొద్దని.. జాగ్రత్తగా ఉండాలని మంత్రి కొండా సురేఖ కీలక సూచనలు చేశారు. ఆలయ ప్రతిష్టకు సంబంధించిన వ్యవహారాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఘటనకు సంబంధించిన సమగ్ర విషయాలు అందజేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు లడ్డూపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ.ఓ రమాదేవి మంత్రికి తెలిపారు. లడ్డు అంశంపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేఖ రాసినట్టు, ఎక్కడా ఎటువంటి లోపం జరగలేదనీ, అయినప్పటికీ భక్తుల మనోభావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్టు ఈఓ తెలిపారు. ఆలయంలో ఎటువంటి తప్పిదాలు జరగొద్దని, జాగ్రత్తగా ఉండాలని మంత్రి కీలక సూచనలు చేసినట్టు, ఆలయ ప్రతిష్టకు సంబంధించిన వ్యవహారాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించినట్లు ఈఓ రమాదేవి స్పష్టం చేశారు.

# బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధిలేని కాంగ్రెస్

- ప్రజాక్షేత్రంలో పరువు తీసుకుంది
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**కరీంనగర్, అక్టోబర్10 (జనంసాక్షి) :** బీసీల పట్ల కాంగ్రెస్‌కు నిజాయితీ, చిత్తశుద్ధి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పరువు తీసుకుందన్నారు. కాంగ్రెస్ ఇంత మూర్ఖంగా వ్యవహరిస్తుందని ఎవరూ అనుకోలేదని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి వంచించారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు సలహాలు ఇచ్చింది ఎవరో అర్థం కాలేదని తెలిపారు. బీసీ రిజర్వేషన్ అంశం రాజ్యాంగానికి సంబంధించిన దన్నారు. రేవంత్ రెడ్డికి సత్తా ఉంటే.. ఢిల్లీలో ధర్నా ఎందుకు చేశారో తెలియదన్నారు. కాంగ్రెస్ నేతలు చెంపలేసుకుని.. ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే జరిపించాలని పట్టుబ డ్డారు. హామీ ఇచ్చే ముందు కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందో తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లోపు పాత సర్పంచ్‌లకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఎంపీ డిమాండ్ చేశారు. 'హుజురాబాద్‌లో బీ ఫామ్స్ నేనే ఇస్తా.. ఇక్కడ నేను 25 ఏళ్లుగా లీడర్‌ను.. నేను కాకుండా బీ ఫామ్స్ ఇంకెవరు ఇస్తారు' అని రాజేందర్ ప్రశ్నించారు.

# లిక్కర్ స్కామ్ కేసులో ఊరట

- చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ముందస్తు బెయిల్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** ఏపీ పాలిటిక్స్ లో తీవ్ర దుమారం రేపిన లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎ 39గా ఉన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది సుప్రీంకోర్టు. మోహిత్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ పై శుక్రవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో ఏపీ సర్కార్ కు నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. లిక్కర్ స్కాం కేసులో మోహిత్ రెడ్డిని ఎ39 గా ఉండగా.. ఎ38గా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రస్తుతం విజయవాడ జైల్లో జ్యూడిష రిమాండ్ లో ఉన్నారు. 2025 జూన్ 18న చెవిరెడ్డిని అరెస్ట్ చేశారు పోలీసులు. లిక్కర్ స్కాం ద్వారా వచ్చిన డబ్బులు మోహిత్ రెడ్డి ప్రభుత్వ వాహనాల ద్వారా తరలించారని సిట్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా.. లిక్కర్ స్కాంలో బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు మోహిత్ రెడ్డి. హైకోర్టులో మోహిత్ రెడ్డికి దక్కకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మోహిత్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ పై ఇవాళ విచారణ జరిపిన సుప్రీంకోర్టు మోహిత్ రెడ్డి వాదనలతో ఏకీభవించి ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

# అలకబూనిన అంజన్ కుమార్ యాదవ్

- బుజ్జగించిన కాంగ్రెస్ పెద్దలు
- కలసి పనిచేయాలని నిర్ణయం



**హైదరాబాద్, అక్టోబర్10 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో అలకబూనిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ బుజ్జగించారు. అంజన్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ఏ పరిస్థితుల్లో టికెట్‌ను వేరే వాళ్లకు కేటాయించాల్సి వచ్చిందనే విషయాన్ని ఆయనకు వివరించారు. అనంతరం అంజన్‌తో పాటు పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ చర్యలతో మనస్తాపానికి గురైనట్లు అంజన్‌కుమార్ యాదవ్ తెలిపారు. కష్టకాలంలో పార్టీ వెంట ఉన్న తనను ఇప్పుడు పక్కనపెడతారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో నేను చాలా సీనియర్ నేతను. నేనెప్పుడూ ఓడిపోలేదు.. అందరూ కలిసి ఓడగొట్టారు. నాకు టికెట్ ఇస్తే గెలిచేవాడిని. కరోనాతో వెంటిలేటర్‌పై వైద్యం చేయించుకున్నా. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేశాను. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టాను. రెండు సార్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాను. రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే నా ముఖ్య ఉద్దేశం అని అంజన్‌కుమార్ అన్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అందరూ జూబ్లీహిల్స్‌లో అంజన్‌కుమార్ యాదవ్ పోటీచేయాలని భావించారని.. అధిష్ఠానం వేరేవాళ్లకు టికెట్ కేటాయించిందన్నారు. కరోనా సమయంలో అంజన్‌కుమార్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని.. ఆయన కూడా కరోనా బారిన పడ్డారని చెప్పారు. నగరంలో కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని, అంజన్ సారథ్యంలోనే ఎన్నికల్లో పార్టీ ముందుకు వెళ్తుందని తెలిపారు. ఉప ఎన్నికలో అందరం కలిసి పనిచేస్తామని పొన్నం పేర్కొన్నారు.

# పెన్షన్ అంటూ వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

- ఫిర్యాదుతో దొంగను పట్టుకునే పనిలో పోలీసులు

**పెద్దపల్లి, అక్టోబర్10 (జనంసాక్షి) :** తెలంగాణ వ్యాప్తంగా చైన్ స్నాచింగ్ కేసులు ఎక్కువవుతున్నాయి. ఒంటరిగా వెళ్తున్న మహిళలను, వృద్ధురాళ్లను టార్గెట్ గా చేసుకుని చైన్లు లాక్కెళ్ళుతున్నారు. కొందరు మాయమాటలు చెప్పి నమ్మించి బంగారు చైన్లు లాక్కెళ్తున్నారు. తాజాగా శుక్రవారం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలిని పెన్షన్ వచ్చిందని నమ్మించి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు ఓ దుండగుడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారంలో చోటు చేసుకుంది. ధర్మారం మండల కేంద్రానికి చెందిన బుదారపు శంకరమ్మ(67) ఉదయం ధర్మారం మెయిన్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తి వచ్చి పరిచయం చేసుకున్నాడు. నీకు రూ. 4000 రూపాయల పెన్షన్ మంజూరు అయ్యిందని ఫోటో అప్లోడ్ చేయాలని నమ్మించి వృద్ధురాలిని పక్కకు తీసుకెళ్లాడు. మెడలోని బంగారు పుస్తెల తాడు ఫోటోలో కనిపిస్తే పెన్షన్ రాదని చెప్పడంతో శంకరమ్మ తన పుస్తెల తాడు తీసి అతని చేతిలో పెట్టింది. దీంతో ఒక్కసారిగా సదరు వ్యక్తి బంగారు పుస్తెల తాడు తీసుకుని పరారయ్యాడు. దీంతో లబోదిబో మంటూ మోసపోయిన వృద్ధురాలు ధర్మారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అక్కడ ఉన్న మొబైల్ షాపులోని సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# గవాయ్‌పై దాడికి ముందే దళిత ఐపీఎస్ ఆత్మహత్య

- ఇలాంటి పరిస్థితులు ఎక్కడివంటూ ఎక్స్‌లో కేజ్రీవాల్ ప్రశ్న



**న్యూఢిల్లీ, అక్టోబర్10 (జనంసాక్షి) :** సిజెఐ గవారుపై జరిగిన దాడి మరువకముందే తాజాగా హర్యానా సీనియర్ దళిత ఐపిఎస్ అధికారి పురాన్ కుమార్ తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పురాన్ ఆత్మహత్యపై ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆవేదన చెందారు. కుల వేధింపుల వల్లే ఐపిఎస్ అధికారిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాయని కేజ్రీవాల్ ఆరోపించారు. దోషులకు వీలైనంత త్వరగా కఠిన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టులో చేశారు. ఈ సందర్భంగా ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవారుపై చెప్పు విసరబోయిన ఘటనను కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. గవారుపై దాడికి సంబంధించిన ఘటనపై సోషల్ మీడియాలో దళితుల్ని, భారత రాజ్యాంగాన్ని రచించిన బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవమానిస్తూ ట్రోల్ చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు ఈరోజు భారతదేశాన్ని ఎక్కడికి తీసుకువచ్చారనో ఎక్స్ పోస్టులో కేజ్రీవాల్ ప్రశ్నించారు.

# గన్నవరం ఎయిర్‌పోర్టులో జనార్ధన్‌రావు అరెస్ట్

**విజయవాడ, అక్టోబర్10 (జనంసాక్షి) :** అన్నమయ్య జిల్లా ములకల చెరువులో నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఏ1గా ఉన్న విజయవాడకు చెందిన జనార్ధన్‌రావును గన్నవరం ఎయిర్‌పోర్టులో ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దక్షిణాఫ్రికా నుంచి జనార్ధన్ విజయవాడ వస్తున్నాడని తెలుసుకున్న పోలీసులు.. గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. విజయవాడకు చెందిన జనార్ధన్‌రావు, అతని అనుచరుడు రాజు కలిసి ములకలచెరువు కనుగొండ ఆర్చి ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల దాడులు నిర్వహించి రూ. 1.75 కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.

# కొట్లాడడమే జాగృతి లక్ష్యం

- ఇచ్చిన హామీల కోసం ప్రభుత్వంతో పోరాటం
- జాగృతి అధ్యక్షురాలు కవిత పిలుపు



**హైదరాబాద్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** జాగృతిలో చేరడమంటే బతుకమ్మ ఆడినట్లు ఉంటుందని.. అదే విధంగా పిడికిలెత్తి పోరాటం చేయాల్సి ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పోరాటాలు జాగృతి రక్తంలోనే ఉన్నాయని అన్నారు. తెలంగాణ పోరాటంలో అగ్రభాగాన నిలబడ్డామని అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో పలువురు తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి తమ సంస్థలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు రూ. 2,500 నెలకు ఇస్తామని మోసం చేసిందని.. అందుకోసం కొట్లాడాలంటూ సంస్థలోని సభ్యులకు ఆమె పిలుపు నిచ్చారు. ప్రసవం కోసం ఆస్పత్రులకు వెళ్లిన మహిళలకు గతంలో కేసీఆర్ కిట్ వచ్చేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అది కూడా ఆగిపోయిందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ఆడబిడ్డలకు కిట్ల సాధన కోసం ప్రభుత్వంపై కొట్లాడాలని సూచించారు. పేదింటి బిడ్డ పెళ్లికి ఇస్తానన్న తులం బంగారం కోసం కొట్లాడుదామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలంటూ గద్దెనెక్కి కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీ బిల్లు తెస్తామని.. తీసుకు రాలేనందుకు కు జాగృతి ఆధ్వర్యంలో కొట్లాడదామని పేర్కొన్నారు. జాగృతి అంటేనే పోరాటాల జెండా.. జాగృతి అంటేనే విప్లవాల జెండా అంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. ప్రజా సమస్యల పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

# బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్సే

- కాంగ్రెస్ నేత సామా కామెంట్స్



**హైదరాబాద్, అక్టోబర్10 (జనంసాక్షి) :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఎన్నికల నగారా మోగడంతో అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీల నేతలు, అధినేతలు కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరును ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే ఖరారు చేసింది. ఇక బీఆర్ఎస్ పార్టీ మాత్రం దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీతను బరిలో నిలిపింది. బీజేపీ సైతం అభ్యర్థిని ప్రకటించేందుకు సిద్ధమవుతుంది. తాజాగా బీజేపీలో చోటు చేసుకుంటున్న వరుస పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్సే అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. కారు గుర్తుకు ఓటు కమల పార్టీ బలోపేతానికే అంటూ హింట్ సైతం ఇచ్చారు. దిక్కుతోచని స్థితిలో బీజేపీ కార్యకర్తలు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు అంటూ ఆయన ఎద్దేవా చేశారు. చివరగా బీజేపీ ఈక్వల్ టూ బీఆర్ఎస్ అంటూ ఇంగ్లీష్ అక్షరాలతో రాసుకొచ్చారు. చివరగా జూబ్లీహిల్స్ బై ఎలెక్షన్స్ అంటూ ట్యాగ్ చేశారు. కారు, కమలం గుర్తులు ఉన్న ఫోటోలను ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370